
'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 61

గురువారం 23-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ముందస్తు ఎన్నికలకు సునాక్

పలురకాలుగా సాగిన ఊహాగానాలకు తెరదించుతూ జూలై 4న బ్రిటన్ సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని ప్రధానమంత్రి రిషి సునాక్ బుధవారం ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని రాజు చార్లెస్–3కి తెలిపానని, పార్లమెంట్ రద్దుకు ఆయన అనుమతించారని వెల్లడించారు. 6లో



చాలెంజర్స్ ఇంటికి...

ఐపీఎల్ రెండో క్వాలిఫయర్‌కు రాజస్తాన్ అర్హత సాధించింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఆర్‌సీబీపై 4 వికెట్ల తేడాతో నెగ్గింది.

వివరాలు 12లో ▸



బెంగాల్‌లో బంగ్లాదేశ్ ఎంపీ హత్య

చికిత్స కోసం భారత్‌కు వచ్చిన బంగ్లాదేశ్‌కు చెందిన ఆవామీ లీగ్ ఎంపీ అజీమ్ అన్వర్ హత్యకు గురయ్యారు.

వివరాలు 6లో ▸



ప్రధాని కావాలని లేదు

'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే ప్రధాని కావాలన్న ఆశ తనకు లేదని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

వివరాలు 6లో ▸



కాంగ్రెస్ ఖాతా తెరిచేనా?

ఈ నెల 25న 58 సీట్లకు జరగనున్న ఆరో విడత లోక్‌సభ ఎన్నికల్లో గెలుపుపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ నెలకొంది.

వివరాలు 6లో ▸

వాణిజ్య వడ్డన..!

వాణిజ్య, పారిశ్రామిక కేటగిరీలకు విద్యుత్ చార్జీల పెంపు యోచన


ఆదాయం పెంచుకునే మార్గాలపై విద్యుత్ సంస్థల దృష్టి

- ఎన్నికల కోడ్ ముగియగానే ఈఆర్సీకి టారిఫ్ ప్రతిపాదనలు
- నిజానికి ఏప్రిల్ నుంచే అమల్లోకి రావాల్సిన కొత్త టారిఫ్‌లు
- ఎన్నికల నేపథ్యంలో ప్రతిపాదనలు సమర్పించని డిస్కంలు
- కాంగ్రెస్ సర్కారు నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే జూన్‌లోనే ప్రతిపాదనలు

సాక్షి, హైదరాబాద్

నష్టాలు, అప్పుల భారంతో సంక్షోభంలో ఉన్న రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు ఆదాయం పెంచుకునే మార్గాలపై ఫోకస్ చేశాయి. గృహ వినియోగం మినహా.. వాణిజ్య, పారిశ్రామిక, ఇతర కేటగిరీల విద్యుత్ చార్జీలను పెంచాలని ప్రాథమికంగా ఆలోచనకు వచ్చినట్టు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి త్వరలో ప్రతిపాదనలను సమర్పించనున్నాయి. జూన్ 6వ తేదీతో రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియనుంది. ఆ తర్వాత 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక, టారిఫ్ ప్రతిపాదనలను డిస్కంలు ఈఆర్సీకి సమర్పించే అవకాశాలు ఉన్నాయి. నిజానికి గత నెల (ఏప్రిల్) ఒకటో తేదీ నుంచే రాష్ట్రంలో కొత్త విద్యుత్ టారిఫ్ అమల్లోకి రావాలి. ఎన్నికలు, ఇతర కారణాలతో డిస్కంలు ప్రతిపాదనలు సమర్పించక పోవడంతో ఉన్న చార్జీలనే కొంతకాలం

మిగతా 5వ పేజీలో ▶



పెంచకపోతే సర్కారే భరించాలి!

లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియనుండటంతో ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనలు సమర్పించేందుకు డిస్కంలు ఏర్పాట్లు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించాక గృహేతర కేటగిరీల విద్యుత్ చార్జీలను ఏ మేర పెంచాలనే నిర్ణయం తీసుకోనున్నాయి. డిస్కంల ప్రతిపాదనలపై ఈఆర్సీ అభ్యంతరాలను స్వీకరించడంతోపాటు హైదరాబాద్, వరంగల్‌లలో బహిరంగ విచారణ నిర్వహిస్తుంది. తర్వాత కొత్త టారిఫ్‌ను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తుంది. వినియోగదారుల కేటగిరీల వారీగా పెరిగిన/తగ్గిన విద్యుత్ చార్జీల వివరాలు అందులో ఉంటాయి. ఒకవేళ చార్జీల పెంపునకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే.. డిస్కంల ఆదాయ లోటును ప్రభుత్వమే విద్యుత్ సబ్సిడీల రూపంలో పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. ఇదే జరిగితే ఎలాంటి చార్జీల పెంపు లేకుండానే కొత్త టారిఫ్ ఆర్డర్‌ను ఈఆర్సీ ప్రకటిస్తుంది.



ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

నల్లగొండ -ఖమ్మం- వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై సీఎం రేవంత్‌రెడ్డి

- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు క్రియాశీలకంగా పని చేయాలని సూచన
- జూమ్ ద్వారా మూడు ఉమ్మడి జిల్లాల పార్టీ నేతలతో సమీక్ష

- వివరాలు 2లో

ఆలయం వెలుపల కుటుంబ సమేతంగా సీఎం రేవంత్‌రెడ్డి

ఇరు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

తిరుమలలో శ్రీవారి దర్శనం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి 2లో

'గేటు'లో గూండాగిరి

పాల్వాయి గేటులో ఓటర్లను బెదిరించి పచ్చముఠాల రిగ్గింగ్

- వైఎస్సార్ సీపీ ఏజెంట్లను చితకబాది బూత్‌ల నుంచి ఈడ్చివేత
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలపై పోలింగ్ బూత్‌ల్లో దౌర్జన్యం
- పార్టీ నేతల సమాచారంతో అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే పిన్నెల్లి
- రిగ్గింగ్‌ను ప్రతిఘటించి స్పందించాలని పలు దఫాలు ఎన్నికల అధికారులకు ఫోన్లు
- వెబ్ కాస్టింగ్ పరిశీలించి రిగ్గింగ్ అడ్డుకోకుండా అధికార యంత్రాంగం ఉదాసీనత
- పల్నాడులో ఏడు చోట్ల ఈవీఎంలు ధ్వంసమైతే ఒక్క వీడియో మాత్రమే బహిర్గతం.. అవసరమైన మేరకు ఎడిటింగ్..
- వారం తరువాత తాపీగా విదేశాల్లో ఉన్న లోకేష్ ఎక్స్ ఖాతా నుంచి విడుదల
- భద్రంగా ఉండాల్సిన వెబ్ కాస్టింగ్ సమాచారం బయటకు వెళ్లడంపై సందేహాలు
- రిగ్గింగ్, ఏజెంట్లపై దాడులు, ఓటర్లని బెదిరించిన వారిని పట్టించుకోకుండా ప్రతిఘటించిన వారిపై కేసుల నమోదుపై సర్వత్రా విస్మయం

- వివరాలు 10లో



పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం పాల్వాయి గేట్ పోలింగ్ బూత్ 202 వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దౌర్జన్యం చేస్తున్న టీడీపీ గూండాలు

న్యూస్‌రీల్

'రేవ్' పార్టీలో చిత్తూరు టీడీపీ నేతలు!



బెంగళూరు రేవ్ పార్టీలో డ్రగ్స్ విక్రయించిన వారిలో చిత్తూరుకు చెందిన టీడీపీ యువనేత రణధీర్ విక్రమ్‌నాయుడు, టీడీపీ కార్యకర్త కాణిపాకానికి చెందిన అరుణ్‌కుమార్ నాయుడు ఉన్నారు.

- వివరాలు 3లో▶

ముత్యాల నగరంలో మత్స్యకన్యలు



దేశంలో తొలిసారిగా కూకట్‌పల్లిలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ టన్నెల్ డబుల్ డెక్కర్ ఎగ్జిబిషన్ మెర్మెయిడ్ షోలో మనం చూస్తుంది నిజమేనేమో అనిపించేలా మత్స్యకన్యలు ఆకట్టుకుంటున్నారు.

- వివరాలు 14లో▶

ఎవరు.. ఎప్పుడు దాడి చేస్తారో!



ఐదు రోజులుగా తెలుగు విద్యార్థులు కిర్గిస్తాన్‌లో భయం నీడన కాలం వెళ్లదీస్తున్నారు. అక్కడి ఓ యూనివర్సిటీలో విద్యార్థిని వేధించిన విషయంలో తలెత్తిన వివాదం అక్కడి స్థానికులు, విదేశీయుల మధ్య తీవ్ర ఘర్షణలకు దారి తీసింది.

- వివరాలు 3లో▶

ప్రతి అంగన్‌వాడీలో ఓ టాయిలెట్



రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని మంత్రి సీతక్క ఉన్నతస్థాయి సమీక్షలో స్పష్టం చేశారు.

- వివరాలు 14లో▶





మొత్తం సీట్లే అన్ని లేవ్!.. కాస్త మీ ఊపు తగ్గించుకోండి.. ప్లీజ్!!

కాంగ్రెస్ మార్క్ మార్పు ఇదేనా!

రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

- ఒకవైపు కరెంట్ కోతలు.. మరోవైపు కాలుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- సీఎం రేవంత్‌రెడ్డి ఓ మెజీషియన్.. పచ్చిఅబద్ధాలకోరు
- మొదటి రోజే మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పండి
- హనుమకొండ, నర్సంపేట, వరంగల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, వరంగల్: 'రాష్ట్రంలో ఓ వైపు కరెంట్ కోతలు, మరోవైపు కాలుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు..మోటార్లు, ఆస్పత్రుల్లో గంటల తరబడి కరెంటు కోతలు, ఎండుతున్న చెరువులు.. ఇదేనా కాంగ్రెస్ మార్కు మార్పు? ఒక్కసారి ఆలోచించి వారికి ఇప్పటికైనా తగిన బుద్ధి చెప్పాలి..'అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. '6 నెలల క్రితం అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. కేసీఆర్‌తో సహా అందరం ప్రతి నియోజకవర్గంలో పర్యటించాం. మోసపోతే గోస పడుతామని చెప్పాం. కానీ కాంగ్రెస్ వాగ్దానాలు

మిగతా 2వ పేజీలో ▶



సోనియాను ఏ ప్రాతిపదికన, ఎలా పిలుస్తారు ?

- 1,500 మంది ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్నందుకా ?
- సోనియాను దెయ్యం అన్న రేవంత్‌రెడ్డికి ఇప్పుడు ఆమె దేవత అయ్యారా ?
- 90 శాతం మంది రైతులు దొడ్డు రకం వడ్లు వేస్తుంటే సన్నాలకే బోనస్సా?
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: జూన్ 2న జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి ఏ ప్రాతిపదికన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని ముఖ్యఅతిథిగా ప్రభుత్వం ఆహ్వానిస్తుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో జాప్యం చేసి.. 1,500 మంది ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్నందుకు ఆమెను పిలుస్తారా అని నిలదీశారు. సోనియాను ఆవిర్భావ ఉత్సవానికి పిలవడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. బుధవారం పార్టీ

మిగతా 2వ పేజీలో ▶



'పంటల బీమా'కి రూ.3 వేల కోట్లు

రైతుల ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది

భవిష్యత్‌లో దొడ్డు వడ్లకు కూడా రూ. 500 బోనస్

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడి

- వివరాలు 5లో▶

2.11 లక్షల కోట్ల డివిడెండ్!



కేంద్రంపై ఆర్‌బీఐ కనకవర్షం

- 2023–24 ఆర్థిక సంవత్సరానికి అందించనున్న కేంద్ర బ్యాంక్
- 608వ ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో కీలక నిర్ణయం
- ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ. 1.02 లక్షల కోట్లు లభిస్తాయని అంచనా వేసుకున్న కేంద్రం
- అందుకు రెట్టింపు స్థాయిలో అందనున్న డివిడెండ్.. కొలువుదీరే కొత్త ప్రభుత్వానికి భారీ ఊరట

13లో

మళ్లీ అధిక ఉష్ణోగ్రతలు

ఉక్కపోత కూడా తీవ్రం కానుందన్న వాతావరణ శాఖ

- పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం
- రేపు మధ్యాహ్నానికి వాయుగుండంగా మార్పు
- రాష్ట్రంపై దీని ప్రభావం లేనట్టే..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు మళ్లీ పెరగనున్నాయి. అకాల వర్షాల నేపథ్యంలో గత పది రోజులుగా గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీలు తక్కువగా నమోదవుతూ వచ్చాయి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మారడం, నైరుతి సీజన్‌కు సమయం అనుకూలంగా మారుతున్న తరుణంలో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని వాతావరణ శాఖ సూచించింది. ఉక్కపోత కూడా తీవ్రం కానుందని తెలిపింది. ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్ర తీరానికి సమీప నైరుతి ప్రాంతంలోని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బుధవారం ఉదయం అల్ప పీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టం నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. ఈ అల్ప పీడనం ఈశాన్య దిశలో కదిలి ఈ నెల 24వ తేదీ నాటికీ మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆ తర్వాత ఈ వాయుగుండం ఈశాన్య దిశలో కదులుతూ మరింత బలపడి ఈ నెల 25న ఈశాన్య, దానికి ఆనుకొని ఉన్న వాయవ్య బంగాళాఖాతం ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. అయితే దీని ప్రభావం రాష్ట్రంపై అంతగా ఉండబోదని తెలిపారు.

రుతుపవనాలకు అనుకూలంగా..

నైరుతి రుతుపవనాలు దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల్లోని మిగిలిన ప్రాంతాలు, ఉత్తర మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రానికి తూర్పు దిశ నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నాయని, రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి

మిగతా 3వ పేజీలో ▶



సన్న విత్తనాలు సిద్ధం

19 రకాలు రెడీ చేసిన వ్యవసాయ విశ్వవిద్యాలయం

- రైతులకు విక్రయించేందుకు రేపు మేళా
- వర్సిటీ ప్రాంగణంలో వ్యవసాయ శాఖ ఏర్పాట్లు
- రూ.500 బోనస్ ప్రకటనతో రైతాంగం ఎదురుచూపులు
- దొడ్డు గింజలతో పాటు మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, సోయా విత్తనాలూ రెడీ



సాక్షి, హైదరాబాద్: సన్న రకం ధాన్యానికే బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో వానాకాలం సీజన్‌కు ముందు రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ సన్న రకాల విత్తనాలను రైతులకు అందజేసేందుకు రంగం సిద్ధం చేసింది. మరోవైపు సన్నాలతో పాటు రైతులకు వివిధ రకాల నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో శుక్రవారం (24న) వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విత్తన మేళా నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మేళాలో వ్యవసాయ వర్సిటీతో పాటు రాజేంద్రనగర్ పరిధిలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సంస్థలు ఐఐఓఆర్, ఐఐఎంఆర్,

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

పంజాబ్ ప్రచారానికి డిప్యూటీ సీఎం

ఫరీద్‌కోట్ లోక్‌సభ ప్రత్యేక పరిశీలకునిగా నియామకం



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించేందుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పంజాబ్ రాష్ట్రానికి వెళ్లారు. పంజాబ్‌లోని ఫరీద్‌కోట్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రత్యేక పరిశీలకునిగా ఏఐసీసీ నియమించడంతో బుధవారం అక్కడికి వెళ్లారు. మూడు రోజుల పాటు ఆయన ఆ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోనే ఉంటారు. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి పక్షాన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని డిప్యూటీ సీఎం కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం

టీపీసీసీ నేత అద్దంకి దయాకర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో సోనియాగాంధీ ఎలా పాల్గొంటారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు నవ్వు తెప్పిస్తున్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన దేవత సోనియాగాంధీ అని, ఆమెపై కిషన్‌రెడ్డి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కష్టనష్టాలను భరించి సోనియాగాంధీ తెలంగాణ ఇస్తే.. ప్రధాని మోదీ రాష్ట్ర ఏర్పాటునే అపహాస్యం చేశారని చెప్పారు. కేవలం రాజకీయం కోసం రాష్ట్రంలో బీజేపీ అస్తిత్వం కోసం సోనియాను కించపరిచేలా మాట్లాడడం సరైంది కాదని స్పష్టం చేశారు. కిషన్‌రెడ్డి వ్యవహారశైలి మార్చుకోకపోతే ప్రజలు బీజేపీని తిరస్కరిస్తారని దయాకర్ వ్యాఖ్యానించారు.

పట్టభద్రులకు బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ద్రోహం చేశాయి

వారికి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు: టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పట్టభద్రులకు బీఆర్‌ఎస్, బీజేపీ ద్రోహం చేశాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్లను అడిగే నైతిక అర్హత ఆ పార్టీలకు లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో బుధవారం యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ...పదేళ్లలో కేటీఆర్ నిరుద్యోగులకు ఏం చేశాడో చెప్పాలన్నారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ పేరుతో బీఆర్‌ఎస్, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల పేరుతో బీజేపీలు నిరుద్యోగులను మోసం చేశాయని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు పట్టభద్రులకు అవసరమని చెప్పారు. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి పిచ్చి పట్టిందని, అందుకే ట్యాక్స్‌లంటూ మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇంకోసారి కాంగ్రెస్ నేతలకు అవినీతిని అంటగట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కాంగ్రెస్ హామీలు గాలికి..

బీఆర్‌ఎస్ నేత గట్టు



సాక్షి, హైదరాబాద్: అధికారమే ధ్యేయంగా అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత వాటిని తుంగలో తొక్కుతోందని బీఆర్‌ఎస్ నేత గట్టు రాంచందర్‌రావు ఆరోపించారు. ఆయన బుధవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్, స్థానిక సంస్థల రాజకీయ రిజర్వేషన్లను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామన్న హామీ ఏమైందని నిలదీశారు. సివిల్ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం, వైన్స్‌ల్లో గౌడ కులస్తులకు 23 శాతం రిజర్వేషన్లు, మండలానికో గురుకులం ఏర్పాటు చేస్తామన్న హామీలేమయ్యాయని గట్టు నిలదీశారు. స్థానిక ఎన్నికలు ముంచుకొస్తున్న ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపు దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, జనాభా దామాషా ప్రకారం బీసీలకు 55 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్ అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు తీసుకోకపోతే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని గట్టు హెచ్చరించారు.

జీతాలకూ డబ్బుల్లేవు!

ప్రభుత్వానికి గోదావరి బోర్డు లేఖ

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి అవసరమైన నిధులు తమ వద్ద లేవని గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్‌ఎంబీ) ఆందోళన వ్యక్తం చేసింది. తమ వద్ద ఉన్న రూ.75లక్షల నిల్వలు ప్రస్తుత నెలకి సంబంధించిన కనీస అవసరాలు తీర్చుకోవడానికి సరిపోతాయని, వచ్చే నెలలో జీతాలు చెల్లించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. వాస్తవానికి 2024–25లో బోర్డుకు రూ.7.8 కోట్లను తెలంగాణ, రూ.12.46 కోట్లను ఏపీ విడుదల చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తక్షణమే తెలంగాణ వాటా నిధులను విడుదల చేయాలని కోరుతూ జీఆర్‌ఎంబీ ఈ నెల 20న తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాసింది.

పక్కాగా... పారదర్శకంగా

కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు కోసం ఆర్థిక శాఖ కొత్త మార్గదర్శకాలు

- ట్రెజరీ అకౌంట్స్ శాఖలో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు
- ఏటీవో సారథ్యంలో 9 మంది సిబ్బంది విధులు.. ఆర్‌బీఐలో పథకాల వారీగా అకౌంట్లు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్‌ఎస్)ను మరింత పారదర్శకంగా, పక్కాగా అమలు చేయాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా అడుగులేసింది. ఈ మేరకు సీసీఎస్‌ల అమలు కోసం ఆర్థిక శాఖ కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ట్రెజరీ అకౌంట్స్ కార్యాలయంలో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు కానుంది. అకౌంట్ రెండరింగ్ యూనిట్ (ఏఆర్‌యూ) పేరుతో ఏర్పాటు చేయనున్న ఈ ప్రత్యేక విభాగం ద్వారానే సీసీఎస్‌ల అమలు, పర్యవేక్షణ, బిల్లుల పరిశీలన, చెల్లింపులు, అవసరమైన మార్పులు, చేర్పులు జరగనున్నాయి. అసిస్టెంట్ ట్రెజరీ అధికారి నేతృత్వంలో ఏర్పాటు కానున్న ఈ యూనిట్‌లో ఒక సబ్ ట్రెజరీ అధికారి, ముగ్గురు సీనియర్ అకౌంటెంట్‌లు, మరో ముగ్గురు జూనియర్ అకౌంటెంట్‌లు, ఒక ఆఫీస్ సబార్డినేట్ పనిచేయనున్నారు. ఈ ప్రత్యేక యూనిట్ ద్వారానే నెలవారీ అకౌంట్ల నిర్వహణ, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ప్రజా ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (పీఎఫ్‌ఎంఎస్), కాగ్ మధ్య సమన్వయం, ప్రభుత్వానికి నివేదికల సమర్పణ జరుగుతాయని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు బుధవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రతి దశలో ప్రత్యేక పద్దు...

ప్రత్యేక యూనిట్ ద్వారా కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుతో పాటు అనుసరించాల్సిన మార్గదర్శకాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు బుధవారం ఇచ్చారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రతి ఆర్థిక సంవత్సరం మొదట్లోనే కేంద్ర ప్రభుత్వం ప్రతి పథకానికి ప్రాథమికంగా నిధులను మంజూరు చేస్తుంది. ఈ మంజూరు ప్రకారమే తెలంగాణలో ఆయా పథకాలకు నిధులను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఈ పథకాల అమలులోనూ ప్రతి దశలో ప్రత్యేక హెడ్‌లు, సబ్‌హెడ్‌ల వారీగా పద్దులను నిర్వహించాల్సి ఉంటుంది. ఆయా పథకాల అమలు కోసం పనిచేసే ఉద్యోగుల వేతనాలు మొదలు.. భవనాల నిర్మాణం, పబ్లిసిటీ వరకు ప్రతి దశలోనూ పద్దులు నిర్వహించాలి.

బీఆర్‌వోలు వచ్చిన 3 రోజుల్లోనే అనుమతులు

కేంద్రం మంజూరు చేసే నిధులు, రాష్ట్ర ప్రభుత్వం పథకాల వారీగా ఇచ్చే వ్యయ సమాచారం ఆధారంగా ఆయా పథకాల అమలు కోసం రాష్ట్ర సర్కారు బడ్జెట్ విడుదల ఉత్తర్వులు (బీఆర్‌వో) ఇస్తుంది. ఈ బీఆర్‌వోలు వచ్చిన మూడు రోజుల్లోనే సంబంధిత శాఖలు పరిపాలన అనుమతులు మంజూరు చేయాల్సి ఉంటుంది. పరిపాలన అనుమతులు వచ్చిన తర్వాత బడ్జెట్ ఖర్చు పెట్టేందుకు సదరు శాఖలకు అధీకృత ఆమోదం లభిస్తుంది. ఈ ఆమోదం లభించిన తర్వాత బిల్లులు పెట్టడం, ఆ బిల్లులను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు చేసి అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుంది. 1601 పద్దు కింద కేంద్ర వాటాను వినియోగించుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్, స్వచ్ఛ భారత్ మిషన్, ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన తదితర పథకాలకు కేంద్ర, రాష్ట్రాల వాటా ఆధారంగా బిల్లులు చేయాల్సి ఉంటుంది. ఈ బిల్లులను ట్రెజరీకి పంపాల్సి ఉంటుంది.

ఐఐహెచ్‌టీలో క్లాసులు వచ్చే ఏడాదే!

ఈ ఏడాది అడ్మిషన్లు లేనట్లే

- ఏఐసీటీఈ నుంచి ఇంకా రాని అనుమతులు
- అనుమతులొస్తేనే డిగ్రీ, డిప్లొమా కోర్సులు ప్రారంభం
- తెలంగాణ విద్యార్థులకు గతంలో మాదిరే ఏపీ, ఒడిశాలో సీట్లు

సాక్షి, హైదరాబాద్: పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)లో తరగతులు ఈ ఏడాది ప్రారంభమయ్యే సూచనలు కనిపించడం లేదు. ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినా డిగ్రీ, డిప్లొమా కోర్సులకు ఏఐసీటీఈ నుంచి అనుమతులు రాకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. దీంతో హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ఇంజనీరింగ్, డిప్లొమా కోర్సులు చేసే విద్యార్థులకు ఈ ఏడాది కూడా ఏపీ, ఒడిశాలోని ఐఐహెచ్‌టీల్లో ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించారు. మరోవైపు ఐఐహెచ్‌టీ తెలంగాణలో డిగ్రీ, డిప్లొమా కోర్సుల ప్రారంభానికి ఏఐసీటీఈ అనుమతి కోరుతూ ఈ ఏడాది డిసెంబర్‌లోగా దరఖాస్తు చేయాలని చేనేత, జౌళి శాఖ అధికారులు భావిస్తున్నారు.



వచ్చే ఏడాది నుంచే అడ్మిషన్లు!

నేత కార్మికులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో గతంలో ప్రైవేటు సంస్థ ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్ పార్కును బహిరంగ వేలంలో ఇటీవల రాష్ట్ర నేత కార్మికుల సహకార సంస్థ (టెస్కో) దక్కించుకుంది. ఖాళీగా ఉన్న ఈ పార్కులో ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. అయితే తరగతుల ప్రారంభానికి అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు లేకపోవడంతో వచ్చే ఏడాది నుంచే విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చే అవకాశముంది.

రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు

ప్రస్తుతం దేశ వ్యాప్తంగా పది ఐఐహెచ్‌టీలు పనిచేస్తుండగా, వీటిలో ఆరు కేంద్ర ప్రభుత్వ నిధులతో, నాలుగు ఆయా రాష్ట్రాల పరిధిలో పనిచేస్తున్నాయి. వారణాసి (యూపీ), సేలం (తమిళనాడు), గువాహతి (అసోం), జోథ్‌పూర్ (రాజస్థాన్), బార్‌ఘడ (ఒడిశా), ఫుల్లా (పశ్చిమ బెంగాల్) ఐఐహెచ్‌టీలు కేంద్ర నిధులతో నడుస్తున్నాయి. వెంకటగిరి (ఏపీ), గదగ్ (కర్ణాటక), చంపా (ఛత్తీస్‌గఢ్), కన్నూరు (కేరళ) ఐఐహెచ్‌టీలు ఆయా రాష్ట్రాల ఆర్థిక సాయంతో నడుస్తున్నాయి. రాష్ట్రంలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం పలు సందర్భాల్లో కోరినా కేంద్రం ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమే ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు ముందుకు రావడంతో కేంద్రం అంగీకరించింది.

ఏపీ, ఒడిశా ఐఐహెచ్‌టీల్లో ప్రవేశాలు

తెలంగాణ విద్యార్థులకు ఏపీలోని నెల్లూరు జిల్లా వెంకటగిరి ఐఐహెచ్‌టీ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలు ఇస్తున్నారు. దీంతో పాటు రాష్ట్ర విభజన తర్వాత ఒడిశాలోని బార్‌ఘడ ఐఐహెచ్‌టీలో 9 సీట్లు కేటాయిస్తున్నారు. రంగుల అద్దకం, నేత, ప్రింటింగ్, ఫ్యాబ్రిక్ టెక్నాలజీ కోర్సులు తదితర కోర్సులకు ఐఐహెచ్‌టీల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. తెలంగాణలో నేత రంగం ఆధునీకరణ, వస్త్ర పరిశ్రమలో సృజనాత్మకతకు పెద్దపీట వేసేలా ఈ కోర్సులు ఉపయోగపడుతాయి.

కాంగ్రెస్ మార్క్ మార్పు ఇదేనా!

▶ మొదటి పేజీ తరువాయి

నమ్మి ఆ పార్టీకి అవకాశం ఇచ్చారు. కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపితే నమ్మి ఓటేసి ఇప్పుడు బాధపడుతున్నారు. డిసెంబర్ 9 నాడే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానన్నారు. కేసీఆర్ లక్ష మాఫీ చేసిన వారికీ రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి.. మొదటి రోజే మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఏం శిక్ష వేస్తారో వేయాలి..'అని అన్నారు. 'సీఎం రేవంత్‌రెడ్డి ఓ మెజీషియన్.. పచ్చి అబద్ధాలకోరు. తెలంగాణ ప్రజలను ఇంకా నమ్మించాలని చూస్తున్నాడు..'అని ధ్వజమెత్తారు. వరంగల్–నల్లగొండ–ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నర్సంపేట, వరంగల్, హనుమకొండలలో నిర్వహించిన సమావేశాల్లో కేటీఆర్ ప్రసంగించారు.

రెండోసారి కూడా మోసపోతే మోసపోయిన వాళ్లదే తప్పు

'అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈస్ట్‌మన్ కలర్ సినిమా చూపించారు. కానీ రాష్ట్రంలో కరెంట్ కోతలు ఎలా ఉన్నాయో చెప్పడానికి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మంగళవారం నాటి ఘటనే ఉదాహరణ. ఎంజీఎం లాంటి పెద్ద ఆస్పత్రిలో 5 గంటలు కరెంట్ పోవడం దారుణం కాదా? ఆరు నెలల క్రితం వ్యవసాయం ఎలా ఉండే? ఇప్పుడు ఎలా ఉంది? రుణమాఫీ జరిగిందా? కౌలు రైతులకు, రైతు కూలీలకు సాయం అందిందా? వంద రోజుల్లోనే చేసేస్తామన్న హామీలు ఏమయ్యాయి? రూ.2500 వచ్చినయా? ఏడాదిలో రూ.2 లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఏదీ చేయలేదు. నాట్లు వేసే నాడు వేయాల్సిన రైతుబంధు..ఓట్లు వేసే నాడు రేవంత్‌రెడ్డికి గుర్తొస్తుంది. ముఖ్యమంత్రి ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలు అమలు చేశానని సిగ్గు లేకుండా చెప్పుకుంటున్నాడు. తెలంగాణలో అన్ని హామీలు అమలు చేస్తున్నట్లు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలు కూడా ఇతర రాష్ట్రాల్లో అబద్ధాలు చెబుతున్నారు..'అని కేటీఆర్ ధ్వజమెత్తారు.



హనుమకొండలో జరిగిన సమావేశానికి హాజరైన పట్టభద్రులు

పదేళ్ల ప్రగతి చెప్పుకోవడంలో విఫలమయ్యాం

'గత పదేళ్లలో తెలంగాణ ఎంతో ప్రగతి సాధించిందని చెప్పుకోవటానికి చాలా ఉన్నాయి. అన్ని రంగాలు అభివృద్ధి చెందాయి. కానీ మనం చేసిన మంచి పనులను చెప్పుకోవటంలో విఫలమయ్యాం. యూట్యూబ్‌లలో మనపై తప్పుడు ప్రచారాలు చేశారు. దీని కారణంగానే 1.8 లక్షల ఓట్ల స్వల్ప తేడాతో మనం ఓడిపోయే పరిస్థితి వచ్చింది. ఒక్కసారి మోసపోతే మోసం చేసిన వాడిది తప్పు. కానీ రెండోసారి కూడా మోసపోతే మోసపోయిన వాళ్లదే తప్పు అవుతుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించి కాంగ్రెస్‌కు తగ్గిన బుద్ధి చెప్పాలి..'అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

మానవత్వాన్ని చాటిన కేటీఆర్

గీసుకొండ: రోడ్డు పక్కన పడిపోయిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించి, మాజీ మంత్రి కేటీఆర్ మానవత్వాన్ని చాటారు. బుధవారం హైదరాబాద్ నుంచి నర్సంపేట వెళుతుండగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని ధర్మారం రైల్వే గేటు సమీపంలో అంజయ్య అనే వ్యక్తి మోపెడ్‌పై వెళుతూ ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనపడి అపస్మారకస్థితిలో ఉన్నాడు. విషయం గమనించిన కేటీఆర్ కారు ఆపి అతన్ని పరిశీలించారు. వెంటనే గన్‌మెన్ల సాయంతో తన కాన్వాయ్‌లోని ఓ వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం నర్సంపేటకు వెళ్లారు.



ధర్మారం వద్ద అపస్మారక స్థితికి చేరిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న కేటీఆర్ అంగరక్షకులు

ఆరు నెలల్లోనే ఆరు దశాబ్దాల కన్నీటి దృశ్యాలు

- పదేళ్ల తరువాత మళ్లీ అన్నదాతల ఆత్మహత్యలు
- కాంగ్రెస్ తప్పులు ఆగడం లేదు, అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు
- 'ఎక్స్'లో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో ఆరు దశాబ్దాల కన్నీటి దృశ్యాలు ఆవిష్కృతం అయ్యాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. పదేళ్లు కనిపించని కరెంట్ కోతలు, విద్యుత్ సబ్ స్టేషన్ల ముట్టళ్లు ఇప్పుడు చూస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఆయన ఈ మేరకు పోస్టు చేశారు. 'కాలిన మోటార్లు, పేలిన ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు మళ్లీ ఇన్నాళ్లకు ఇన్వర్టర్లు, జనరేటర్ల మోతలు చూస్తున్నాం. సాగునీరు లేక ఎండిన పంట పొలాలు, ట్రాక్టర్లు ఉండాల్సిన పొలంలో ట్యాంకర్లు చూస్తున్నాం. బోసిపోయిన చెరువులు, పాత అప్పు కట్టాలని రైతులకు నోటీసులు, రైతుబంధు కోసం నెలలపాటు పడిగాపులు చూస్తున్నాం. తడిసిన ధాన్యాన్ని కొనే దిక్కులేదు. పదేళ్ల తరువాత మళ్లీ అన్నదాతల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. జోగిపేటలో విత్తనాల కోసం రైతులు పాసుబుక్కులతో క్యూలు కడుతున్నారు. అయినా కాంగ్రెస్ తప్పులు ఆగడం లేదు, అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు. వైఫల్యాల కాంగ్రెస్ పాలనలో ఇలాంటి విషాద దృశ్యాలు ఇంకెన్ని చూడాలో..'అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఇరు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

తిరుమలలో శ్రీవారి దర్శనం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి

తిరుమల: ఇరు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సీఎం హోదాలో ఆయన తొలిసారిగా తిరుమల వెళ్లారు. బుధవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి ఆలయం వద్దకు చేరుకున్నారు. మహా ద్వారం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికారు. తొలుత ధ్వజ స్తంభం వద్ద నమస్కరించిన అనంతరం రేవంత్, ఆయన కుటుంబ సభ్యులు శ్రీవారిని దర్శించుకున్నారు. తర్వాత రంగ నాయకుల మండపంలో పండితులు వారికి వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల రేవంత్ మాట్లాడారు. ఇరు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించానని చెప్పారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం, కల్యాణ మంటపాలు, సత్రాలు నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం టీటీడీకి సహకరిస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

- నల్లగొండ–ఖమ్మం–వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై సీఎం రేవంత్‌రెడ్డి
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు క్రియాశీలకంగా పనిచేయాలి
- జూమ్ ద్వారా పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించిన సీఎం

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ -ఖమ్మం-వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ ఎ.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలకు, శ్రేణులకు పిలుపునిచ్చారు. మూడు ఉమ్మడి జిల్లాల్లోని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇన్‌చార్జులు క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై బుధవారం రాత్రి ఆయన మూడు జిల్లాల ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్లమెంట్ ఇన్‌చార్జులతో జూమ్ ద్వారా సమావేశమయ్యారు. పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27న పోలింగ్ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు, నాయకులను సన్నద్ధం చేయాలని, ప్రతి ఎమ్మెల్యే తమ అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లను సందర్శించాలని దిశానిర్దేశం చేశారు. ఇది తీన్మార్ మల్లన్న ఎన్నిక మాత్రమే కాదని, కాంగ్రెస్ పార్టీ ఎన్నిక అని, ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యేలు, మంత్రులను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

మణుగూరు–రామగుండం రైల్వేలైన్ భూసేకరణకు స్పెషల్ గెజిట్ నోటిఫికేషన్ జారీ

సాక్షి, హైదరాబాద్: మణుగూరు–రామగుండం మధ్య నిర్మించే రైల్వే ప్రాజెక్టు భూసేకరణకు దక్షిణమధ్య రైల్వే బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనివల్ల భూసేకరణలో అనవసర జాప్యం తప్పబోతోంది. చిన్నచిన్న విషయాల్లో ఎదురయ్యే న్యాయపరమైన చిక్కులతో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించేందుకు ఇది దోహదం చేస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. 207.80 కి.మీ. నిడివిగల ఈ ప్రాజెక్టుకు రూ.2911 కోట్ల వ్యయం కానుంది. గత సంవత్సరం బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు మంజూరైంది. ఈ సంవత్సరం బడ్జెట్‌లో దానికి రూ.5 కోట్లు మాత్రమే కేటాయించారు.

ఇక టీజీఎస్ ఆర్టీసీ



సాక్షి, హైదరాబాద్: ఇంతకాలం టీఎస్ ఆర్టీసీగా ఉన్న రోడ్డు రవాణా సంస్థ పేరు ఇక నుంచి టీజీఎస్ ఆర్టీసీగా పరిగణించనున్నారు. ఈమేరకు పేరు మార్పు చేసినట్టు రోడ్డు రవాణా సంస్థ బుధవారం ప్రకటన విడుదల చేసింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ గెలుపే ధ్యేయంగా.. బీజేపీ నేతల ఉధృత ప్రచారం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కైవసానికి బీజేపీ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఈనెల 27న పోలింగ్ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల ఎన్నికల ప్రచారానికి ఇంకా మూడు రోజులే (శనివారం సాయంత్రం వరకు) మిగిలి ఉండడంతో ముఖ్యనేతలు ప్రచారంలో బిజీబిజీగా గడపనున్నారు. గురువారం కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఉదయం 10:30గంటలకు భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రాఘవపురం, రుద్రవెల్లిల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడతారు. సాయంత్రం 6 గంటలకు ఖమ్మంలో పట్టభద్రుల ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు. ఇక పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ కూడా వివిధ జిల్లాల్లో పార్టీ అభ్యర్థి తరఫున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నారు. బీజేపీ జాతీయకార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ గురువారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, సూర్యాపేటలో పర్యటిస్తారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తొర్రూరు (టిఫిన్ భైటక్), పరకాల, నర్సంపేట, మహబూబాబాద్‌ల్లో ప్రచారం నిర్వహిస్తారు. శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇల్లందు, కొత్తగూడెం భద్రాచలం, మణుగూరుల్లో ఈటల పర్యటిస్తారు.

ఈశాన్య ఢిల్లీ బరిలో తెలంగాణ యువకుడు



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని ఈశాన్య ఢిల్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో తెలంగాణ యువకుడు పోటీ చేస్తున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వెంకటాపురం(ఆల్వాల్) ప్రాంతానికి చెందిన రవికిరణ్ తిలక్ తాటికొండ (31) స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. రవికిరణ్‌కు ఎన్నికల కమిషన్ 'బ్యాట్'గుర్తును కేటాయించింది. ఈయన 2016లో ఉస్మానియా వర్సిటీ నుంచి ఎంబీఏ పూర్తి చేశారు. ప్రైవేటు ట్యూటర్ అని అఫిడవిట్‌లో పేర్కొన్న రవికిరణ్ రూ.లక్ష నగదు, బ్యాంకుల్లో రూ.10వేలు తన ఆస్తిగా చూపారు. తెలుగు ఓటర్లు తనకెంతో సహకరిస్తున్నారని 'సాక్షి'కి తెలిపారు. యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఢిల్లీకి వచ్చిన తాను దేశరాజధానిలో కాలుష్యం, రహదారులపై చెత్తాచెదారం చూసి విస్తుపోయానన్నారు. కొంతకాలం ముఖర్జీనగర్‌లో నివసించిన తనకు ఈశాన్యఢిల్లీ పరిస్థితులు అవగతమని ఆ నేపథ్యంలో పోటీకి ముందుకొచ్చానని చెప్పారు. ఢిల్లీ నగర వీధుల కలుషితంపై ప్రభుత్వాలు దృష్టి సారించలేకపోయాయని ఆరోపించారు. తెలుగు ప్రజలు, స్నేహితుల మద్దతుతో తన ప్రచారం ముందుకు సాగుతోందని రవికిరణ్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే మల్కాజిగిరి అభ్యర్థిగానూ రవికిరణ్ దాఖలు చేయగా, ఆ నామినేషన్లు తిరస్కరణకు గురికావడం గమనార్హం.

సోనియాను ఏ ప్రాతిపదికన ఎలా పిలుస్తారు?

▶ మొదటి పేజీ తరువాయి

కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వలేదని, అప్పటి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ ప్రజలు తెచ్చుకున్నారని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటుకు సుష్మాస్వరాజ్ ఆధ్వర్యంలో బీజేపీ పూర్తిస్థాయిలో పోరాటం చేసిందని, తమ పార్టీ పార్లమెంట్‌లో మద్దతు ఇచ్చింది కాబట్టే యూపీఏ హయాంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రస్తుతం సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి సోనియాను దయ్యం అన్నారని, ఇప్పుడు ఆయనకు ఆమె దేవత అయ్యిందా అని ఎద్దేవా చేశారు. తమకు సోనియాగాంధీ అప్పుడూ ఇప్పుడూ దయ్యమేనని వ్యాఖ్యానించారు.

రైతులకు రాష్ట్ర సర్కారు వెన్నుపోటు పొడిచే ప్రయత్నం

రాష్ట్ర రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని, అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటేసినందుకు రైతులకు 'చెయ్యి' ఇస్తున్నారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, అమలు చేయకుండా రైతాంగాన్ని నిలువునా ముంచిందని ధ్వజమెత్తారు. దొడ్డు, సన్న అనే తేడా లేకుండా ప్రతి రైతుకూ బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా కింద రైతులు, కౌలు రైతులకు రూ. 15 వేల చొప్పున ఇవ్వలేదన్నారు. సన్న బియ్యాన్ని ప్రోత్సహించాలని అనుకుంటే రూ.1000 బోనస్ ఇవ్వాలని, దొడ్డు రకానికి రూ.500 బోనస్ ఇవ్వాలని చెప్పారు. దొడ్డు బియ్యం కొనడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, రైతులకు ఇచ్చిన హామీ నుంచి తప్పించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.తెలంగాణలో 90 శాతంమంది దొడ్డు రకం వడ్లు వేస్తుండగా, సన్నాలకే బోనస్ ఇస్తామని ఎలా చెబుతారని ప్రశ్నించారు.

రాష్ట్రంలో సకాలంలో ధాన్యం సేకరించలేకపోతున్నారు

'2023–24 ఒప్పందం ప్రకారం కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం ఇవ్వాల్సిన బియ్యం ఇంకా ఇవ్వలేదు. సకాలంలో ధాన్యం సేకరించలేకపోతోంది. అకాల వర్షాలతో ధాన్యం కల్లాల్లోనే తడిసిపోతోంది. కొనుగోలు కేంద్రాల్లో నెలల తరబడి రైతులు పడిగాపులు కాస్తున్నారు. నిన్న కేవలం 75 వేల టన్నుల మాత్రమే కొనుగోలు చేసింది. ఇలాగే కొనసాగితే ధాన్యం కొనుగోలు పూర్తి కావడానికి మరో రెండు నెలల సమయం పడుతోంది' అని కిషన్‌రెడ్డి చెప్పారు.

క్లుప్తంగా...

ఐటీ మంత్రి సలహాదారుగా సాయికృష్ణ

టీ వర్క్స్, వీహబ్‌కు కొత్త సీఈవోలు



జోగేందర్ తనికెళ్ల



సీత పల్లచొల్ల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సలహాదారుగా సాయి కృష్ణను నియమించారు. ఆయన ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. మరోవైపు టీవర్క్స్, వీహబ్‌కు నూతన సీఈవోలను నియమిస్తూ ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీ వర్క్స్ సీఈవోగా జోగేందర్ తనికెళ్ల, వీహబ్ సీఈవోగా సీత పల్లచొల్ల నియమితులయ్యారు. నూతన సీఈవోలు మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎస్సీ గురుకుల ఉద్యోగుల బదిలీలు చేపట్టాలి

- టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ వినతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న టీచర్లు, ఇతర ఉద్యోగులకు తక్షణమే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులు, ఉద్యోగుల అసోసియేషన్(టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ) డిమాండ్ చేసింది. దాదాపు ఎనిమిదేళ్లుగా ఉద్యోగులకు బదిలీలు చేపట్టలేదని, కొందరు పదేళ్లకు పైబడి ఒకేచోట పనిచేస్తున్నారని, అదే విధంగా పదోన్నతులు సైతం ఇవ్వకపోవడంతో తక్కువ స్థాయిలోనే పదవీ విరమణ పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికల్లా పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని కోరింది. ఈమేరకు బుధవారం టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.బాలరాజు, ఎస్. దయాకర్ ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ ఇంక్రిమెంట్‌లను విడుదల చేయాలని ఇలా దాదాపు 15 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యదర్శికి సమర్పించామని వివరించారు.

టీఎస్ సెట్-2024కు 1,500 దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ సెట్-2024)కోసం ఈ నెల 14 నుంచి ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తులకు 1,500 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు టీఎస్ సెట్ సభ్య కార్యదర్శి ప్రొ.నరేశ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆగస్టు 28 నుంచి ప్రారంభం కానున్న టీఎస్ సెట్‌కు జూలై 2 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈసారి టీఎస్ సెట్‌కు కొత్తగా ఫీజులు పెంచలేదని ఆయన వెల్లడించారు. ఇటీవల వివిధ విద్యార్థి సంఘాల నాయకులు టీఎస్‌సెట్-2024 ఫీజును తగ్గించాలని వినతి పత్రాలను సమర్పించారని అయితే ఈ పరీక్షలకు కేవలం తెలుగు రాష్ట్రాల అభ్యర్థులే హాజరవుతారని ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ వ్యయం అధికంగా ఉంటోందని అందుకే ఫీజును తగ్గించలేమని వివరించారు.

విపక్షాలు రైతులను రెచ్చగొడుతున్నాయి

- పీడీఎస్ ద్వారా సన్నాలు ఇచ్చేందుకే బోనస్ ప్రకటన: అన్వేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతులు సన్నాలు, దొడ్డు వడ్లు ఎంత పండిస్తా రనే కనీస అవగాహన కూడా లేని ప్రతిపక్ష పార్టీలు రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని టీపీసీసీ కిసాన్ సెల్ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి ఆరోపించారు. గత రెండు రోజులుగా ప్రభుత్వాన్ని బద్నాం చేసే కుట్రకు ప్రతిపక్షాలు తెరలేపాయని విమర్శించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సన్నాలకు, దొడ్డు వడ్లకు కేంద్రం ఒకటే మద్దతు ధర ఇస్తుందని, సన్నాలకు ఎక్కువ డిమాండ్ ఉన్న నేపథ్యంలో మిల్లర్లు అదనపు ధరకు వాటిని కొనుగోలు చేస్తారని చెప్పారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సన్నాలు పేద ప్రజలకు అందించాలంటే సన్నాల పంట ఎక్కువగా సాగు చేయాల్సిన అవసరం ఉందని, అందుకే సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని వివరించారు. దొడ్డు వడ్లను పండించే రైతులను కూడా ఆదుకునే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతు ఖాతాకు ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నామని, తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామని అన్వేశ్‌రెడ్డి స్పష్టం చేశారు.

పూరీ భక్తుల ఆగ్రహానికి బీజేపీ గురికాక తప్పదు

- టీపీసీసీ నేత నిరంజన్

సాక్షి, హైదరాబాద్: పూరీ జగన్నాథ స్వామి ప్రధాని మోదీ భక్తుడంటూ బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర చేసిన వ్యాఖ్యలు ప్రపంచ వ్యాప్తంగా జగన్నాథుని భక్తులను ఆశ్చర్యానికి, ఆగ్రహానికి గురిచేశాయని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, నిరసనలతో సంబిత్ పాత్ర క్షమాపణలు చెప్పినప్పటికీ పూరీ భక్తుల ఆగ్రహానికి బీజేపీ గురికాక తప్పదన్నారు.

ఎవరు..ఎప్పుడు దాడి చేస్తారో..!

కిర్గిస్తాన్‌లో భయంభయంగా తెలుగు విద్యార్థులు

- విదేశీ విద్యార్థులే లక్ష్యంగా ఆ దేశంలో దాడులు
- ఐదు రోజులుగా హౌస్ అరెస్టులోనే అనేక మంది
- నాలుగురెట్లు పెరిగిన విమాన ధరలు
- భారత ఎంబసీ పట్టించుకోవడం లేదని ఆవేదన



కిర్గిస్తాన్ రాజధాని బిషెక్ లోని విమానాశ్రయానికి బాంబు బెదిరింపులపై స్థానిక అధికారిక మీడియా ఇన్‌స్టా పోస్టు



కిర్గిస్తాన్‌లో అల్లరి మూకలు

సాక్షి, హైదరాబాద్: ఐదు రోజులుగా తెలుగు విద్యార్థులు కిర్గిస్తాన్‌లో భయం నీడన కాలం వెళ్లదీస్తున్నారు. అక్కడి ఓ యూనివర్సిటీలో విద్యార్థిని వేధించిన విషయంలో తలెత్తిన వివాదం అక్కడి స్థానికులు, విదేశీయుల మధ్య తీవ్ర ఘర్షణలకు దారితీసింది. భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఈజిప్ట్ నుంచి వచ్చిన స్టూడెంట్స్ లక్ష్యంగా జరుగుతున్న దాడులతో తెలుగు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హౌస్‌అరెస్టులో తెలుగు విద్యార్థులకు నిత్యావసరాలు కూడా దొరకడం లేదు. అక్కడి భారత రాయబార కార్యాలయం పట్టించుకోవట్లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, తక్షణం తమను అక్కడ నుంచి రెస్క్యూ చేయాలంటూ కొందరు తెలుగు విద్యార్థులు 'సాక్షి'తో ఫోన్ ద్వారా వాపోయారు. పేర్లు గోప్యంగా ఉంచాలంటూ అక్కడి ఎంబీబీఎస్ విద్యార్థులు అనేక విషయాలు చెప్పారు. వివరాలు వారి మాటల్లోనే....

అనుమానంగా చూస్తున్నారు...

ఓ యువతి విషయంలో కిర్గిస్, ఈజిప్ట్ విద్యార్థుల మధ్య మే 13న గొడవ జరిగింది. 18, 19 తేదీల్లో తీవ్రస్థాయిలో దాడులు జరిగాయి. ఇందులో పాకిస్తాన్, భారత్, బంగ్లా, ఈజిప్ట్ దేశాల విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్తాన్ విద్యార్థులు చాలామంది వెళ్లిపోయారు. అక్కడి స్థానికులు తెలుగు విద్యార్థులను అనుమానంగా చూస్తున్నారు. దీంతో ఎప్పుడైనా మాపై దాడి జరగొచ్చని భయాందోళనల మధ్య బతకాల్సిన పరిస్థితి నెలకొంది. ఇండియన్ ఎంబసీ హెల్ప్‌లైన్ నంబరు విద్యార్థులకు ఇచ్చింది. కాల్ చేస్తే పూర్తి స్థాయిలో స్పందన ఉండట్లేదు. కాలేజీ యాజమాన్యం విద్యార్థులకు సహకారం అందిస్తోంది. తెలుగు విద్యార్థులను ఐదు రోజులుగా బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. కళాశాల యాజమాన్యం నిత్యావసర సరుకులు అందిస్తోంది. ఇలా దాదాపు 700 మంది తెలుగు విద్యార్థులు అక్కడ బతుకెళ్లదీస్తున్నారు. భారత ఎంబసీతో మాట్లాడితే పరిస్థితులు బాగానే ఉన్నాయి అని అంటున్నారు. బయటకు వెళితే మాత్రం ఎవరు...ఎక్కడ దాడి చేస్తారో అన్న భయం విద్యార్థులను వెంటాడుతోంది. తమ ఉనికి బయటపడకుండా ఉండటానికి విద్యార్థులు తమ హాస్టల్‌లో లైట్లు ఆఫ్ చేసుకుంటున్నారు. పాకిస్తాన్‌కు చెందినవారు మాత్రం వారి దేశానికి వెళ్లిపోయారు. తెలుగు విద్యార్థులు విమాన టికెట్లు బుక్ చేసుకుందామని ప్రయత్నిస్తే లభించట్లేదు.

- కిర్గిస్తాన్‌లో చోటు చేసుకున్న ఘటనలపై భారతీయ విద్యార్థుల భద్రతపై చొరవ తీసుకోవాలని జీవీకే ఎడ్యుటెక్ డైరెక్టర్ విద్యాకుమార్ బుధవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను విద్యార్థుల తల్లిదండ్రులు నమ్మవద్దని ఈ సందర్భంగా కేంద్రమంత్రి చెప్పారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే భారత రాయబార కార్యాలయ హెల్ప్‌లైన్ నంబర్ 0555710041కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

ప్రభుత్వం ప్రత్యేక విమానం వేయాలి

ఇక్కడ బయట తిరగొద్దు అంటున్నారు. లాక్‌డౌన్ నాటి రోజులు మళ్లీ కనిపిస్తున్నాయి. మా కళాశాలలో భారతీయ విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. కళాశాల యాజమాన్యం మాకు ఆహారం, నిత్యావసర సరుకులు అందిస్తోంది. ఆన్‌లైన్ క్లాసులు నడుస్తున్నాయి. ఇంటికి వెళ్లిపోతామంటున్న వారిని వెళ్లిపోండి అంటున్నారు. విద్యాసంవత్సరం చివరికు వచ్చింది. జూలైలో ఇంటికి రావడానికి టికెట్లు బుక్ చేసుకున్నాం. ఇప్పుడు ఇంటికి రావాలన్నా టికెట్లు దొరకడం లేదు. ఉన్నవాట్లో నాలుగు రెట్లు చార్జీలు పెంచారు. భారత ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రత్యేక విమానం వేయడం లేదా, విమానాల సంఖ్య పెంచి, చార్జీలు తగ్గించాలి. – రాధ, ఎంబీబీఎస్ ఫస్ట్ ఇయర్

అడుగు బయట పెట్టాలంటే భయం..

కళాశాలలకు సెలవులు ఇచ్చారు. రూంలోనే ఉంటున్నాం. అర్ధరాత్రి వచ్చి డోర్ కొట్టేవారు. భయంభయంగా ఉండేది. బయటకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. మా కుటుంబసభ్యులు భయపడుతున్నారు. అర్ధరాత్రి సమయంలో ఫోన్ చేస్తున్నారు. ఇండియన్ ఎంబసీతో అంతా తప్పుడు సమాచారం ఇస్తోంది. అంతా బాగుంది అంటున్నారు. బయటకు వెళితే ఏ వైపు నుంచి ఎవరు దాడి చేస్తారో అని భయమేస్తోంది. మాకు పరీక్షలు దగ్గర పడ్డాయి. మాదగ్గర తెలుగు రాష్ట్రాల నుంచి 800 మంది విద్యార్థులు ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయి. నెల రోజుల్లో డిగ్రీ పట్టా వస్తుందనుకుంటే ఇప్పుడు మానసిక ఆందోళన మొదలైంది. విమానాశ్రయంలో బాంబు ఉందంటూ బెదిరింపులు రావడంతో ఎవ్వరినీ రానీయడం లేదు. – ఉషారాణి, ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని

గాలి వాన బీభత్సం

- ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షం
- రోడ్లపై విరిగిపడిన చెట్లు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- లేచిపోయిన ఇళ్ల పైకప్పులు, నిలిచిన కరెంట్ సరఫరా



చింతగూడలో వర్షానికి కొట్టుకుపోయిన ఓ ఇంటి పైకప్పు



నిజామాబాద్ జిల్లా తాళ్లరామడుగులో కూలిన భారీ వృక్షం

కైలాస్‌నగర్/నిజామాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ నిజామాబాద్ జిల్లాల్లో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం 4 గంటల వరకు ఎండ దంచికొట్టగా.. అనంతరం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రెండు జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి వాంకిడి సమీపంలో గల జాతీయ రహదారిపై భారీ వృక్షాలు నేలకొరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాంసిలో ఓ ఇంటి ఆవరణలో గల కొబ్బరిచెట్లు విరిగి పడటంతో ఇంటి పైకప్పు కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు తెచ్చిన జొన్నలు తడిసిపోయాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. తలమడుగు మండలం ఉండం గ్రామ సమీపంలోని 33 కేవీ వి ద్యుత్ స్తంభం విరిగిపడటంతో తాంసి, తలమడుగు మండలాల్లోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తలమడుగు మండలంలోని పూనగూడ, పల్సి-బి, పల్సి-కే గ్రామాలలో ఈదురుగాలుల దెబ్బ కు పలు ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. బోథ్ మండలం మర్లవాయిలో ఇంటి పైకప్పుపై ఉన్న రేకులు ఎగిరిపోయి విద్యుత్‌వైర్లపై పడ్డాయి.

ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయి.. : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని ముగ్దుంపూర్, గాలీపూర్ గ్రామాల్లో 60పైగా విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఈ రెండు గ్రామాల్లోని ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడంతో దాదాపు 60 కుటుంబాలు ఇబ్బందిపడ్డాయి. పిట్లంలోని పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయం వద్ద ఉన్న గోశాల రేకుల షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది.

మళ్లీ అధిక ఉష్ణోగ్రతలు

▶ మొదటి పేజీ తరువాయి



మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వివరించారు. బుధవారం రాష్ట్రంలో చాలా చోట్ల సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీ సెల్సియస్ మేర తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గరిష్ఠంగా ఆదిలాబాద్‌లో 41.8 డిగ్రీ సెల్సియస్, కనిష్ఠంగా మెదక్‌లో 24.3 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

బుధవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్ఠం
ఆదిలాబాద్	41.8
నిజామాబాద్	40.5
మెదక్	40.5
ఖమ్మం	40.4
రామగుండం	40.0
మహబూబ్‌నగర్	39.9
నల్లగొండ	39.8
భద్రాచలం	39.2
హనుమకొండ	37.5
హైదరాబాద్	36.8
దుండిగల్	36.7
హకీంపేట్	36.5

అడ్వొకేట్ కమిషనర్‌ను అడ్డుకోవడం నేరమే

- సీఐపై కేసు నమోదు చేయడం సబబే: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: అడ్వొకేట్ కమిషనర్ విధులను అడ్డుకోవడం నేరమేనని హైకోర్టు తేల్చి చెప్పింది. అలా అడ్డుకున్న సీఐపై ట్రయల్‌కోర్టులో కేసు నమోదు చేయడం సమర్థనీయమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉద్యోగులపై కేసు విచారణకు చట్టప్రకారం అనుమతి అవసరమైనా, అన్ని సందర్భాల్లో అలా అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని చెప్పింది. మేజిస్ట్రేట్ కోర్టులో నమోదు చేసిన కేసులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం కనిపించడం లేదని పేర్కొంది. ఓ కేసు విచారణ సందర్భంగా 2012లో కోర్టు నియమించిన అడ్వొకేట్ కమిషనర్ విధులకు అడ్డు తగిలారంటూ వరంగల్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ తనపై కేసు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ నాటి హన్మకొండ సుబేదారి స్టేషన్ సీఐ సురేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఈవీ వేణుగోపాల్ విచారణ చేపట్టారు. పిటిషనర్, ప్రతివాదుల తరఫున వాదనలు విన్న న్యాయమూర్తి.. సీఆర్పీసీ సెక్షన్ 197(1) ప్రకారం కొన్ని సందర్భాల్లో ప్రభుత్వ అనుమతికి మినహాయింపులు ఉంటాయని స్పష్టం చేశారు.

నేడు తెలంగాణ ఎడ్‌సెట్

- తెలంగాణలో 79, ఏపీలో 2 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 33,879 మంది అభ్యర్థులు



నల్లగొండ రూరల్: రెండు సంవత్సరాల బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకోసం గురువారం నిర్వహించే తెలంగాణ ఎడ్‌సెట్-2024కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య తాళ్ల మృణాళిని తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరగనున్న ఈ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మొదటి సెషన్ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని తెలిపారు. మొదటి సెషన్‌లో 16,929 మంది, రెండో సెషన్‌లో 16,950 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్టు పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 79 పరీక్ష కేంద్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కర్నూల్, విజయవాడ నగరాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు https://edcet.tsche.ac.in వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మొదటి సెషన్ పరీక్షకు హాజరు కావాల్సిన అభ్యర్థులు ఉదయం 8:30 గంటలకల్లా, రెండో సెషన్ పరీక్షకు హాజరయ్యేవారు మధ్యాహ్నం 12:30 కల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం పరీక్ష కేంద్రాలకు 10 గంటల తర్వాత, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోరని తెలియజేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించి రెండోసారి ఎడ్‌సెట్ నిర్వహిస్తున్నట్లు ఎడ్‌సెట్ చైర్మన్ ఆచార్య గోపాల్‌రెడ్డి తెలిపారు.

ఉత్తమ్, చౌహాన్‌ల రూ.1000 కోట్ల స్కామ్ ఆధారాలతో బయటపెడతా

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు సంబంధించి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ చౌహాన్ కలిసి చేసిన రూ.వెయ్యి కోట్ల స్కామ్‌ను పూర్తి ఆధారాలతో బయటపెడతానని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. దీనిపై మంత్రి లెక్కలు వేరు, చౌహాన్ లెక్కలు వేరని పేర్కొన్నారు. ఈ విషయంలో మంత్రి ఉత్తమ్‌కు మరోసారి సవాల్ చేస్తున్నానన్నారు. బుధవారం రాత్రి బీజేపీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మహేశ్వర్‌రెడ్డి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తాను చేసిన ఆరోపణలపై మంత్రి ఉత్తమ్ కౌంటర్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. తన ఆరోపణలపై ఉత్తమ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడినా, దానిపైనా స్పందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తాను చెబుతున్న అంశాలపై ఉత్తమ్ బహిరంగచర్చకు వచ్చినా సిద్ధంగా ఉన్నానన్నారు. తాను ఆధారాలు లేకుండా ఏదీ మాట్లాడనని, తనకు ఎవరూ వ్యక్తిగతంగా శత్రువులు లేరని స్పష్టం చేశారు. ఒక వ్యక్తిని టార్గెట్ చేసి మాట్లాడటం తనకు అలవాటు లేదని, పక్కా ఆధారాలతో బహిరంగచర్చకు సిద్ధమని ప్రకటించారు. తాను గతంనుంచి ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్, ఆర్‌ఆర్‌ఆర్ ట్యాక్స్‌ల గురించి మాట్లాడినప్పుడు ఉత్తమ్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. తాను తాజాగా 'యు' ట్యాక్స్ గురించి కూడా చెప్పానంటే వార్తల్లో, పత్రికల శీర్షికల్లో నిలిచేందుకు పేరుకోసం తాను మాట్లాడినట్లా అని ఉత్తమ్‌ను ప్రశ్నించారు. రాష్ట్రం నుంచి ఢిల్లీలోని ఓ కాంగ్రెస్ ముఖ్యనేతకు రూ.వందల కోట్లు వెళ్లాయని మహేశ్వర్‌రెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ట్యాక్స్ పేరుతో ఢిల్లీకి సూట్ కేసులు వెళుతున్నాయన్నారు.

'రేవ్' పార్టీలో చిత్తూరు టీడీపీ నేతలు!

డ్రగ్స్ విక్రయించిన 'పచ్చ' నేతలు

మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద అరెస్ట్



రణధీర్ విక్రమ్ నాయుడు | అరుణ్‌కుమార్ నాయుడు | పోలీసులు అరెస్టు చేసిన నిందితులు వీరే..

చిత్తూరు అర్బన్: కర్ణాటకలోని బెంగళూరు నగరంలో జరిగిన రేవ్ పార్టీలో టీడీపీ మూలాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రేవ్ పార్టీలో డ్రగ్స్ విక్రయించిన ఐదుగురు ప్రధాన నిందితుల ఫొటోలు, వివరాలను బెంగళూరు పోలీసులు వెల్లడించారు. వీరిలో చిత్తూరుకు చెందిన టీడీపీ యువనేత రణధీర్ విక్రమ్‌నాయుడు, టీడీపీ కార్యకర్త కాణిపాకానికి చెందిన అరుణ్‌కుమార్‌నాయుడు ఉన్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన బెంగళూరు పోలీసులు, వీళ్లపై మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రణధీర్ విక్రమ్‌నాయుడుకు చిత్తూరులోని టీడీపీకి చెందిన పలువురు నేతలతో సన్నిహిత సంబంధాలున్నాయంటున్నారు. అరుణ్‌కుమార్‌నాయుడుది కాణిపాకం సమీపంలోని మద్దిపట్లపల్లెగా చెబుతున్నారు. బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీలో జరిగిన రేవ్ పార్టీలో 101 మందిని పట్టుకున్న పోలీసులు ఐదుగురు మినహా.. మిగిలినవాళ్లను సొంత పూచికత్తుపై విడుదల చేశారు. వీళ్ల రక్తనమూనాలు సేకరించగా, విచారణకు ఎప్పుడు పిలిచినా హాజరుకావాలని షరతు పెట్టారు. మాదక ద్రవ్యాలు విక్రయించిన ఐదుగురిలో వీరిద్దరితో పాటు మొహ్మద్ అబూబక్కర్ సిద్ధికి, ఎల్.వాసు, డి.నాగబాబులున్నారు. నిందితుల నుంచి 15.56 గ్రా. ఎండీఎంఏ పిల్స్, 6 గ్రాముల హైడ్రో గాంజా, 6.2 గ్రాముల కొకైన్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీళ్లపై మాదక ద్రవ్యాల నిరోధక చట్టం-1985, సెక్షన్ 8(సి), 22(బి), 22(సి), 22(ఏ), 27(బి), 25, 27, ఐపీసీ 1860 సెక్షన్ 290, 294 కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అంతా ఓ పద్ధతి ప్రకారం..

వాసు బర్త్ డే పేరుతో నిర్వహించిన ఈ రేవ్ పార్టీలో వాస్తవానికి ఎలాంటి బర్త్ డే వేడుకలు జరగలేదు. ఉద్దేశపూర్వకంగా డ్రగ్స్ విక్రయించడం, వేశ్యా గృహాన్ని నిర్వహించడాన్ని పోలీసులు గుర్తించారు. రేవ్ పార్టీలోకి వచ్చే ప్రతి ఒక్కరికీ ఓ పాస్‌వర్డ్ ఇచ్చారు. వాసు బర్త్ డే పార్టీ అనే యూజర్ నేమ్, పాస్‌వర్డ్ చెప్పిన వాళ్లకు మాత్రమే ఇక్కడ ప్రవేశం ఉంటుంది. ఇందుకోసం నిర్వాహకులు ఓ ప్యాకేజీ ఇచ్చారు. ఒక్కో వ్యక్తి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్టు తెలిసింది. 'సన్‌సెట్ టు సన్‌రైజ్ విక్టరీ' పేరిట ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 నుంచి 20వ తేదీ ఉదయం 6 గంటల వరకు రేవ్ పార్టీ జరిగేలా ప్రణాళిక రూపొందించారు. తొలుత ఎలక్ట్రానిక్ సిటీ స్టేషన్ పరిధిలో కేసు నమోదవగా, తర్వాత హెబ్బాగోడికి బదిలీ చేయాలనుకున్నారు. తాజాగా ఈ కేసును సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ బెంగళూరు(సీసీబీ) పోలీసులకు అప్పగిస్తున్నట్లు కర్ణాటక పోలీసులు ప్రకటించారు. ఇందులో సెక్స్ రాకెట్ అంశం కూడా ఉన్నట్లు పోలీసులు అనుమానించి, ఆ దిశగా సైతం విచారణ చేస్తున్నారు. ఈ ఘటనలో పోలీసులు సీజ్ చేసిన కార్లలో ఫార్చ్యూనర్ కారు ఏపీ 39 హెచ్ 0002 నంబర్‌తో ఉంది. ఇది చిత్తూరులోని గుడిపాల మండలం రాసనపల్లెకు చెందిన త్యాగరాజులు నాయుడు అనే వ్యక్తి పేరిట ఉంది. త్యాగరాజులు నాయుడు కారు అక్కడ ఎందుకు ఉందనే దానిపై పోలీసులు ఇప్పటికే విచారణ ప్రారంభించారు. ఇంతలోపు ఈ కారును తొమ్మిది నెలల కిందటే మరో వ్యక్తికి విక్రయించినట్లు, అతను ఇంకా కారును తన పేరిట మార్చకోలేదని కొత్త డ్రామా చేస్తున్నట్లు తెలుస్తోంది. చిత్తూరు నియోజకవర్గానికి చెందిన ఓ టీడీపీ ముఖ్య నేత ఈ కారును ఉపయోగించినట్లు సమాచారం.

రేవ్ పార్టీపై లోతుగా దర్యాప్తు

- సెంట్రల్ క్రైమ్ బ్రాంచికి అప్పగింత
- కర్ణాటక డీజీపీ అలోక్‌మోహన్ వెల్లడి
- పార్టీలో 250 మందికి పైగా పాల్గొన్నట్టు అనుమానాలు
- ఎంట్రీ ఫీజు కింద ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు వసూలు!

బనశంకరి (బెంగళూరు): బెంగళూరు నగర శివారులోని హెబ్బగోడి ఫాంహౌస్‌లో జరిగిన రేవ్ పార్టీ కేసును లోతుగా దర్యాప్తు చేసేందుకుగాను సెంట్రల్ క్రైమ్ బ్రాంచి (సీసీబీ)కి అప్పగిస్తున్నట్లు కర్ణాటక డీజీపీ అలోక్‌మోహన్ బుధవారం తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నట్టుగా అనుమానాలు వ్యక్తమవుతున్న ఈ రేవ్ పార్టీపై సీఐ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో విచారణ జరగనుంది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం తెల్లవారుజామువరకు మద్యం, మాదక ద్రవ్యాలు, మ్యూజిక్, నృత్యాలతో హోరెత్తిన ఈ పార్టీలో సుమారు 100 మంది పాల్గొన్నట్టు తొలుత వార్తలు వచ్చినా 250 మందికి పైగానే పాల్గొన్నట్లు తెలుస్తోంది. సీసీబీ అధికారులు దాడి చేసే సమయానికే చాలామంది వెళ్లిపోగా, మరికొందరు మాత్రం తెల్లవారు జామువరకు ఉండిపోయారు. వీరిని అదుపులోకి తీసుకున్న సీసీబీ అధికారులు, స్థానిక పోలీసులు.. దాడి సమయంలో పరారైన కొందరిని గుర్తించే పనిలో ఉన్నారు. వాసు అనే వ్యక్తి పుట్టినరోజు పేరుతో సాగిన రేవ్ పార్టీలో పలువురు యువతులు కూడా పాల్గొనడంతో అసాంఘిక కార్యకలాపాలు కూడా సాగినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. సదరు ముఠా సమాచారం కూడా సేకరించారు.

పుట్టినరోజు పార్టీ అబద్ధం

పార్టీకి హాజరైన ఒక్కొక్కరి నుంచి వాసు ఎంట్రీ ఫీజు కింద రూ.2 లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. పోలీసులు వచ్చి అడిగితే బర్త్‌డే పార్టీకి వచ్చామని, తామంతా స్నేహితులమని చెప్పాల్సిందిగా ముందే సూచనలు అందినట్లు సమాచారం. పోలీసుల విచారణలో పుట్టినరోజు పార్టీ అబద్ధమని కూడా తేలింది. రేవ్ పార్టీలో రాజ్‌బావ అనే అనే డ్రగ్స్‌పెడ్లర్ కోరినవారికి కోరిన డ్రగ్‌ను అందజేసినట్లు తెలుస్తోంది. పార్టీలో పాల్గొన్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించిన పోలీసులు పరీక్షల నివేదిక కోసం ఎదురు చూస్తున్నారు. నివేదిక అందితే ఎంతమంది డ్రగ్స్ వాడారనేది తెలుస్తుందని అంటున్నారు. మరోవైపు నగరంలో ఇలాంటి డ్రగ్స్, రేవ్ పార్టీలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ దయానంద్ ఆదేశించారు.



మీ ఆనందం బాహ్య పరిస్థితుల ద్వారా నిర్ణయం అవదు.
మీ ఆలోచనలు, మాటలు, చర్యల ద్వారా నిర్ణయమవుతుంది.
– బ్రహ్మకుమారీలు

సాక్షి

గురువారం, 23 మే 2024

నోటిదురుసుకు ఇదా శిక్ష!

నోరు పారేసుకునే అలవాటున్న నేతలకు ఎన్నికలు ఎప్పుడూ పండగే. ఊరూరా తిరుగుతూ ప్రత్యర్థులను ఇష్టానుసారం దూషించటం ఒక్కటే ఆ బాపతు నేతలకు తెలిసిన విద్య. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తూ రిటైర్మెంట్‌కు కొన్ని నెలల ముందు పదవికి రాజీనామా చేసి రాజకీయ రంగ ప్రవేశం చేసిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ్ అలాంటి నేతలను తలదన్నారు. ఆలస్యంగా వచ్చినా 'అన్నీ నేర్చుకునే' వచ్చారని నిరూపించుకున్నారు. న్యాయమూర్తులుగా పనిచేసినవారు వెనువెంటనే రాజకీయాల్లోకి రావొచ్చా లేదా అన్నది వేరే చర్చ. అసలు జస్టిస్ అభిజిత్ వంటివారిని రానీయొచ్చా అనే సదసత్సంశయం అందరిలోనూ కలిగేలా చేసిన ఘనుడాయన. ఆయన దూషణలు ఎంత హీనాతిహీనంగా ఉన్నాయంటే...అవి పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పరువు తీస్తాయని, దేశాన్ని అపఖ్యాతిపాలు చేస్తాయని ఎన్నికల సంఘం(ఈసీ) వ్యాఖ్యానించింది. ఉన్నత విద్యావంతుడై, దీర్ఘకాలం వృత్తిలో కొనసాగిన ఒక బాధ్యతగల వ్యక్తి నుంచి ఇలాంటి చవకబారు మాటలు రావటం బాధాకరమన్నది. అయితే ఆయన దూషణలపై ఇంత తీవ్రంగా స్పందించిన ఈసీ, తీరా ఆయన్ను 24 గంటలపాటు ప్రచారంలో పాల్గొనరాదంటూ నిషేధం విధించి ఊరుకోవటం విడ్డూరంగానే అనిపిస్తుంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఉద్దేశించి గత గురువారం ఆయన దూషణలకు దిగారు. 'మీ రేటెంత మమతాజీ...ఎంతకు అమ్ముడుపోయారు? మేకప్ వేసుకుంటున్నారు గనుక పది లక్షలా! అసలామె మహిళేనా అని సందేహం కలుగుతుంది' అని ఆయన మాట్లాడారు. ఆ వెంటనే ఈసీకి తృణమూల్ ఫిర్యాదు చేసింది. గతంలో సమాచారం తెలుసుకోవటం, నిర్ధారించుకోవటం కష్టమయ్యేది. సామాజిక మాధ్యమాలొచ్చాక మరుక్షణంలోనే ప్రపంచానికి తెలిసిపోతోంది. ఎన్నికల సంఘం దీన్నంత సీరియస్‌గా తీసుకుంటే 24 గంటల్లో నివేదిక తెప్పించుకుని చర్య తీసుకోవటం కష్టం కాదు. కానీ ఈసీకి దాదాపు అయిదు రోజులు పట్టింది. ఈలోగా ఆయన ప్రచారమూ యథావిధిగా సాగింది. స్వీయసమర్థన సరేసరి.

మన సమాజం స్త్రీలను గౌరవిస్తుందని, పూజిస్తుందని ఘనంగా చెప్పుకుంటాం. కానీ మహిళలపై సాగుతున్న నేరాలు గమనిస్తే ఆ విషయంలో సందేహం కలుగుతుంది. బయటికెళ్తే ఎదురయ్యే సమస్యల గురించి ఏ బాలికను అడిగినా, మహిళను అడిగినా చెప్తారు. వీటిని రూపుమాపే ప్రభుత్వ ప్రయత్నాలు జరుగుతున్నాయి. కఠిన నిబంధనలతో చట్టాలు కూడా వస్తున్నాయి. కానీ ఆశించిన ఫలితాలేవి? చట్టాలు ఒక్కటే సమాజాన్ని మార్చలేవు. బాధ్యతాయుత స్థానాల్లో ఉంటున్నవారు సక్రమంగావుంటే ఇతరులకు అదొక సందేశమవుతుంది. కానీ వారే విచ్చలవిడి చేష్టలతో, మాటలతో చెలరేగుతుంటే వీధుల్లో తిరిగే పోకిరీలు ఇక నేర్చుకునేదేముంటుంది? మహిళలను కించపర్చటంలో జస్టిస్ అభిజిత్ మొదటివారు కాదు... బహుశా చివరివారు కూడా కాకపోవచ్చు. సాధారణ సందర్భాల మాటెలావున్నా కనీసం ఎన్నికలప్పుడైనా ఈసీ తీవ్రంగా స్పందిస్తే కొద్దో గొప్పో ఫలితం ఉంటుంది. ఎందుకంటే రాజకీయాలు పెద్దగా పట్టనివారు సైతం ఎన్నికలప్పుడు ఆసక్తి చూపుతారు. అందువల్లే ఈసీ కఠినంగా ఉండాలి. ఎన్నికల ప్రచారంలో పాటించే మార్గదర్శకాలేమిటో తమ అభ్యర్థులకూ, పార్టీ ప్రచారంలో పాల్గొనే ఇతరులకూ తెలియజేయాలని బీజేపీ అధినేత జేపీ నడ్డాకు ఈసీ సూచించింది. ఆ పార్టీ దాన్నెంతవరకూ పాటించిందో తెలియదు. అయినా ఇది ఈసీ చెబితేగానీ తెలియనంత విషయమేం కాదు. పార్టీలకు మందీమార్బలం ఉంటుంది. వివిధ హోదాల్లో ఉండేవారంతా బాధ్యతలు పంచుకుని తీరికలేకుండా ప్రచారంలో తలమునకలైన అధినేతలకు అవసరమైన విషయాలను చేరేస్తుంటారు. కానీ వారెవరికీ జస్టిస్ అభిజిత్ సంస్కారహీనమైన మాటలు తప్పనిపించినట్టు లేదు. సరిగదా...'ప్రధానిని విపక్షాలు అంటున్న మాటలు మీకు వినిపించటం లేదా...కళ్లూ, చెవులూ మూతబడ్డాయా?' అని బీజేపీ రాజ్యసభ ఎంపీ సమిక్ భట్టాచార్య ఈసీని ప్రశ్నించారు. 'కంటి వైద్య నిపుణులతో చూపు సరిచేయించుకోండి' అని కూడా ఉచిత సలహా ఇచ్చారు. తమది విభిన్నమైన పార్టీ అని తొలినాళ్లలో చెప్పుకున్న రాజకీయ పక్షం నుంచి ఇలాంటి సమర్థనలు ఆశించగలమా? జస్టిస్ అభిజిత్ ఇప్పుడే కాదు... న్యాయమూర్తిగా పనిచేసినప్పుడు సైతం విమర్శలు ఎదుర్కొన్నారు. మమత ప్రభుత్వంపై వెలువరించే తీర్పుల్లో ఆయన వ్యాఖ్యలు మితిమీరుతున్నాయన్న అభిప్రాయం ఉండేది. ఆయన్ను సమర్థించే మీడియా మాత్రం 'ప్రజా న్యాయమూర్తి' అనే భుజకీర్తులు తగిలించింది. అది వేరే సంగతి. చిత్రమేమంటే ఆయన తీర్పులను గట్టిగా సమర్థించి, ఎవరు ఎప్పుడు పునః సమీక్షించినా అవి ప్రామాణికమైనవని నిర్ధారణవుతుందన్నవారు సైతం బీజేపీలో చేరటం ద్వారా వ్యవస్థ విశ్వసనీయతను జస్టిస్ అభిజిత్ తీవ్రంగా దెబ్బతీశారని అభిప్రాయపడ్డారు.

ఉద్దేశపూర్వకంగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించేవారినీ, మహిళల వ్యక్తిత్వహననానికి పాల్పడేవారినీ ఉపేక్షించటం, నామమాత్రపు నిషేధాలతో సరిపెట్టడం న్యాయం కాదు. అవసరమైతే పోటీకి అనర్హులను చేయటంవంటి కఠిన చర్యలకు సిద్ధపడితే తప్ప ఇటువంటి నేతలు దారికి రారు. చట్టసభల్లో ఎలాగూ ఆరోగ్యవంతమైన చర్చలకు తావుండటం లేదు. కీలకమైన నిర్ణయాలు సైతం మూజువాణి ఓటుతో గట్టెక్కి చట్టాలుగా మారి సామాన్యులపై సవారీ చేస్తున్నాయి. కనీసం ఎన్నికల సమయంలోనైనా ఏ పార్టీ చరిత్రేమిటో, ఎవరివల్ల తమకు మేలు కలుగుతుందో నిర్ధారించుకునే అవకాశం ప్రజలకివ్వటం అవసరం. అందుకు నోటిదురుసు నేతలను కట్టడి చేయటం ఒక్కటే మార్గం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, తిథి: పౌర్ణమి సా.6.42 వరకు, తదుపరి బహుళ పాడ్యమి నక్షత్రం: విశాఖ ఉ.8.51 వరకు, తదుపరి అనూరాధ వర్జ్యం: ప.1.03 నుండి 2.43 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.47 నుండి 10.35 వరకు, తదుపరి ప.2.59 నుండి 3.47 వరకు అమృతఘడియలు: రా.11.04 నుండి 1.10 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సమితిపై సంస్కరణల ఒత్తిడి

అభిప్రాయం



ధ్రువ జైశంకర్

భద్రతామండలి సంస్కరణలపై చాలాకాలంగా చర్చ సాగుతోంది. శాశ్వత సభ్యులు కానివారికీ చోటు కల్పించాలని 1960ల నుంచి డిమాండ్ ఉందన్న విషయాన్ని మనం గమనించాలి. ఈ నేపథ్యంలో ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి సంస్కరణలపై ఇటీవలే న్యూయార్క్ వేదికగా ప్రపంచ ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగాయి. ఇంకో పక్క భారత్ సభ్య దేశంగా ఉన్న ఎల్–69 కూటమి భద్రతామండలి శాశ్వత సభ్యుల సంఖ్యతోపాటు ఇతర సభ్యులను కూడా పెంచాలని ప్రతిపాదిస్తోంది. అదే సమయంలో కొత్త సభ్యులకు వీటో అధికారం ఇచ్చే విషయమై ఉదారంగా వ్యవహరించాలని కోరుతోంది. భద్రతా మండలి సంస్కరణలు వేగం పుంజుకోవడం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆందోళనలకు అద్దం పడుతోంది..

అంతర్జాతీయ స్థాయిలో శాంతి సామరస్యాలను కాపాడే లక్ష్యంతో ఏర్పాటైన ఐక్యరాజ్య సమితిలో ఆసియా, ఆఫ్రికా ఖండాలకు ప్రాతినిధ్యం లేకపోవడం సమితి లక్ష్యసిద్ధిలో పెద్ద అడ్డంకి అని చెప్పక తప్పదు. ఈ అడ్డంకులను అధిగమించేందుకు కొన్ని దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నా అవి ఫలవంతం కావటం లేదు. సమితిలో సంస్కరణలు జరగాలని అధికశాతం దేశాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ వీటో పవర్ ఉన్న దేశాలు సమితి కృషికి పీటముడులు వేస్తూ వస్తున్నాయి. ఈ క్రమంలో ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి సంస్కరణలపై ఇటీవలే న్యూయార్క్ వేదికగా ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగాయి. ఎవరికీ పెద్దగా తెలియని, అస్పష్టమైన దౌత్య ప్రక్రియ ఆ చర్చలన్నవి. అయినప్పటికీ ఈ ఏడాది చివరిలోగా ఓ చరిత్రాత్మక అంతర్జాతీయ ఒప్పందం కుదిరే దిశగా ఈ సమావేశం ముందడుగైతే వేసింది.



భద్రతా మండలి సంస్కరణలు వేగం పుంజుకోవడం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆందోళనలకు కూడా అద్దం పడుతోంది. ఉక్రెయిన్, గాజా పరిణామాలు... ఐరాస వ్యవస్థ ప్రభావం తగ్గిపోతూండటం, అందరికీ ప్రాతినిధ్యం వహించే అవకాశం ఐరాసకు లేకపోవడం వంటివి మళ్లీ మళ్లీ చర్చకు వచ్చేలా చేస్తున్నాయి. భద్రతా మండలిలోని ఐదు దేశాలకూ వీటో అధికారాలు ఉండటం అన్నది రెండో ప్రపంచ యుద్ధ విజేతలకు మాత్రమే ప్రాతినిధ్యం కల్పిస్తున్నట్లు అవుతోంది. ఇక ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలకు భాగస్వామ్యం లేదు. ఆ ప్రాంత దేశాల ప్రతినిధులు ఐరాసలో నామమాత్రపు పాత్ర పోషిస్తున్నారు అంతే.

1950లో ప్రపంచ జనాభాలో సగం ఆసియాలోనే ఉండగా... ఇరవై శాతం ఆర్థిక లావాదేవీలు ఇక్కడే జరుగుతున్నా భద్రతామండలిలో ప్రాతినిధ్యం మాత్రం ఒక్క దేశానికి మాత్రమే దక్కింది. ఇది అన్యాయమే. అలాగని ఆశ్చర్యపోవడానికీ ఏమీ లేదు. కాగా అప్పటితో పోలిస్తే ఇప్పుడు ప్రపంచం నిస్సందేహంగా చాలా మారిపోయింది. ప్రాతినిధ్యం విషయంలోనూ అన్యాయం కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు ఆసియా జనాభా ప్రపంచ జనాభాలో 60 శాతం. ఆర్థిక వ్యవస్థలో 40 శాతం భాగస్వామ్యం కూడా ఈ ఖండానిదే. ఐరాస సభ్యదేశాల్లో 25 శాతం ఇక్కడివే. కానీ... భద్రతామండలిలో ప్రాతినిధ్యం మాత్రం 20 శాతమే.

ఈ నేపథ్యంలోనే భద్రతామండలి సంస్కరణలపై చాలాకాలంగా చర్చ సాగుతోంది. శాశ్వత సభ్యులు కానివారికీ చోటు కల్పించాలని 1960ల నుంచి ఉన్న డిమాండ్‌ను మనం గుర్తు చేసుకోవాలి. దాదాపుగా ఈ సమయంలోనే ఆర్థిక, సామాజిక కౌన్సిల్ సభ్యత్వాన్ని 18 నుంచి 27కు, ఆ తరువాత 54కు పెంచారు.

2015లో కొన్ని నిర్దిష్ట సూచనలతో భద్రతా మండలి సంస్కరణలపై చర్చలు జరిపేందుకు ఒక అంగీకారం కుదిరింది. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకూ అవి ముందుకు కదల్లేదు. చర్చల తీరుతెన్నులపై స్పష్టమైన ప్రణాళిక అన్నది లేకుండా పోవడం దీనికి కారణమైంది. ఈ ఏడాది జరిగిన శిఖరాగ్ర సమావేశం మాత్రమే ఈ ప్రక్రియ కాస్త ముందుకు కదిలేందుకు మార్గం చూపింది.

కారణాలు అనేకం!

భద్రతా మండలి సంస్కరణలు స్తంభించిపోయేందుకు అనేక కారణాలు కనిపిస్తాయి. ఇండియా, జర్మనీ, జపాన్ , బ్రెజిల్‌లతో కూడిన జి–4 కూటమి తమను (మరో ఇద్దరు ఆఫ్రికన్ ప్రతినిధులతో కలిపి) భద్రతా మండలి శాశ్వత సభ్యులుగా తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. భారత్, జి–4 దేశాలు వీటో అధికారం లేకుండానే భద్రతామండలిలో చేరేందుకు ఓకే అనవచ్చు. ఈ అంశంపై 15 ఏళ్ల తరువాత ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉండేలా చూస్తారు. ఇంకో పక్క భారత్ కూడా సభ్య దేశంగా ఉన్న ఎల్–69 కూటమి భద్రతా మండలి శాశ్వత సభ్యుల సంఖ్యతోపాటు ఇతరులను కూడా పెంచాలని ప్రతిపాదిస్తోంది. అదే సమయంలో కొత్త సభ్యులకు వీటో అధికారం ఇచ్చే విషయమై ఉదారంగా వ్యవహరించాలని కోరుతోంది.

ఐరాస సభ్యదేశాల్లో అత్యధికులు భద్రతా మండలి శాశ్వత, ఇతర సభ్యుల సంఖ్యను పెంచేందుకు అంగీకారం తెలుపుతూండగా కాఫీ క్లబ్‌గా పేరుగాంచిన 'యునైటెడ్ ఫర్ కన్సెన్సస్' గ్రూపు ఆ ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఇటలీ, పాకిస్థాన్, అర్జెంటీనా వంటి దేశాల నేతృత్వంలో పని చేస్తున్న ఈ గ్రూపు శాశ్వత సభ్యుల సంఖ్యను పెంచడాన్ని వ్యతిరేకిస్తోంది. భారత్, జర్మనీ, బ్రెజిల్ వంటి స్థానిక శత్రువులది పైచేయి కాకుండా అన్నమాట. ఇదిలా ఉంటే భద్రతా మండలి శాశ్వత సభ్యదేశాల్లో నాలుగు అమెరికా, యూకే, ఫ్రాన్స్, రష్యాలు మాత్రం శాశ్వత సభ్యుల సంఖ్యను పెంచేందుకు సూత్రప్రాయ అంగీకారం తెలిపాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇంకో అడుగు ముందుకేసి భద్రతా మండలి సంస్కరణలకు తాను కట్టుబడి ఉన్నట్లు ప్రకటనైతే చేశారు కానీ ఆచరణలో మాత్రం ఆయన ప్రభుత్వం భిన్నంగా వ్యవహరిస్తోంది. ఇంకో విషయం... ఆఫ్రికా గ్రూపులో ఏకాభిప్రాయం లేకపోవడంతో భద్రతామండలి సభ్యదేశంగా ఎవరిని ఎంపిక చేయాలన్నది సమితి నిర్ణయించుకోలేక పోతోంది. వివరంగా చర్చిస్తే భేదాభిప్రాయాలు వస్తాయని ఆఫ్రికా దేశాలు భయపడుతున్నాయి.

అడ్డంకి ఉండనే ఉంది!

భద్రతా మండలి శాశ్వత సభ్యత్వం పెరిగేందుకు, ఇతర సభ్యుల చేరికకు ఉన్న అతిపెద్ద అడ్డంకి చైనా. భద్రతామండలి విస్తరణపై వ్యాఖ్య చేయని శాశ్వత సభ్య దేశం ఇదొక్కటే. ఆసియాకు మెరుగైన ప్రాతినిధ్యం లభించేందుకు ఆసియా దేశమే ఒకటి అడ్డుగా నిలవడం విచిత్రం. ఈ సమస్యలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని చూస్తే... అసలు రాజీ మార్గమన్నది ఏమాత్రం కనిపించకుండా పోతుంది. శాశ్వత సభ్యుల సంఖ్యను 11కు పెంచడం ఇందుకు ఒక మార్గం. ప్రస్తుత శాశ్వత సభ్యులు ఐదుగురితోపాటు జి–4 సభ్యులు, ఇద్దరు ఆఫ్రికా ప్రతినిధులు అన్నమాట. దీంతోపాటే ఇతర సభ్యుల సంఖ్యను కూడా తగుమాత్రంలో పెంచాల్సి ఉంటుంది. అలాగే పూర్తి వీటో అధికారం స్థానంలో కొంతమంది శాశ్వత సభ్యులకు అభ్యంతరం ద్వారా తీర్మానాన్ని అడ్డుకునే అధికారం కల్పించడం ఒక ఏర్పాటు అవుతుంది. ఇలాంటి ఏర్పాటు ప్రస్తుత శాశ్వత సభ్యులకూ అంగీకారయోగ్యం కావచ్చు.

ఈ ఏర్పాటు ఒకటి రూపుదిద్దుకునేలోగా ఐరాస నిష్క్రియాపరత్వం పాటించడం కూడా ఐరాస ఏర్పాటు అసలు ఉద్దేశాన్ని నిర్వీర్యం చేసేదే. యుద్ధనష్టాలు భవిష్యత్ తరాలకు సోకకుండా కాపుకాయాల్సిన బాధ్యత ఐరాసాదే! అంతర్జాతీయ ఒప్పందాలు, ఒడంబడికల అమలు, సామాజిక పురోగతి, మానవీయతలను కాపాడటం కూడా ఐరాస ఏర్పాటు ఉద్దేశాలలో కొన్ని అన్నది మరచిపోరాదు. ఈ లక్ష్యాలన్నీ ఐరాస భద్రతా మండలి శాశ్వత సభ్యులుగా మారే ఆఫ్రికన్ గ్రూపు లేదా జి–20 వంటి వ్యవస్థలకూ వర్తిస్తాయి. గత ఏడాది భారత్ నేతృత్వంలో జరిగిన జి–20 సమావేశాల్లో చాలా అంశాలపై ఏకాభిప్రాయం సాధించగలగడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం. ఐరాస తన పూర్వ వైభవాన్ని మళ్లీ పొందాలంటే ప్రపంచం మొత్తానికి ఏకైక ప్రతినిధిగా వ్యవహరించాల్సి ఉంటుంది. అంతే కానీ... ఎప్పుడో ఎనిమిది దశాబ్దాల క్రితం నాటి ప్రపంచానికి ప్రతినిధిగా కాదు.

వ్యాసకర్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఓఆర్ఎఫ్ అమెరికా
('హిందూస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మరీ అంతగానా!!



ప్రతి పైసాను పన్ను కింద మింగేస్తూ, ప్రజల్ని పీల్చి పిప్పిచేస్తూ, వారికి మూడో ప్రపంచ దేశాల స్థాయి వైద్య సదుపాయాలనే అందిస్తూ, ఇప్పుడిక వైద్య బీమా ప్రీమియంపై 80 శాతం జీఎస్టీని తీసుకుంటున్న ఈ ప్రభుత్వాన్ని సమాజం బాగు కోసం గెంటేయాలి.
– కపిల్, పాలనా వ్యవహారాల వ్యాఖ్యాత

నవ్వు తెప్పిస్తున్నాయి



కంగనా రనౌత్ తన ప్రసంగాలతో కపిల్ శర్మకు గట్టి పోటీ ఇస్తున్నారు. ఎన్నికల్లో ఓడిపోయాక ఆమె ముంబైలో 'కామెడీ నైట్స్ విత్ కంగనా' ప్రారంభించవచ్చు. 'మండి'లో ఆమెపై పోటీ పడుతున్న విక్రమాదిత్యసింగ్ తన గెలుపుపై ఆందోళన చెందనవసరం లేదు.
– అంకిత్ మయాంక్, కాంగ్రెస్ మద్దతుదారు

గెలుపు కోసం



ఎన్నికల ఫలితాలలో 'నిపుణుడు' అయిన ప్రశాంత్ కిశోర్, స్క్రిప్టు ప్రకారం అదానీకి చెందిన ఎన్డీటీవీతో మాట్లాడుతూ... బీజేపీ 2019 కి సమానంగా లేదా అంతకన్నా మెరుగైన విజయాలను సాధించబోతోందని అన్నారు. మోదీ ఓడిపోతే నష్టపోయే స్వార్థపరులు ఏదో పెద్ద పథకాన్నే రచిస్తున్నట్లుగా ఉంది. వారు తమ సామ్రాజ్యాన్ని, ప్రయోజనాలను కాపాడుకోవటానికి ఎంతకైనా తెగిస్తారు.
– షాహిద్ సిద్దిఖీ, మీడియా పర్సనాలిటీ

ఇదేనా వికసిత్ భారత్ ?



నేతల జీవనశైలితో పోలిస్తే, సామాన్యుల జీవన ప్రమాణాలు దుర్భరం. ఎన్నికలు తమ జీవితాల్ని మార్చవని తెలిసీ జనం ఆశగా వోటేస్తున్నారు. పిల్లలకు చదువు, ఆరోగ్య కేంద్రాలు కావాలని ఆశపడుతున్నా, గ్రామాల్లో పరిస్థితి దుర్భరం. వికసిత్ భారత్ సర్కారీ నినాదాలతో కాదు, ఆచరణతో వస్తుంది.
– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

దేనికి సూచన?!



లద్దాఖ్ పార్లమెంటరీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఓటింగ్ శాతం తగ్గిపోతూ వస్తోంది! 2004: 73.52 శాతం, 2009: 72.8 శాతం, 2014: 71.40 శాతం, 2019: 71.5 శాతం, 2024: 67 శాతం. ఇది దేనిని సూచిస్తోంది! శాతాల మధ్య వ్యత్యాసం మరీ ఎక్కువ లేకపోవటాన్ని మాత్రమేనా?
– జెమ్యాంగ్ ట్సెరింగ్ నమ్గ్యాల్, లద్దాఖ్ ఎంపీ

మతం-రాజకీయం



రాజకీయాలకూ మతానికీ, మతానికీ రాజకీయాలకూ సంబంధమే లేదు. రాజకీయ నాయకులు రాజకీయాల కోసం మతాన్ని ఉపయోగించుకోకూడదు. మతాన్ని బోధించేవారు, ఆచరించేవారు రాజకీయాలలో మునిగిపోకూడదు. దీనిని మనం ఆచరిస్తే భారతదేశం ప్రపంచంలోనే మానవ నివాసానికి మంచి ప్రదేశం అవుతుంది.
– చంద్రకుమార్ బోస్, సామాజిక వ్యాఖ్యాత

అక్కడుంది కీలకం!



ఇజ్రాయెల్, హమాస్ యుద్ధ నేరస్థులకు అరెస్ట్ వారెంట్ జారీ చేయాలని ఐ.సి.సి. (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు) న్యాయవాది కరీమ్ ఖాన్ కోరినందుకు ఆయన పిల్లలను యు.ఎస్. సెనెటర్ ఒకరు బెదిరించారు. అన్ని ముసుగులూ తొలగి పోయాయి. మాఫియా పాలనకు వాషింగ్టన్ డీసీ ప్రధాన కార్యాలయంగా ఉంది.
– మట్ కెన్నార్డ్, దర్యాప్తు అధికారి, యు.కె.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

కులగణన చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలకెళ్లాలి

అభిప్రాయం



జూలూరు గౌరీశంకర్

బీసీల కుల గణన సమస్య దేశంలోని సగం జనాభా జీవన్మరణ సమస్య. ఈ సమస్యను పరిష్కరించకుండా దేశాన్ని ఎవరూ అభివృద్ధి చేయలేరు. బీసీలు ఏం చేస్తున్నారు, వాళ్ళ జీవనవిధానం ఎట్లుంది, వాళ్ళ విద్యా, ఉద్యోగ స్థితిగతులెట్లున్నాయి వంటి విషయాలను తెలుసుకోకుండా వారి ఆర్థిక, రాజకీయ, సామాజిక వెనుకబాటుతనాలను అర్థం చేసుకోవడం అసంభవం. ముఖ్యంగా బీసీలలో అత్యంత వెనుకబడిన వర్గాలు, సంచార, అర్ధ సంచార జాతుల బతుకు చిత్రం తెలుసుకోకుండానే ఈ దేశం వెలిగిపోతుందని ప్రచారం చేసుకునే పాలకవర్గాలను ఏవిధంగా అర్థం చేసుకోవాలి?

స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా బీసీల కుల గణనను కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రతి పార్టీ నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో మాత్రం బీసీలను తమవైపు తిప్పుకునేందుకు బీసీ కులగణన అంశం తెర మీదికి తీసుకువచ్చారు. తాము అధికారంలోకి వస్తే కుల గణన చేస్తామని కాంగ్రెస్ ఇప్పుడు చెబుతోంది. మరి ఇన్నేళ్ల నుంచి ఈ సంగతిని ఎందుకు పక్కన పెట్టారో వారికే తెలియాలి. ఇక బీజేపీ అయితే కుల గణన విషయం జోలికిపోమని గత పార్లమెంటు సమావేశాల్లోనే తెగేసి చెప్పిన విషయం గమనంలో ఉంచుకోవాలి.

బీసీలకు దక్కాల్సిన విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్ల అమలులో అడుగడుగునా అడ్డుపడ్డ ఒకప్పటి కేంద్ర పాలకులే ఇప్పుడు ఓట్ల కోసం బీసీ కులగణనపై గొంతెత్తి మాట్లాడుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ కులగణన అంశాన్ని బైటకు తీసి కామారెడ్డి ఎన్నికల సభలో 'బీసీ డిక్లరేషన్'ను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే బీసీల కుల గణన చేస్తామని చెప్పటమే కాకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని రాహుల్ తెలంగాణ ఎన్నికల్లో చాలా సభల్లో చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావటం వల్ల 29 వేల మంది బీసీ కొత్తతరం నాయకులు ఎదిగి వస్తారని చెప్పారు. ఇందుకోసం పార్లమెంటులో పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించి రాజ్యాంగ సవరణ చేస్తామన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ మొదటివారంలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ప్రకటించారు. కుల గణన చేయకుండా, బీసీలెంతమంది ఉన్నారో తెలియకుండా రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే అది బీసీల ఆశల మీద నిప్పులు చల్లినట్లుగానే భావించాలి. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలున్నాయి. సగానికిపైగా జనాభా ఉన్న బీసీల చేతుల్లోకి 6,000కు పైగా గ్రామరాజ్యాలు రావాలి. జడ్పీ ఛైర్మన్లు, మున్సిపల్ ఛైర్మన్లు, డీసీసీబీ ఛైర్మన్లు, మండలాధ్యక్షులు, జడ్పీటీసీ, ఎంపిటీసీల్లో సగానికి పైగా బీసీ వర్గాలు పొందుతాయి. ఇది జరిగి తీరాలి. బీసీలకు వాగ్దానం ఇచ్చిన పార్టీ అధికారంలో ఉంది గనుక బీసీ కుల గణన జరిపిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి.

స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లతో పాటుగా మొత్తం బీసీ కులాల వారీగా రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెసు చెప్పింది. ఈ రకమైన విధానం వల్ల రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన సంచార, అర్ధసంచార కులాలకు న్యాయం జరగాలి. బీసీలలో ఏడు నుంచి పది కులాల



వాళ్ళు మాత్రమే తాత్కాలిక ప్రాతినిధ్యాలు లభిస్తూ కొనసాగుతున్నారు. మిగతా బీసీ కులాలకు ఇందులో ప్రాతినిధ్యం లేదు. రాజకీయంగా కనీసం వార్డు సభ్యుడు కూడా కాలేని వెనుకబాటుతనం ఉన్న కులాలు రాష్ట్రంలో వందకు పైనే ఉంటాయి. వీళ్ళకు సంబంధించిన వర్గీకరణ జరగాలి. అదే విధంగా పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడిన దగ్గరి నుంచి ఇప్పటి వరకు ఎన్నికైన వారిని కులాలవారీగా లెక్కలు తీసి చూడాలి.

జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం అందటానికి స్థానిక సంస్థల్లో సగం స్థానాలు పొందటం ఆ వర్గాల ఎదుగుదలకు ఒక మెట్టు అవుతుంది. నేటికీ గ్రామాలు ఆధిపత్య వర్గాల పెత్తనంలోనే ఉన్నాయి. పెత్తందారీ వర్గాల చేతుల్లో ఉన్న స్థానిక సంస్థలు బీసీ వర్గాల చేతుల్లోకి వచ్చినప్పుడు మాత్రమే సామాజిక మార్పు సాధ్యమవుతుంది. బహుజన వర్గాలు తమ ఐకమత్యంతో సంఘటితంగా నిలిచి కుల గణన జరిగేదాకా ఉద్యమించక తప్పదు. స్థానిక సంస్థల్లో తమ వాటా తాము పొందేందుకు బీసీలంతా ఐక్యమై నిలవాల్సిన సందర్భమిది. స్వీయ రాజకీయ అస్తిత్వంతో పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్న చరిత్ర ఈ నేలకున్నది. అదే స్ఫూర్తితో బడుగులందరూ ఐక్యమై నిలిచి స్థానిక సంస్థల్లో సమవాటా పొందేందుకు బహుజన స్వీయ రాజకీయ అస్తిత్వంతో ముందుకు అడుగులు వేయాలి. బీసీలు స్థానిక సంస్థల దగ్గర్నుంచి అన్ని రంగాల్లోనూ తలెత్తుకుని నిలిచినప్పుడే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. గ్రామీణ తెలంగాణలో పెత్తందారీతనాలు తుడిచిపెట్టుకుని పోవాలంటే స్థానిక సంస్థలు బహుజన వర్గాల చేతుల్లోకి రావాలి. బహుజన రాజకీయ స్థిరత్వాన్ని ఏ పార్టీ తమ ఆత్మగా మార్చుకోగలుగుతుందో అదే ఈ నేలపై మనగలుగుతుంది. రాదనుకున్న తెలంగాణ చూశాం. ఇక బహుజనులు అన్ని రంగాల్లో ఎదిగిరావటం చూడాలని బహుజన వర్గాలు ఆశగా ఎదురు చూస్తున్నాయి.

వ్యాసకర్త కవి – రచయిత

నిత్య ఆచరణీయం

క్రీస్తుపూర్వం 6వ శతాబ్దంలో పుట్టిన కొత్త మతాలలో బౌద్ధం అత్యంత ప్రాముఖ్యం కలిగివుంది. దీని స్థాపకుడు బుద్ధుడు (సిద్ధార్థుడు). గయలో బోధి వృక్షం కింద తపస్సు చేసిన సిద్ధార్థుడు జ్ఞానోదయం పొంది బుద్ధునిగా మారాడు. ఆయనకు జ్ఞానోదయమైన పున్నమి రోజును 'బుద్ధ పూర్ణిమ'గా జరుపుకొంటున్నారు. బుద్ధుడు సరళమైన తాత్వికత, ఆచరణాత్మకతలతో సమాజాన్ని ప్రభావితం చేశాడు. వైదిక మతంలోని అణిచివేత నుంచీ దళిత, పీడిత, అట్టడుగు వర్గాలను విముక్తి చేశాడు. బుద్ధుని ఉపదేశంలో నాలుగు గొప్ప సత్యాలున్నాయి. అవి లోకం



దుఃఖమయం. దుఃఖానికి మూలం కోరిక. కోరికను నివారించడం ద్వారా దుఃఖాన్ని నివారించవచ్చు. అష్టాంగ మార్గాన్ని అనుసరించడం ద్వారా కోరికలను నివారించవచ్చు. అష్టాంగ మార్గంలో సరైన దృష్టి, సరైన ఆలోచన, సరైన వాక్కు, సరైన క్రియ, సరైన జీవనం, సరైన సాధన, సరైన స్మృతి, సరైన ధ్యానం వంటి ఎనిమిది శాస్త్రీయ పరిష్కారాలు చూపాడు. వీటిని చక్కగా అర్థం చేసుకొని ఆచరణలో పాటించడం ద్వారా మనశ్శాంతి, జ్ఞానం, నిర్వాణం పొందొచ్చని బౌద్ధం చెబుతోంది.

బౌద్ధం ముఖ్యంగా ధార్మిక రంగాన్ని విప్లవీకరించింది. అర్థం లేని కర్మకాండలు, మూఢ నమ్మకాలు, జంతుబలులతో భ్రష్టుపట్టిన మతాన్ని సంస్కరించి నైతికతను, మానవీయ విలువలను జోడించింది. సామాన్య ప్రజలకు చేరువయ్యే క్రమంలో పాళీ వంటి ప్రజల భాషలలో సాహిత్యాన్నీ, గొప్ప వాస్తు శిల్పకళలనూ ప్రోత్సహించింది.

ఏ పని చేసినా మనస్సాక్షిగా చేయాలని చెప్పాడు బుద్ధుడు. అప్పుడే వారు తమ ఆలోచనలు, భావోద్వేగాలు, పనుల గురించి స్పష్టంగా తెలుసుకోగలుగుతారు. భౌతిక సుఖాలపై అధిక వ్యామోహాలను వీడిన రోజే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందనే తాత్వికతను బుద్ధుడు తెలిపాడు. కావున బుద్ధి జీవిగా మారాలంటే బుద్ధుని బోధనలు తెలుసుకోవాల్సిందే, ఆచరించాల్సిందే!!

– జి. శ్యామల (నేడు బుద్ధ పూర్ణిమ)

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సీసీఎస్ ఏసీపీకి జ్యుడీషియల్ రిమాండ్

- వచ్చే నెల 5 వరకు విధించిన ప్రత్యేక కోర్టు
- ఉమామహేశ్వరరావు అక్రమాస్తుల మార్కెట్ విలువ రూ.50 కోట్ల పైనే
- ల్యాప్‌టాప్‌లో అక్రమాల చిట్టా



సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అరెస్టు చేసిన హైదరాబాద్ సీసీఎస్ ఏసీపీ టీఎస్ ఉమామహేశ్వరరావును అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. మంగళవారం రాత్రి ఆయన్ను అశోక్‌నగర్‌లోని ఇంట్లో అదుపులోకి తీసుకున్న ఏసీబీ బుధవారం నాంపల్లిలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరిచింది. కేసు పూర్వాపరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి వచ్చే నెల 5 వరకు ఉమామహేశ్వరరావుకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. మంగళవారం అశోక్‌నగర్‌లోని ఇల్లు, రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఆయన బంధువులు, స్నేహితుల నివాసాలు సహా మొత్తం 14 చోట్ల అధికారులు సోదాలు చేశారు. రూ.37.5 లక్షల నగదు, 60 తులాల బంగారం, వెండి ఆభరణాలు, 17 చోట్ల ఉన్న స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఉమామహేశ్వరరావు అక్రమాస్తుల అధికారిక విలువ రూ.3.95 కోట్ల వరకు ఉంటుందని అధికారులు ప్రకటించినప్పటికీ బహిరంగ మార్కెట్‌లో ఇది రూ.50 కోట్ల పైమాటే అని తెలుస్తోంది. ఈయన కూడగట్టిన అక్రమాస్తుల్లో విలాసవంతమైన విల్లా కూడా ఉన్నట్లు ఏసీబీ అధికారులు చెప్తున్నారు. కాగా, ఉమామహేశ్వరరావు బ్యాంక్ లాకర్లు తెరవాల్సి ఉందని ఏసీబీ అధికారులు ప్రకటించారు.

సీసీఎస్ కేసుల్లో గోల్‌మాల్‌లు: ప్రీ లాంచ్ ఆఫర్ల పేరుతో వేలాది మందిని ముంచిన సాహితి ఇన్‌ఫ్రా కేసుల్ని దర్యాప్తు చేస్తున్న ఉమామహేశ్వరరావు భారీగా డబ్బు దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ దర్యాప్తులో ఆయన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తనకు ఉన్న విషయ పరిజ్ఞానాన్ని, చట్టంపై పట్టును వినియోగించుకుని సివిల్ కేసులను సైతం క్రిమినల్ కేసులుగా మార్చి రూ.లక్షలు దండుకున్నట్లు తెలిసింది. సీసీఎస్‌లో దర్యాప్తు చేసిన కేసుల్లోనూ భారీ గోల్‌మాల్‌లు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో ఆ వివరాలూ ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఉమామహేశ్వరరావు తన ఇంట్లో ఎలాంటి నగదు ఉంచకుండా సమీప బంధువులు, స్నేహితుల వద్ద ఉంచినట్లు ఏసీబీ చెప్తోంది. ఇతని బినామీల్లో సందీప్ అనే వ్యక్తి ఉన్నట్లు ఆధారాలు సేకరించిన ఏసీబీ.. తాజాగా పలువురు పోలీసు అధికారులతో కలిసి ఆయన వ్యాపారాలు చేసినట్లు అనుమానిస్తోంది. ఈ వివరాలతో కూడిన డైరీని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. తాను ఎవరి దగ్గర నుంచి ఎంత డబ్బు తీసుకుంది, ఇంకా ఎంత రావాలనే అంశాలను ఉమా మహేశ్వరరావు తన ల్యాప్‌టాప్‌లో నిక్షిప్తం చేసినట్లు తెలిసింది. దీంతో ల్యాప్‌టాప్‌ను ఓపెన్ చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఏసీపీని సస్పెండ్ చేయాల్సిందిగా సిఫారసు చేస్తూ డీజీపీకి లేఖ రాయనున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.

మీడియా ప్రతినిధులపై చిందులు

ఏసీబీ కోర్టు వద్ద తనను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపై ఉమామహేశ్వరరావు చిందులు తొక్కారు. అరెస్టు అయినా ఈయన వ్యవహారశైలి మారలేదని, తమకు న్యాయం చేయాలంటే వచ్చే బాధితులకు చుక్కలు చూపించేవాడని చెబుతున్నారు. బాధితులు, నిందితులు అనే తేడా లేకుండా దుర్భాషలాడేవారని, పరుష పదజాలం ఉపయోగించేవారని తెలుస్తోంది. పలువురిపై చేయి చేసుకున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా అందాయని, సహోద్యోగులు, కింది స్థాయి సిబ్బందితో సైతం ఉమామహేశ్వరరావు వ్యవహారంశైలి తీవ్రంగా ఉండేదని సమాచారం.

క్లుప్తంగా...

పీవోకే స్వాధీనానికి మోదీ ప్రణాళిక

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్

సాక్షి, యాదాద్రి: పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రధాని మోదీ ప్రణాళికలు రూపొందిస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. వరంగల్– ఖమ్మం–నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నిక నేపథ్యంలో బుధవారం యాదాద్రి జిల్లా భువనగిరిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. విజన్ ఉన్న నేత మోదీ అని, ఆయన హ్యాట్రిక్ పీఎం కాబోతున్నారని చెప్పారు. యువత ఉద్యోగ, ఉపాధి కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి రూ.2వేల కోట్ల కప్పం కట్టారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమం, ఉచితాల పేరుతో ఇప్పటికే రూ.లక్షల కోట్ల అప్పు చేశారన్నారు. ఆరు నెలలైనా ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకైన ప్రేమేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని లక్ష్మణ్ కోరారు.

కరెంట్ షాక్‌తో ఆరు ఆవులు మృతి



చనిపోయిన ఆవులను పరిశీలిస్తున్న స్థానికులు

దోర్నకల్: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం మన్నెగూడెం గ్రామ శివారులో మంగళవారం కరెంట్ షాక్‌తో ఆరు ఆవులతోపాటు ఓ ఆంబోతు మృత్యువాతపడింది. మంగళవారం సాయంత్రం భారీ ఈదురుగాలులు వీయడంతో మన్నెగూడెం గ్రామ సమీపంలోని రైతు వేమిశెట్టి శ్రీనివాస్‌కు చెందిన వ్యవసాయ భూమిలో భారీ తుమ్మ చెట్టు కూలి పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లపై పడింది. దీంతో వైర్లు తెగి గాలిలో వేలాడాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం 20కిపైగా పశువులు శ్రీనివాస్ వ్యవసాయ భూమి మీదుగా మేతకు వెళ్తుండగా కొన్ని పశువులకు విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో షాక్ తగిలి నాలుగు ఆవులు అక్కడికక్కడే మృతిచెందగా మరో రెండు ఆవులతోపాటు ఆంబోతు కొద్ది దూరం వరకు పరిగెత్తి మృతి చెందాయి. విషయాన్ని గమనించిన సమీపంలోని రైతులు కిందకు వాలిన విద్యుత్ వైర్లను పక్కకు మళ్లించడంతో ప్రమాద తీవ్రత తగ్గింది. విద్యుత్ శాఖ ఏడీఈ రమేశ్, ఏఈ కిరణ్, పశు వైద్య అధికారి రాసమళ్ల శ్రవణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత రైతులకు న్యాయం చేసేందుకు కృషిచేస్తామని చెప్పారు. మరో ఘటనలో కురవి మండలం నల్లెల్ల గ్రామ శివారులో బుధవారం లింగ్యా తండా గ్రామవాసి ధరంసోత్ రవి అనే రైతుకు చెందిన ఆవు విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై చనిపోయింది.

కార్ డోర్ లాక్.. ఊపిరాడక చిన్నారి మృతి


- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన



కల్పిషా

మణుగూరు టౌన్ (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా): స్నేహితులతో కలిసి ఓ చిన్నారి ఆడుతూ వెళ్లి కార్‌లో కూర్చోగా...ఆ కార్ డోర్ లాక్ కావడంతో ఊపిరాడక మృతి చెందింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని సాంబాయిగూడెంలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సాంబాయిగూడెంకు చెందిన సాయికుమార్ – లిఖిత దంపతుల కుమార్తె కల్పిషా అలియాస్ మింటూ(3) మంగళవారం సాయంత్రం తోటి చిన్నారులతో ఆడుకుంటోంది. ఈ క్రమంలో ఇంటి పక్కనే నిలిపి ఉన్న కార్‌లోకి ఎక్కి డోర్ వేసుకోగా తలుపు ఆటోమేటిక్‌గా లాక్ అయిపోయింది. ఎంతసేపటికీ చిన్నారి ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు వెతుకుతుండగా కార్‌లో కనిపించింది. దీంతో తలుపులు తీసి చూడగా అప్పటికే కల్పిషా మృతి చెందింది. అప్పటివరకు ఆడుకున్న చిన్నారి విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌పై సస్పెన్షన్ వేటు



సత్యనారాయణరెడ్డి

తుర్కయంజాల్, నిర్మల్: తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డిని సస్పెండ్ చేస్తూ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డి.దివ్య ఉత్తర్వులు జారీచేశారు. గతంలో నిర్మల్ మున్సిపాలిటీకి కమిషనర్‌గా పనిచేసిన సమయంలో నిబంధనలకు విరుద్ధంగా అవుట్‌సోర్సింగ్ విధానంలో 44 మంది సిబ్బందిని నియమించారనే ఫిర్యాదుపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఇది వాస్తవమేనని విచారణలో తేలడంతో సత్యనారాయణరెడ్డిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన ఫిబ్రవరి 20న తుర్కయంజాల్‌లో బాధ్యతలు చేపట్టారు.

'పంటల బీమా'కి రూ.3 వేల కోట్లు

- రైతుల ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది
- భవిష్యత్‌లో దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం రూ.3 వేల కోట్లు ఖర్చు చేయనుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. ప్రభుత్వమే రైతుల ప్రీమియాన్ని చెల్లిస్తుందని స్పష్టం చేశారు. ఈ వానాకాలం పంటల సీజన్ నుంచే అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు బుధవారం మంత్రి తుమ్మల ఒక ప్రకటన జారీచేశారు. తడిచిన ధాన్యాన్ని సైతం తమ ప్రభుత్వం సేకరిస్తుందని వివరించారు. గతంతో పోలిస్తే ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు జిల్లాకొక ఐఏఎస్‌ను నియమించి ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నామని వివరించారు. తరుగు, తాలు పేరుతో కోతలు లేవని స్పష్టం చేశారు. గతంలో ప్రతి క్వింటాకు 7 నుంచి 10 కేజీల వరకు తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ జరిగిందనీ, ఈ దఫా మిల్లర్ల దోపిడీపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో కోతలకు మిల్లర్లు స్వస్తి చెప్పారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ప్రతి కింటాపై రైతుకు రూ.150 నుంచి రూ.200 రూపాయల వరకు అదనపు లబ్ధి చేకూర్చామని తెలిపారు. పంట అమ్ముకున్న ఐదు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు చేరుతుందని మంత్రి స్పష్టం చేశారు. గతంలో 45 రోజులు పట్టేదని, దాంతో రైతు ఎంతో వడ్డీ నష్టపోయేవాడని గుర్తు చేశారు.

భవిష్యత్‌లో దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్

తెలంగాణలో సన్న వడ్ల సాగును పెంచేందుకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించిందని మంత్రి తుమ్మల పునరుద్ఘాటించారు. రైతులు నాట్లేసుకునే సమయం దగ్గర పడిన నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన ఈ స్కీంను ప్రవేశపెట్టామని తెలిపారు. భవిష్యత్‌లో దొడ్డు వడ్లకు కూడా ఈ స్కీం వర్తింపచేస్తామని హామీనిచ్చారు. రాష్ట్రంలో దొడ్డు వడ్లు తినడం చాలా తగ్గిపోయిందనీ, పేదలు కూడా పెద్దోళ్లు తినే సన్న బియ్యం తినాలనే సంకల్పంతో రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి అన్ని హామీలను పూర్తి చేసి తీరుతామనీ, లేకుంటే ఓట్లే అడగబోమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

నీటికుంటలో మునిగి ఇద్దరు బాలురు మృతి



నాగధనుష్ (ఫైల్)



సాత్విక్ (ఫైల్)

మిర్యాలగూడ: ఇద్దరు చిన్నారులు నీటి కుంటలో పడి మృతిచెందారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. దామరచర్లకు చెందిన ఇండ్ల నాగధనుష్ (11), ఏపీలోని పల్నాడు జిల్లా మాచవరం మండలం యామారం గ్రామానికి చెందిన పెద్దిశెట్టి సాత్విక్ (8)లు అక్కాచెల్లెళ్ల కుమారులు. ముత్యాలమ్మ జాతర సందర్భంగా సాత్విక్ దామరచర్లలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. బుధవారం నాగధనుష్, సాత్విక్‌తో పాటు మరికొంతమంది బాలురు కలసి దామరచర్ల సమీపంలోని నాగుల చెరువు వద్ద ఉన్న నీటి కుంటలో ఈత కొట్టేందుకు వెళ్లారు. అయితే, కుంట లోతు ఎక్కువగా ఉండడంతో నాగధనుష్, సాత్విక్‌లు నీటిలో మునిగిపోయారు. వారు నీటిలో మునిగిపోవడంతో ఒడ్డున ఉన్న మిగతా బాలురు వెంటనే స్థానికులకు చెప్పడంతో వారు అక్కడికి చేరుకుని నీటిలో మునిగిన నాగధనుష్, సాత్విక్‌లను బయటకు తీసి పరీక్షించగా అప్పటికే ధనుష్ ఊపిరి ఆడక మృతిచెందాడు. కొన ఊపిరితో ఉన్న సాత్విక్‌ను మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పిల్లల మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ఆస్పత్రిలో కరెంటు కట్‌పై సీఎం ఆగ్రహం

ఎంజీఎంలో విద్యుత్ ఘటనపై ఎమ్మెల్యే నాయినితో మాట్లాడిన రేవంత్



ఎంజీఎం ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మంగళవారం రాత్రి మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయి రోగులు ఇబ్బందులు పడిన ఘటనపై తిరుపతిలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. బుధవారం ఉదయం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి కరెంటు నిలిచిపోయిన ఘటనపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మరోవైపు సీఎంఓ ఆదేశాలతో కలెక్టర్ ప్రావీణ్య ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించారు. జనరేటర్ బ్యాటరీ చెడిపోయి నెలలు గడిచినా మరమ్మతులు చేయించలేదని ఎలక్ట్రికల్ సిబ్బంది చెప్పగా, వెంటనే మరమ్మతులు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇక ఈ ఘటనపై మంత్రి రాజనర్సింహ, డీఎంఈ హైదరాబాద్ నుంచి జూమ్ మీటింగ్‌లో సమీక్షించారు. కాగా, జనరేటర్ పనిచేయకపోవడంపై సంజాయిషీ ఇవ్వాలని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌కు కలెక్టర్ ప్రావీణ్య షోకాజ్ నోటీసు ఇచ్చారు.

వాణిజ్య వడ్డన..!

▶ మొదటి పేజీ తరువాయి

కొనసాగించేందుకు ఈఆర్సీ అనుమతినిచ్చింది.

జనవరి 31 వరకే గడువు ఇచ్చిన ఈఆర్సీ..

విద్యుత్ టారిఫ్ నిబంధనల ప్రకారం.. డిస్కంలు ఏటా నవంబర్ 30వ తేదీలోగా తర్వాతి ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఏఆర్ఆర్, కొత్త టారిఫ్ ప్రతిపాదనలను ఈఆర్సీకి సమర్పించాలి. తర్వాతి ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని వినియోగదారులకు ఎన్ని మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంటుంది? దానికి ఎంత ఆదాయం అవసరం? ప్రస్తుత విద్యుత్ చార్జీలతో వచ్చే ఆదాయం ఎంత? వ్యత్యాసం (ఆదాయ లోటు) ఎంత? రాష్ట్ర ప్రభుత్వమిచ్చే విద్యుత్ సబ్సిడీలు పోగా మిగిలే లోటును భర్తీ చేసేందుకు.. ఎంత మేర విద్యుత్ చార్జీలు పెంచాలి? వంటి అంశాలు ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనల్లో ఉంటాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 2024–25 ఆర్థిక సంవత్సర ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనలను సిద్ధం చేసినా.. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో వాయిదా వేశారు. అప్పట్లో డిస్కంల విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది జనవరి 31 వరకు ఈఆర్సీ గడువు పొడిగించింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో మూడు నెలలు గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేసినా.. ఈఆర్సీ తిరస్కరించింది. వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించింది.

ప్రస్తుతం ప్రతినెలా రూ1,386 కోట్లలోటు..

డిస్కంల ఆర్థిక నష్టాలు రూ.50,275 కోట్లకు, అప్పులు రూ.59,132 కోట్లకు పెరిగిపోయినట్టు గతంలో విద్యుత్‌పై విడుదల చేసిన శ్వేతపత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెల్లడించింది. డిస్కంలు సగటున ప్రతి నెలా రూ.1,386 కోట్ల లోటు ఎదుర్కొంటున్నట్టు పేర్కొంది.

కోడ్ ముగిస్తే వారికీ ఉచిత విద్యుత్..

కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద రాష్ట్రంలో గృహ వినియోగదారులకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరాను ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే అప్పటికే స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించలేదు. ఆ జిల్లాలోని 8 లక్షల గృహ కనెక్షన్లతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పొందిన విద్యుత్ కనెక్షన్లకు ఎన్నికల కోడ్ ముగిశాక ఈ పథకాన్ని వర్తింపజేసే అవకాశం ఉంది. ప్రస్తుతం గృహజ్యోతి పథకంతో నెలకు రూ.120 కోట్ల భారం పడుతోందని.. అది రూ.150 కోట్లకు చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గృహజ్యోతి అమలుకు అనుమతిస్తూ ఈఆర్సీ జారీ చేసిన ఆదేశాల మేరకు... రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా ముందస్తుగానే డిస్కంలకు ఈ సబ్సిడీ మొత్తాన్ని చెల్లిస్తోంది. ఓ వైపు 200 యూనిట్లలోపు వినియోగించే వారికి ఉచితంగా విద్యుత్ అందిస్తూ.. అంతకు మించి విద్యుత్ వినియోగించే వారి బిల్లులను పెంచడం సమంజసం కాదనే భావన అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే గృహేతర కేటగిరీల విద్యుత్ చార్జీలను మాత్రమే పెంచేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని నిర్ణయించినట్టు తెలిసింది.

సన్న విత్తనాలు సిద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

ఐఐఆర్ఆర్, ఉద్యాన, పశు వైద్య విశ్వవిద్యాలయం, వ్యవసాయ, ఉద్యాన అనుబంధ శాఖలు టీఎస్ఎస్‌డీసీ, ఎస్ఎస్‌సీ, టీఎస్ఎస్ఓసీఏలు పాల్గొననున్నాయి. అదే రోజున విశ్వవిద్యాలయ పరిధిలోని మూడు (జగిత్యాల, పాలెం, వరంగల్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు, అలాగే వర్సిటీ పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రాలలో కూడా విత్తన మేళా నిర్వహించనున్నారు. వర్సిటీ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు మేళా ప్రారంభం కానుంది. విత్తనాలతో పాటు వర్సిటీ రూపొందించిన వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులు రైతుల కొనుగోలు నిమిత్తం అందుబాటులో ఉంటాయి. మొత్తం 16 పంటలకు సంబంధించిన 67 రకాల విత్తనాలు కూడా ఉంటాయి. మేళాలో భాగంగా వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై రైతుల సందేహాలు తీర్చటానికి ఆయా పంటల ప్రధాన శాస్త్రవేత్తలతో చర్చా గోష్టి ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించటానికి వీలుగా వ్యవసాయ, అనుబంధ రంగాలతో కూడిన వ్యవసాయ ప్రదర్శన కూడా 24న నిర్వహిస్తున్నారు.

ఈ 19 రకాలకే బోనస్?

విత్తన మేళాలో వ్యవసాయ వర్సిటీలో రూపొందించిన 19 రకాల సన్న వరి విత్తనాలు విక్రయిస్తారు. బి.పి.టి. 5204, డబ్ల్యూ.జి.ఎల్–44, డబ్ల్యూ.జి.ఎల్ –962, డబ్ల్యూ.జి.ఎల్. 1119, డబ్ల్యూ.జి.ఎల్.1246, డబ్ల్యూ.జి.ఎల్ 1487, ఆర్.డి.ఆర్ 1162, ఆర్.డి.ఆర్ 1200, కె.ఎన్.ఎం 1638, కె.పి.ఎస్. 6251, జె.జి.ఎల్– 28545, జె.జి.ఎల్ 27356, జె.జి.ఎల్ 33124, ఆర్.ఎన్.ఆర్.15435, ఆర్.ఎన్.ఆర్–2465, ఆర్.ఎన్.ఆర్– 11718, ఆర్.ఎన్.ఆర్. 21278, ఆర్.ఎన్.ఆర్. 29325, ఆర్.ఎన్.ఆర్. 15048 రకాలు అందుబాటులో ఉంటాయి. అయితే ఈ 19 రకాల సన్న రకం విత్తనాలకే రూ. 500 బోనస్ ఇస్తారా అన్న చర్చ జరుగుతోంది. పైగా ఇవి వ్యవసాయ వర్సిటీ అభివృద్ధి చేసినవి కావడంతో ప్రభుత్వం వీటినే సిఫారసు చేస్తుందన్న ప్రచారమూ జరుగుతోంది. రైతులను సన్నాల వైపు మళ్లించాలన్న ఆలోచనతోనే బోనస్ ప్రకటించిందని అధికారులు చెబుతున్నారు. దీనిపై స్పష్టత రావాల్సి ఉందని అంటున్నారు.

8 రకాల దొడ్డు విత్తనాలు

దొడ్డు గింజలకు సంబంధించి 8 రకాలు.. ఆర్.ఎన్.ఆర్–28361, ఆర్.ఎన్.ఆర్. 15459, కె.ఎన్.ఎం 118, ఎమ్.టి.యు. 1010, డబ్ల్యూ.జి.ఎల్– 915, జె.జి.ఎల్ 24423, జె.జి.ఎల్ 28639 అందుబాటులో ఉంచుతారు. సువాసన కలిగిన రకం ఆర్.ఎన్.ఆర్–2465 కూడా విక్రయిస్తారు. ఇక మొక్కజొన్నలో 5 హైబ్రిడ్లు డి.హెచ్.యం 117, డి.హెచ్.యం 121, బి.పి.సి.హెచ్. 6, కరీంనగర్ మక్క, కరీంనగర్ మక్క–1 ఉంటాయి. జొన్నలో పి.వై.పి.ఎస్–2, సి.ఎస్.వి–41, రాగిలో పి.ఆర్.ఎస్.38, ఆముదంలో పి.సి.హెచ్. 111, నువ్వుల్లో జె.జి.యస్–1020, వేరుశనగలో ధరణి విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నట్లు వ్యవసాయ వర్సిటీ ప్రకటించింది. అలాగే అపరాలకు సంబంధించి పెసరలో డబ్ల్యూ.జి.జి 42, ఎమ్.జి.జి 295, ఎమ్.జి.జి 347, ఎమ్.జి.జి 385, మినుములో యం.బి.జి. 1070, కందిలో 8 రకాలు.. హనుమ, డబ్ల్యూ.ఆర్.జి.ఇ– 97, డబ్ల్యూ.ఆర్.జి.ఇ–93, డబ్ల్యూ.ఆర్.జి.ఇ–121, డబ్ల్యూ.ఆర్.జి.ఇ–255, పి.ఆర్.జి–176, టి.డి.ఆర్.జి–59, ఆశ అందుబాటులో ఉంచుతారు. సోయా చిక్కుడులో 4 రకాలు.. బాసర, కె.డి.ఎస్–726, ఎం.ఎ.యు.యస్–612, ఎ.ఐ.ఎస్.బి–50తో పాటు పశుగ్రాస పంటల విత్తనాలు కూడా అందుబాటులో ఉంచుతామని ప్రకటించారు.

అణుపరీక్షతో దేశం గర్వించింది

- అటామిక్ ఎనర్జీ కమిషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ చిదంబరం



డాక్టర్ చిదంబరంను సన్మానిస్తున్న తెలంగాణ సైన్స్ అకాడమీ ప్రతినిధులు

లాలాపేట (హైదరాబాద్): భారతదేశంలో తొలిసారిగా నిర్వహించిన అణుపరీక్ష దేశం గర్వించదగినదని.. అప్పటి అణుపరీక్షలో కీలక పాత్ర పోషించిన అటామిక్ ఎనర్జీ కమిషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.చిదంబరం స్పష్టం చేశారు. అణుపరీక్ష నిర్వహించి యాభైఏళ్లు పూర్తయిన సందర్భంగా నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్, తెలంగాణ సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంయుక్తంగా బుధవారం తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో స్మైలింగ్ బుద్ధా గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఆర్.చిదంబరం 'మే 1974 టెస్ట్ అండ్ బియాండ్' అనే అంశంపై ప్రసంగిస్తూ అణుపరీక్షను 75 మంది బృందంతో కలిసి నిర్వహించినట్లు తెలిపారు. ఆ బృందంలో ఓ సభ్యుడిగా వ్యవహరించానని వివరించారు. అణుపరీక్ష నుంచి వెలువడిన శక్తితో రాళ్లు సైతం కరిగిపోయాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌సీ చైర్మన్ డాక్టర్ కోమల్ కపూర్, తెలంగాణ సైన్స్ అకాడమీ జనరల్ సెక్రటరీ, ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు, డాక్టర్ ఎ.జ్యోతి, ప్రొఫెసర్ ఎస్ఎం రెడ్డి పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించకుంటే తిరుగుబాటు

- సర్పంచుల సంఘం హెచ్చరిక



నాంపల్లి/ సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీలకు పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మాసబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎదుట పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ గ్రామ సర్పంచుల సంఘం నేతలు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఎక్కువగా ఉన్నారనే కారణంతో ప్రభుత్వం పెండింగ్ బిల్లులపై నిర్లక్ష్యం వహిస్తోందని దుయ్యబట్టారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం చూస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసి నాలుగు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు పంచాయతీలకు చిల్లిగవ్వ కూడా ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు ఆగకూడదనే లక్ష్యంతో వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, ఇతర కార్యక్రమాలను తమ పద వీకాలంలో సర్పంచ్‌లు విడతల వారీగా చేపట్టిన విషయాన్ని సంఘం నాయకులు గుర్తు చేశారు. అలాగే పంచాయతీల వర్కర్లకు జీతాలు అందక వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. అనంతరం ఎన్నికల కమిషనర్ పార్థసారథికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రనిల్ చందర్, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, ఇతర నేతలు అమరేందర్ రెడ్డి, సముద్రాల రమేశ్, పంబ కరుణాకర్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌ను గర్భవతిని చేసి నిమ్స్‌లో వదిలేశాడు!

- నల్లగొండ జిల్లాకు చెందిన ఒక యువకుడి నిర్వాకం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు!
- అది మాజీ ప్రజాప్రతినిధి కుమారుడి నిర్వాకంగా ప్రచారం



లక్డీకాపూల్ (హైదరాబాద్): నల్లగొండ జిల్లాకు చెందిన ఓ యువకుడు.. మాయమాటలు చెప్పి ఓ మైనర్ బాలికను లోబర్చుకున్నాడు.. ఆమె గర్భం దాల్చడంతో గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్‌లోని 'నిమ్స్ (నిజాం వైద్య విజ్ఞాన సంస్థ)'ఆస్పత్రికి తీసుకువచ్చాడు.. తనకు పరిచయం ఉన్న ఓ ఉద్యోగి సాయంతో నిమ్స్ అధికారిని కలిశాడు.. ఆ అధికారి సహకారంతో మైనర్ గర్భిణిని నిమ్స్ ఆస్పత్రిలో అడ్మిట్ చేయించాడు. కానీ ఈ విషయం బయటికి లీకైంది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగి సమగ్ర దర్యాప్తు చేపట్టారు.

మూడు రోజులుగా ఆస్పత్రిలో..

నల్లగొండ జిల్లా నకిరేకల్ ప్రాంతానికి చెందిన ఓ బాలిక (16 ఏళ్లు) కడుపులో నొప్పితో బాధపడుతోందని చెప్తూ.. ఒక యువకుడు మూడు రోజుల క్రితం నిమ్స్ ఆస్పత్రికి తీసుకు వచ్చాడు. అప్పటికే ఆమె నాలుగు నెలల గర్భవతి అని, ఆమెను వదిలించుకోవాలనే ఉద్దేశంతోనే తీసుకువచ్చాడని సమాచారం. ఈ విషయం వెలుగులోకి రాకుండా ఉంచేందుకు నిమ్స్‌లో తనకు తెలిసినవారితో కలసి ప్రయత్నించాడని తెలిసింది. వైద్యులు బాలికకు వైద్య పరీక్షలు చేసినప్పుడు.. ఆమె గర్భవతి అని గుర్తించినా, కప్పిపుచ్చే ప్రయత్నం జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజానికి ఆమెకు చికిత్స ఏదీ అవసరం లేకున్నా.. ఆశ్రయం ఇచ్చే ఉద్దేశంతో మిలీనియం బ్లాక్ రూమ్ నంబర్ 322లో ఇన్‌పేషెంట్‌గా చేర్చుకున్నట్టు తెలిసింది. వారు ఇలా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ విషయం బయటికి పొక్కింది. విషయం సీరియస్‌గా మారుతోందని గుర్తించిన నిమ్స్ వర్గాలు.. బుధవారం బాలికను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసి చేతులు దులుపుకొనేందుకు ప్రయత్నించాయని సమాచారం. అయితే పోలీసులు నిమ్స్‌కు చేరుకుని బాలికను నల్లగొండకు తరలించినట్టు ప్రచారం జరుగుతోంది. బాలికను మోసం చేసిన సదరు యువకుడు ఆమెకు బావ అవుతాడని ఓవైపు.. ఓ మాజీ ప్రజాప్రతినిధి కుమారుడే కారణమని మరోవైపు ప్రచారం జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే పోలీసులు ఈ వ్యవహారంపై మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మెడికో లీగల్ కేసు కిందే వైద్యం చేశాం

సదరు బాలిక కడుపులో నొప్పితో బాధపడుతూ నిమ్స్‌కు వచ్చింది. ఆమెకు వైద్య పరీక్షలు చేయించిన తర్వాతే గర్భవతి అని తేలింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాం. మెడికో లీగల్ కేసు (ఎంఎల్‌సీ)గా పరిగణించే, ఆ తరహాలో నమోదు చేశాకే వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం.

– ప్రొఫెసర్ నగరి బీరప్ప, నిమ్స్ డైరెక్టర్

అధిక వడ్డీ ఆశజూపి రూ. 2 కోట్లతో పూజారి పరారీ

- బాధితుల్లో ప్రజా ప్రతినిధులు, పోలీసులు సైతం
- న్యాయం చేయాలని బాధితుల ఫిర్యాదు
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన

వేములవాడ (రాజన్న సిరిసిల్ల జిల్లా): అందరితో కలిసిమెలిసి ఉంటూ..జ్యోతిష్యం, జాతకాలు చెబుతుండే ఓ పూజారి రూ. 2 కోట్లకు టోకరా పెట్టిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు తెలిపిన వివరాలు. వేములవాడ పట్టణం మార్కండేయనగర్ వీధిలో మహేశ్ అనే పూజారి శివసాయిరాం జ్యోతిష్యాలయం నిర్వహిస్తూ జాతకాలు, జ్యోతిష్యం చెబుతుండేవాడు. అయితే జాతకాలు చూపించుకునేందుకు పూజారి మహేశ్ వద్ద కు వచ్చిన వారికి మహేశ్‌తోపాటు మరికొందరు స్నేహితులు, బంధువులు అధిక వడ్డీ ఆశ జూపి వారినుంచి అందినకాడికి వసూలు చేశారు. ముందు చెప్పినట్లుగానే ఎక్కువ మొత్తంలో వారికి వడ్డీ చెల్లిస్తుండటంతో ఆశతో రూ. 2 లక్షల నుంచి రూ.40లక్షల వరకు ఇచ్చిన వారు ఉన్నారు. మహేశ్‌కు డబ్బులు ఇచ్చిన వారి లో కొందరు ప్రజాప్రతినిధులు, పోలీసు ఉద్యోగులు సైతం ఉన్నారు. ఇలా రూ. 2 కోట్ల వరకు వసూలు చేసిన మహేశ్ ఈ నెల 3 నుంచి కనిపించడం లేదు. వేములవాడలోని జ్యోతిష్యాలయానికి తాళం వేసి ఉంది. ఫోన్ చేస్తుంటే స్విచ్ఛాఫ్ వస్తుండటంతో అనుమానంతో బాధితులు వారం క్రితం జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్‌కు ఫిర్యాదు చేశారు. అయితే వేములవాడలో ఉన్న తన ఇంటిని సైతం బంధువులకే రాసిచ్చేశాడని బాధితులు చెబుతున్నారు. రూ. 2 కోట్లతో ఉడాయించిన పూజారిని పట్టుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

TENDER NOTICE

Further to the Tender Notice dated 11th May 2024 issued by GMR Hyderabad International Airport Limited (GHIAL) inviting bids for "Hiring of Agency for Security Services at Hyderabad Airport for a period of 10 years and further extendable up to 5 years", timelines/Tender Process Schedule has been revised.

For details, interested parties are requested to visit www.hyderabad.aero/tenders.aspx to stay updated and do the needful.

HIA/59/PREM ASSOCIATES

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్
(రక్షణ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
4-01-001, కోర్ట్ కాంపౌండ్, S.P. రోడ్,
సికింద్రాబాద్-500 003, టెలిఫోన్ నం. 040-27808600
ఇ మెయిల్ : ID: ceo.scb2009@gmail.com

No. SCB/RS/Hoardings/Notice/950 తేదీ : 22.05.2024

బహిరంగ ప్రకటన

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో నివాసితుల భద్రత మరియు రక్షణ దృష్ట్యా ప్రైవేట్ భవనముల పైకప్పుపై ప్రకటన హోర్డింగు నిర్మాణాలు తొలగింపు కంటోన్మెంట్స్ యాక్ట్ 2006లోని సెక్షన్ 297 క్రింద నోటీసు

ప్రజల భద్రత దృష్ట్యా అన్ని పైకప్పు హోర్డింగ్‌లను వాటి నిర్మాణాలతో వెంటనే తొలగించాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ తీర్మానించింది.

అందువలన, కంటోన్మెంట్స్ యాక్ట్ 2006లోని సెక్షన్ 318తో చదువబడే కంటోన్మెంట్స్ యాక్ట్ 2006లోని సెక్షన్ 297 క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ మరియు వివిధ రిట్ పిటిషన్‌లలో గౌరవనీయ హైకోర్ట్ ద్వారా జారీ చేయబడిన ఉత్తర్వులను పాటిస్తూ, ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి పదిహేను (15) రోజులలోగా సంబంధిత నిర్మాణాలు/భవనములపై స్థాపించిన పైకప్పు ప్రకటన హోర్డింగ్‌లను తొలగించుట కోసం యజమాని లేదా స్వాధీనదారు మరియు అడ్వర్టైజింగ్ ఏజెన్సీ వారికి సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ యొక్క చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అయిన నేను ఇందుమూలంగా నోటీసు ఇస్తున్నాను. లేనిచో పైకప్పు హోర్డింగులను తొలగించుటకు దిగువ సంతకందారుచే చర్య తీసుకోబడును మరియు మీ నుండి వ్యయాలను రాబట్టుకొనబడును.

అయితే, సదరు భవనముల పైకప్పుపై ప్రకటన హోర్డింగ్ నిర్మాణాలు కలిగిన సంబంధిత ఇంటి యజమానులు/స్వాధీనదారులు మరియు అడ్వర్టైజింగ్ ఏజెన్సీలకు కంటోన్మెంట్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ 297 క్రింద వ్యక్తిగత నోటీసులు కూడా అందజేయడమైనది.

సం/- చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,
సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్

ఆరో విడత స్థానాల్లో...
కాంగ్రెస్ ఖాతా తెరిచేనా?

58 స్థానాలకు శనివారం పోలింగ్

- 2019లో ఒక్కటీ నెగ్గని కాంగ్రెస్
- 40 స్థానాలు గెలుచుకున్న బీజేపీ

ఏడు విడతలుగా జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటిదాకా ఐదు దశల్లో 428 స్థానాలకు ఎన్నికలు ముగిశాయి. మిగతా 115 లోక్‌సభ స్థానాలకు మే 25న ఆరు, జూన్ 1న ఏడో విడతలో పోలింగ్ జరగనుంది. దాంతో 42 రోజుల సుదీర్ఘ పోలింగ్ ప్రక్రియ ముగుస్తుంది. ఆరో విడతలో మొత్తం 58 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. హరియాణాలోని మొత్తం 10 సీట్లు, రాజధాని ఢిల్లీలోని 7 స్థానాలూ వీటిలో ఉన్నాయి. ఈ 58 స్థానాల్లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 44 చోట్ల బరిలో దిగినా కనీసం ఒక్క సీటు కూడా నెగ్గలేకపోయింది. అధికార బీజేపీ మాత్రం 53 చోట్ల పోటీ చేసి ఏకంగా 40 స్థానాలను కైవసం చేసుకోవడం విశేషం! అంతేగాక వాటిలో ఏకంగా 90 శాతం స్థానాల్లో 40 శాతం పై చిలుకు ఓట్లు సాధించింది! ఈ నేపథ్యంలో ఆ 40 స్థానాలనూ నిలబెట్టుకోవడం బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారింది. కానీ ఆప్‌తో జతకట్టిన కాంగ్రెస్ నుంచి అధికార పార్టీ ఈసారి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. ఏడో విడతలో పోలింగ్ జరగనున్న పంజాబ్‌లో ఆప్, కాంగ్రెస్ విడిగా పోటీ చేస్తున్నా హరియాణా, ఢిల్లీల్లో మాత్రం ఇండియా కూటమి భాగస్వాములుగా బరిలో దిగాయి. హరియాణాలో 9, ఢిల్లీలో 3 చోట్ల కాంగ్రెస్, మిగతా స్థానాల్లో ఆప్ బీజేపీకి పెను సవాలు విసురుతున్నాయి. దీనికి తోడు హరియాణాలో రైతుల అసంతృప్తి బీజేపీకి మరింత ప్రతికూలంగా మారేలా కన్పిస్తోంది.



ఆరో విడతలో పోలింగ్ జరగనున్న 58 లోక్‌సభ స్థానాల్లో గత మూడు ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రదర్శన

2019లో బీజేపీదే హవా!

ఆరో విడతలో పోలింగ్ జరుగుతున్న 58 లోక్‌సభ స్థానాల్లో 2019 ఎన్నికల్లో బీజేపీయే పూర్తి ఆధిపత్యం చలాయించింది. ఆరు స్థానాల్లోనైతే ఏకంగా 35 శాతం పై చిలుకు మెజారిటీ సాధించడం విశేషం. అవి కర్నాల్ (6.6 లక్షల మెజారిటీ), ఫరీదాబాద్ (6.4 లక్షలు), వెస్ట్ ఢిల్లీ (5.8 లక్షలు), నార్త్ వెస్ట్ ఢిల్లీ (5.5 లక్షలు), ధన్‌బాద్ (4.9 లక్షలు), భివానీ (4.4 లక్షలు). ఏ స్థానంలో అయినా మూడు వరుస ఎన్నికల్లో కనీసం రెండుసార్లు నెగ్గిన పార్టీని అక్కడ గట్టి పోటీదారుగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటారు. ఆ లెక్కన ఆరో విడత స్థానాల్లో బీజేపీ కనీసం 30 స్థానాల్లో గట్టి పోటీదారుగా ఉంది. కాంగ్రెస్‌కు మాత్రం అలాంటి స్థానం కేవలం హరియాణాలోని రోహ్‌తక్ మాత్రమే. అక్కడ కూడా 2009, 2014ల్లో నెగ్గినా 2019లో మాత్రం వెంట్రుకవాసిలో బీజేపీకి కోల్పోవడం విశేషం!

– సాక్షి, నేషనల్ డెస్క్

బీజేపీ కంచుకోటలు 5

ఆరో విడతలో పోలింగ్ జరగనున్న 58 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌కు కంచుకోటగా చెప్పదగ్గ సీటు ఒక్కటీ లేకపోవడం విశేషం. బీజేపీకి ఐదున్నాయి. బీజేపీ జార్ఖండ్‌లో ధన్‌బాద్, జెంషెడ్‌పూర్; బిహార్‌లో పూర్వీ చంపారన్, పశ్చిమ చంపారన్, శివోహర్ స్థానాలను చాలా ఏళ్లుగా గెలుచుకుంటూ వస్తోంది. ఒడిశాలోని కటక్, ఢెంకెనాల్, కియోంఝర్, పూరి స్థానాల్లో బీజేడీకి ఎదురు లేదు. అలాగే పశ్చిమ బెంగాల్లో కాంథీ, తామ్లుక్ లోక్‌సభ స్థానాలు తృణమూల్ కంచుకోటలు. ఆరో విడత స్థానాల్లో 2019లో 5 చోట్ల పోరు హోరాహోరీగా సాగింది. అయితే వాట న్నింట్లోనూ బీజేపీయే విజేతగా నిలవడం విశేషం! మఛ్లీషహర్ (యూపీ) నియోజకవర్గంలోనైతే బీజేపీ అభ్యర్థి భోలానాథ్ కేవలం 198 ఓట్ల (0.02 శాతం) మెజారిటీతో గట్టెక్కారు! శ్రావస్తి (యూపీ), రోహ్‌తక్ (హరియాణా), సంభాల్‌పూర్ (ఒడిశా), ఝార్‌గ్రాం (పశ్చిమ బెంగాల్) స్థానాలను కూడా బీజేపీ ఒక్క శాతం కంటే తక్కువ మెజారిటీతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. అయితే ఆరో విడత పోలింగ్ జరుగుతున్న 58 స్థానాలకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అంశముంది! వీటిలో మూడింట ఒక స్థానంలో ప్రజలు ప్రతి ఎన్నికలోనూ కొత్తవారిని గెలిపిస్తూ వస్తుండటం ఆసక్తికరం.

ప్రధాని కావాలని లేదు

- ఆప్ 22 చోట్ల పోటీ చేస్తున్న చిన్న పార్టీ
- 'మలివాల్'పై పారదర్శక దర్యాప్తు జరగాలి
- నా భార్య రాజకీయాల్లోకి రాబోదు
- పీటీఐ ఇంటర్వ్యూలో కేజ్రీవాల్

న్యూఢిల్లీ: విపక్ష ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రధాని కావాలన్న ఆశ తనకు అస్సలు లేదని ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. అయితే ఇండియా కూటమి గెలిస్తే న్యాయ వ్యవస్థను ఒత్తిళ్ల నుంచి విముక్తం చేస్తామన్నారు. తన భార్య సునీతకు రాజకీయాలు నచ్చవని వెల్లడించారు. బెయిల్‌పై విడుదలయ్యాక బుధవారం ఆయన తొలిసారి పీటీఐ వీడియోస్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. సొంత రాజ్యసభ ఎంపీ స్వాతీ మలివాల్‌పై తన ఇంట్లోనే పీఏ బిభవ్ కుమార్ దాడి చేసిన ఉదంతంపై కేజ్రీవాల్ తొలిసారి స్పందించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

నియంతృత్వాన్ని నిలువరిస్తాం

''బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే విపక్ష నేతలందర్నీ కట్టగట్టి జైలుకు పంపుతుంది. ఎన్నికలను హైజాక్ చేస్తుంది. రష్యా మాదిరే ఏక పక్ష ఎన్నికలుంటాయి. అక్కడ పుతిన్ విపక్ష నేతల్ని జైలుకు, కొందర్ని పైకి పంపారు. అందుకే తాజా ఎన్నికల్లో 87 శాతం ఓట్లు సాధించారు. పాకిస్థాన్‌లోనూ అంతే. ఇమ్రాన్ ఖాన్‌ను జైలుకు పంపారు. సొంత పార్టీ గుర్తును కూడా ఎన్నికల్లో వాడుకోనివ్వలేదు. బీజేపీ మళ్లీ గెలిస్తే ఎవ్వరినీ వదలదు. కానీ మోదీ నియంతృత్వ పాలనను నిలువరిస్తాం. ఇండియా కూటమి 300 మార్కు దాటుతుంది. చక్కటి, సుస్థిర ప్రజాపాలన సాగిస్తాం. నాకు ప్రధాని కావాలనే ఆలోచనే లేదు. మాది (ఆప్) చాలా చిన్న పార్టీ. కేవలం 22 చోట్ల పోటీ చేస్తున్నాం. ప్రధానిగా రాహుల్‌ను నేను అంగీకరిస్తానా అన్నది ఊహాజనిత ప్రశ్న. అలాంటి అంశాలు చర్చకే గెలిచాక అందరం కలిసి కూర్చొని దీనిపై చర్చిస్తాం.

సానుకూల పవనాలు ఊహించిందే

ఆప్ 2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 67 సీట్లు, 2020లో 62 సీట్లు సాధించింది. ఈసారి ఆప్–ఇండియా కూటమికి సానుకూల పవనాలు వీయడంలో ఆశ్చర్యమేమీ లేదు. నన్ను అరెస్టు చేయడంతో ఢిల్లీ ఓటర్లు భావోద్వేగానికి గురయ్యారు. ఆ ప్రజాగ్రహం బీజేపీ ఓటమికి కారణం కాబోతోంది. నాకు బెయిల్ దొరకడం నిజంగా దేవుడి మాయ. నన్ను జైలుకు పంపితే ఆప్ ముక్కలుచెక్కలవుతుందన్న బీజేపీ కల కలగానే మిగిలిపోయింది.

మలివాల్ ఉదంతంలో బాధితులకు న్యాయం జరగాలి

మలివాల్‌పై దాడి కేసు విచారణ నిష్పాక్షికంగా జరగాలి. రెండు వైపుల వాదనలను ఆలకించి పోలీసులు సరైన మార్గంలో దర్యాప్తు జరపాలి. నిజమైన బాధితులకు న్యాయం జరగాలి. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున ఇంతకు మించి మాట్లాడలేను.



న్యాయవ్యవస్థపై ఒత్తిళ్లుండవ్

ఇండియా కూటమి అధికార పగ్గాలు చేపడితే న్యాయవ్యవస్థపై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చేస్తాం. ఆ వ్యవస్థ స్వతంత్రంగా పని చేస్తుంది. అప్పుడు నాపై మోపిన కేసులన్నీ బోగస్ అని తేలుతాయి. అందుకే జూన్ 4 ఫలితాల తర్వాత విపక్షాల కూటమి గెలిచాక కేసుల నుంచి విముక్తుడినవుతా. ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించి బీజేపీ, ఈడీ ఆరోపించినట్లు నగదు అక్రమ బదిలీ జరగలేదు. ఈ కేసులో వాళ్లింతవరకు ఒక్క పైసా కూడా కనుక్కోలేకపోయారు. అవినీతి జరిగి ఉంటే ఆ నగదు అంతా ఎటు పోయినట్లు?

సునీతది ధర్మాగ్రహం

2000 దశకంలో ఢిల్లీ మురికివాడల పరిధిలో ఐటీ కమిషనర్‌గా పని చేశా. పదవీ విరమణ చేసి ప్రజా జీవితంలోకి వచ్చా. సొంతంగా పార్టీ పెడతానని, ఎన్నికల్లో పోటీ చేస్తానని, ఏకంగా సీఎం అవుతానని అస్సలు ఊహించలేదు. నా భార్య సునీతకు రాజకీయాలపై ఆసక్తి లేదు. భవిష్యత్తులోనూ క్రియాశీల రాజకీయాల్లోకి రాదు. నన్ను అక్రమంగా అరెస్టు చేసినందుకే తను ఇల్లు దాటి బయటికొచ్చి ధర్మాగ్రహం చూపింది. సునీత భార్య కావడం నా అదృష్టం. జీవితంలో ప్రతి సందర్భంలోనూ నాకు తోడుగా నిలిచింది. నేను జైల్లో ఉండగా నాకు, ఢిల్లీ ప్రజలకు వారధిగా నిలిచింది. కస్టడీ ముగిసి నేను జైలుకెళ్తే సీఎంగా బాధ్యతల నిర్వహణకు తగిన వసతులు కల్పించాలని కోర్టును కోరతా.

ముందస్తు ఎన్నికలకు సునాక్

జూలై 4న బ్రిటన్ సార్వత్రిక ఎన్నికలు

లండన్: ముందస్తు ఎన్నికలపై జోరుగా సాగిన ఊహాగానాలే నిజమయ్యాయి. పలు రకాలుగా సాగిన ఊహాగానాలకు తెరదించుతూ జూలై 4న బ్రిటన్ సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని ప్రధానమంత్రి రిషి సునాక్ బుధవారం ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని రాజు చార్లెస్–3కి తెలిపానని, పార్లమెంట్ రద్దుకు ఆయన అనుమతించారని వెల్లడించారు. వేసవిలో ఆరు వారాల్లో ఎన్నికలకు వెళుతున్నట్లు చెప్పారు. అధికారిక నివాసం 10 డౌనింగ్ స్ట్రీట్‌లో కేబినెట్ భేటీ అనంతరం భారతీయ సంతతి బ్రిటన్ ప్రధాని సునాక్ ముందస్తు ఎన్నికల ప్రకటన చేశారు. షెడ్యూల్ ప్రకారమైతే 2025 జనవరిలోగా బ్రిటన్ సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉంది. 10 డౌనింగ్ స్ట్రీట్ బయట ఎన్నికల ప్రకటన చేస్తూ.. తన పదవీకాలంలో సాధించిన విజయాలను సునాక్ వివరించారు. 'మీకు వీలైనంత భద్రత ఇవ్వడానికి నా అధికార పరిధికి లోబడి చేయగలిగినంతా చేస్తాను. ఇది నా హామీ. బ్రిటన్ తన భవిష్యత్తును ఎంచుకోవాల్సిన తరుణమిది' అని రిషి సునాక్ దేశ ప్రజలనుద్దేశించి అన్నారు. సునాక్ కన్జర్వేటివ్ పార్టీకి ఓటమి తప్పదని, లేబర్ పార్టీకి విస్పష్ట మెజారిటీ కనిపిస్తోందని చాలా ఒపీనియన్ పోల్స్ స్పష్టం చేశాయి. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలు, స్థానిక ఎన్నికల్లో వరుసబెట్టి లేబర్ పార్టీయే గెలుస్తూ వచ్చింది.



ఈ తరుణంలో రిషి సునాక్ ముందస్తు ఎన్నికలకు వెళ్లే సాహసం చేయడం గమనార్హం. అంతకుముందు బుధవారమే పార్లమెంటులో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సునాక్ బదులిస్తూ ఈ ఏడాది ద్వితీయార్థంలో ఎన్నికలుంటాయని చెప్పారు. అయితే ఆకస్మికంగా కేబినెట్ భేటీని ఏర్పాటు చేయడంతో ముందస్తు ఎన్నికలపై ఊహాగానాలు జోరందుకున్నాయి. ఆకస్మిక కేబినెట్ భేటీ కోసం విదేశాల్లో ఉన్న మంత్రులు సైతం అర్ధంతరంగా తమ పర్యటనలు ముగించుకొని స్వదేశానికి చేరుకున్నారు. చివరికి కేబినెట్ సమావేశం అనంతరం సునాక్ జూలై 4న ఎన్నికలుంటాయని ప్రకటించారు.

శాటిలైట్లను పేల్చేసే ఉపగ్రహం ప్రయోగించిన రష్యా

వాషింగ్టన్: శత్రుదేశాలైన అమెరికా, రష్యా అంతరిక్ష యుద్ధానికి తెరతీస్తున్నాయా? ఇప్పటి పరిణామాలు చూస్తే అదే నిజమనిపిస్తోంది. రష్యా అంతరిక్ష సంస్థ ఈ నెల 16న భూదిగువ కక్ష్యలోకి ఉపగ్రహాన్ని ప్రయోగించిందని అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం పెంటగాన్ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ పాట్ రైడర్ మంగళవారం చెప్పారు. ఇది అంతరిక్షంలోని ఉపగ్రహాలను పేల్చేసే సామర్థ్యం కలదని వెల్లడించారు. ఇప్పటికే అదే కక్ష్యలో ఉన్న తమ ప్రభుత్వ ఉపగ్రహం 'యూఎస్ఏ 314'ను దెబ్బతీయడానికే రష్యా ఈ చర్యకు పూనుకుందని ఆరోపించారు. దీనిపై రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా స్పందించారు. ఈ నెల 17న సోయుజ్–2.1బీ వాహక నౌక ద్వారా 'కాస్మోస్ 2576' ప్రయోగించిన మాట నిజమేనని పేర్కొన్నారు. అయితే, ఈ ప్రయోగం తమ రక్షణ శాఖ ప్రయోజనాలకే తప్ప మరో ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. అమెరికా ఉపగ్రహం, రష్యా తాజాగా ప్రయోగించిన ఉపగ్రహం ఒకే కక్ష్యలో ఉన్నాయని అంతరిక్ష నిపుణులు చెప్పారు. ఉక్రెయిన్ సైన్యానికి సహకరించే అమెరికా శాటిలైట్లను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తామని రష్యా ఇటీవలే హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం.

బెంగాల్‌లో బంగ్లా ఎంపీ హత్య

మృతదేహం కోసం కొనసాగుతున్న అన్వేషణ

కోల్‌కతా/ఢాకా: చికిత్స కోసం భారత్‌కు వచ్చిన బంగ్లాదేశ్‌కు చెందిన అవామీ లీగ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అన్వర్ దారుణ హత్యకు గురయ్యారు. కోల్‌కతాలోని న్యూటౌన్ లగ్జరీ అపార్ట్‌మెంట్‌లో పోలీసులు రక్తపు మరకలను గుర్తించారు. మృతదేహం కోసం పోలీసుల అన్వేషణ కొనసాగుతోంది. నిందితులు, హత్యకు గల కారణాల కోసం పోలీసులు వెతుకుతున్నారు. బంగ్లా సీనియర్ నేత హత్యోదంతాన్ని ఇరుదేశాల ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకున్నాయి. పశ్చిమబెంగాల్ సీఐడీ విభాగం ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను ఢాకాలోని వరీ ప్రాంతంలో అరెస్ట్‌చేశారు.



కోల్‌కతాకొచ్చి కనిపించకుండాపోయి..

మే 12వ తేదీన ఎంపీ అన్వర్ నార్త్ కోల్‌కతాలోని బారానగర్‌లో తనకు పరిచయస్తుడైన గోపాల్ బిశ్వాస్ ఇంటికి వచ్చారు. మే 13వ తేదీ మధ్యాహ్నం డాక్టర్ అపాయింట్‌మెంట్ ఉందని చెప్పి అన్వర్ బయటకు వెళ్లారు. రాత్రి భోజనానికి వస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి ఎంతకీ రాకపోవడంతో గోపాల్‌కు అనుమానమొచ్చింది. అయితే అత్యవసర పని మీద ఢిల్లీకి వెళ్తున్నానని, వీఐపీలను కలబోతున్నానని వాట్సాప్ సందేశాలు వచ్చాయి. తర్వాత మే 17వ తేదీదాకా ఆయన నుంచి ఎలాంటి మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ రాకపోవడంతో మే 18వ తేదీన మిస్సింగ్ కంప్లయింట్ ఇచ్చారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అన్వర్ ఫోన్ జాడను కనిపెట్టే పనిలో పడ్డారు. మే 13న అన్వర్ చివరిసారిగా సంజీబ్ ఘోష్‌కు చెందిన అపార్ట్‌మెంట్‌లో లోపలికి ఇద్దరు వ్యక్తులు, ఒక మహిళతో వెళ్లినట్లు సీసీటీవీలో రికార్డయింది. మే 15, 17 తేదీల్లో ఆ గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు, మహిళ ఆ అపార్ట్‌మెంట్ నుంచి బయటికొచ్చారుగానీ అన్వర్ రాలేదు. అన్వర్ మృతదేహాన్ని ముక్కలుగా చేసి ఎక్కడో పడేసి ఉంటారని సీఐడీ ఐజీ అఖిలేశ్ అనుమానం వ్యక్తం చేశారు.

ఇబ్రహీం రైసీకి ఇరాన్ వీడ్కోలు

సంతాప సభలో నివాళులర్పించిన భారత ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

టెహ్రాన్: హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీకి దేశ రాజధాని టెహ్రాన్ ప్రజలు ఘన తుది వీడ్కోలు పలికారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయాతొల్లాహ్ అలీ ఖమేనీ సైతం నివాళులర్పించారు. బుధవారం సంతాప ర్యాలీలో టెహ్రాన్ సిటీ వీధుల గుండా భారీ వాహనం మీద రైసీ పార్థివదేహాన్ని తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో ఇరానీయన్లు పాల్గొని తమ నేతకు తుది వీడ్కోలు పలికారు. భారత్ తరఫున ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ బుధవారం టెహ్రాన్ వెళ్లి రైసీకి నివాళులర్పించారు. మహిళా, మానవ హక్కుల హననానికి పాల్పడి 'టెహ్రాన్ కసాయి'గా పేరుబడినందుకే రైసీ సంతాప ర్యాలీలో తక్కువ మంది పాల్గొన్నారని అంతర్జాతీయ మీడియా వ్యాఖ్యానించింది. సంతాప ర్యాలీలో ఖమేనీ పక్కనే తాత్కాలిక దేశాధ్యక్షుడు మహమ్మద్ మొఖ్బర్ ఏడుస్తూ కనిపించారు. బుధవారం ఖమేనీ మినహా మాజీ దేశాధ్యక్షులెవరూ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనకపోవడం గమనార్హం. రైసీ మృతికి సంతాపంగా భారత్‌లోనూ ఒక రోజు సంతాపదినం పాటించారు.

విమానంలో స్టాండింగ్

ముంబై: బస్సు, రైల్లో ప్రయాణికులు నిలబడి ప్రయాణించడం చూస్తుంటాం. కానీ విచిత్రంలో విమానంలో ఓ వ్యక్తి నిలబడి వెళ్లేందుకు సిద్ధపడ్డాడు. ఈ ఘటన ముంబై నుంచి వారణాసి వెళ్లే ఫ్లైట్‌లో మంగళవారం జరిగింది. ముంబైలోని ఛత్రపతి శివాజీ ఎయిర్‌పోర్ట్‌లో ఇండిగో ఫ్లైట్ టేకాఫ్ అవ్వడానికి సిద్ధంగా ఉన్నపుడు ఓ ప్రయాణికుడు నిలబడి ఉండటం చూసిన సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే అతడిని దింపేశారు. ఆ ప్రయాణికుడు ఇండిగో ఉద్యోగి. సిబ్బంది ఎయిర్‌లైన్ టికెట్లను తగ్గించడంలో భాగంగా కలిగించే ప్రయోజనం స్టాఫ్ లీజర్ ట్రావెల్‌లో భాగంగా ప్రయాణిస్తున్నాడు. (సిబ్బందికి ఇలా ప్రయాణించే అవకాశం ఉంటుంది) టేకాఫ్‌కు ముందు తనిఖీ చేయగా.. ఇండిగో ఫ్లైట్‌లో రావాల్సిన ఓ ప్రయాణికుడు రాలేదనే సమాచారం వచ్చింది. ఆ సీటును స్టాండ్‌బైగా ఇండిగో ఉద్యోగికిచ్చారు. తీరా ఫ్లైట్‌లోకి వెళ్లాక చూస్తే ప్రయాణికుడు ఉన్నాడు. దీంతో ఉద్యోగి నిలబడ్డాడు. అది సిబ్బంది గుర్తించి, నిలిపివేయడంతో టేకాఫ్ ఆలస్యమైంది. అది బోర్డింగ్ ప్రాసెస్ తప్పిదంగా గుర్తించారు.

పాలస్తీనా స్వతంత్ర దేశం

- అధికారికంగా గుర్తిస్తున్నాం..
- నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ కీలక ప్రకటన

టెల్ అవీవ్: పాలస్తీనా విషయంలో నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాయి. స్వతంత్ర పాలస్తీనా దేశాన్ని తాము గుర్తిస్తున్నామని బుధవారం ప్రకటించాయి. ఈ నెల 28న ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించబోతున్నాయి. నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ దేశాల తాజా ప్రకటనను పాలస్తీనియన్లు స్వాగతించారు. పాలస్తీనా దేశాన్ని ఇప్పటికే భారత్ సహా దాదాపు 140 దేశాలు అధికారికంగా గుర్తించాయి. అంటే ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం కలిగిన మొత్తం దేశాల్లో మూడింట రెండొంతుల కంటే ఎక్కువ దేశాలు పాలస్తీనాను గుర్తిస్తున్నాయి. తాజాగా మరో మూడు దేశాలు ఈ జాబితాలో చేరడం విశేషం.

శాంతి, సామరస్యం కోసమే..

తూర్పు జెరూసలేం, వెస్ట్ బ్యాంక్, గాజా స్ట్రిప్‌ను కలిపి ప్రత్యేక పాలస్తీనాను దేశంగా గుర్తించాలని లక్షలాది మంది పాలస్తీనియన్లు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. 1967లో జరిగిన మిడిల్‌ఈస్ట్ యుద్ధంలో ఆ మూడు ప్రాంతాలను ఇజ్రాయెల్ ఆక్రమించుకుంది. ప్రస్తుతం తూర్పు జెరూసలేం, వెస్ట్ బ్యాంక్, గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ నియంత్రణ కొనసాగుతోంది. పాలస్తీనా దేశాన్ని గుర్తించకపోతే మధ్యప్రాచ్యంలో శాంతి, సామరస్యం నెలకొల్పడం సాధ్యం కాదని నార్వే ప్రధాని జోనస్ గహర్ పేర్కొన్నారు. ఐర్లాండ్‌కు, పాలస్తీనాకు ఇదొక చరిత్రాత్మకమైన, ముఖ్యమైన రోజు అని ఐర్లాండ్ ప్రధాని సైమన్ హ్యారిస్ వ్యాఖ్యానించారు. తమ నిర్ణయం ఇజ్రాయెల్‌సహా ఎవరికీ వ్యతిరేకం కాదని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ స్పష్టంచేశారు.

హంతకులకు, రేపిస్టులకు బంగారు పతకాలా?

పాలస్తీనాను ఒకదేశంగా గుర్తిస్తూ నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ చేసిన ప్రకటన పట్ల ఇజ్రాయెల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మూడు దేశాల నుంచి తమ రాయబారులను వెనక్కి పిలిపించింది. తమ దేశంలో ఉన్న నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ దౌత్యవేత్తలకు సమన్లు జారీ చేసింది. తద్వారా తమ నిరసనను తెలియజేసింది. హమాస్ హంతకులకు, రేపిస్టులకు నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ బంగారు పతకాలు బహూకరిస్తున్నాయని, ఈ పరిణామాన్ని చరిత్ర గుర్తుపెట్టుకుంటుందని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కట్జ్ పేర్కొన్నారు.

పక్షి ఈక 23.66 లక్షలు

ఒక పక్షి ఈక విలువెంత? సున్నా అనుకుంటున్నారా? మీరు పొరపాటు పడినట్లే. న్యూజిలాండ్‌లో నిర్వహించిన ఓ వేలంపాటలో పక్షి ఈక అక్షరాలా రూ.23,66,007(28,417డాలర్లు) పలికింది. ఇది పవిత్రమైన హుయియా పక్షి ఈక కావడమే ఇందుకు కారణం. దశాబ్దాల క్రితం నాటి అరుదైన ఈ ఈకను న్యూజిలాండ్‌లోని వెబ్స్ వేలం కేంద్రంలో తాజాగా వేలం వేశారు. ఔత్సాహికుడొకరు సొంతం చేసుకున్నారు. ఇదొక ప్రపంచ రికార్డు. పిట్ట ఈకకు ఈ స్థాయిలో ధర పలకడం చరిత్రలో ఇదే తొలిసారి. న్యూజిలాండ్‌లోని మవోరీ ప్రజలకు హుయియా పక్షిని దైవంగా భావిస్తారు. వారి తెగ పెద్దలు తలపై ఈ పక్షి ఈకలను తలపై కిరీటంగా అలంకరించుకొనేవారు. ప్రజలు బహుమతులుగా ఇచ్చిపుచ్చుకొనేవారు. ఈకల క్రయవిక్రయాలు కూడా జరిగేవి. హుయియా పక్షులు దాదాపు అంతరించిపోయాయి. చివరిసారిగా 1907లో కనిపించినట్లు నిర్ధారణ అయ్యింది.



ఎలక్షన్ బీట్

కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు పాకిస్తాన్ సానుభూతిపరులు

- అక్కడ అణుబాంబులు ఉంటే, ఇక్కడ 56 అంగుళాల ఛాతీ ఉంది
- ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ స్పష్టీకరణ



బస్తీ/శ్రావస్తి: కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు పాకిస్తాన్ సానుభూతిపరులు అని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. పాకిస్తాన్ వద్ద అణుబాంబులు ఉన్నాయంటూ ఆ రెండు పార్టీలు మన దేశాన్ని బెదిరింపులకు గురి చేస్తున్నాయని మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ నాయకుడు అఖిలేష్ యాదవ్ కలిసి ప్రచారం చేసి బొక్కబోర్లా పడ్డారని ఎద్దేవా చేశారు. ఆ ఇద్దరు యువరాజుల ఫ్లాప్ సినిమా రీరిలీజ్ అవుతుండడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ, శ్రావస్తిలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలపై విరుచుకుపడ్డారు. ఒకప్పుడు ఉగ్రవాదంతో మనల్ని భయపెట్టాలని చూసిన పాకిస్తాన్ ఇప్పుడు తిండి లేక అల్లాడుతోందని చెప్పారు. పాకిస్తాన్ పని అయిపోయిందని తేల్చిచెప్పారు. అయినప్పటికీ పాకిస్తాన్ సానుభూతిపరులైన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు మనల్ని బెదిరించడంలో బిజీగా ఉన్నాయని ధ్వజమెత్తారు. పాకిస్తాన్ వద్ద అణుబాంబులు ఉంటే, ఇండియాలో 56 అంగుళాల ఛాతీ ఉందని వ్యాఖ్యానించారు. పొరుగు దేశాలను చూసి బెదిరిపోవడానికి ఇక్కడున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, బలమైన మోదీ ప్రభుత్వమని స్పష్టంచేశారు.

ఆర్మీకి అగ్నివీర్ అక్కర్లేదు: రాహుల్ గాంధీ



మహేంద్రగఢ్(హరియాణా): దేశ జవాన్లను ప్రధాని మోదీ కార్మికుల స్థాయికి దిగజారుస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం హరియాణాలోని మహేంద్రగఢ్–భివానీ లోక్‌సభ నియోజకవర్గంలో రాహుల్ ఎన్నికల ప్రచారసభలో ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన రాహుల్ హరియాణాలో ప్రచారం చేయడం ఇదే తొలిసారి. '' అగ్నివీర్ పథకం మోదీ పథకం. ఇది ఆర్మీ తెచ్చింది కాదు. అసలు ఇలాంటి పథకాన్ని ఆర్మీ అస్సలు కోరుకోలేదు. విపక్షాల 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని బుట్టదాఖలుచేస్తుంది. యువ జవాన్ల చేతుల్లో దేశ సరిహద్దులు భద్రంగా ఉన్నాయి. ఈ దేశభక్తి యువత డీఎన్ఏలోనే ఉంది. అలాంటి యువ జవాన్లను మోదీ కార్మికుల స్థాయికి దిగజార్చుతున్నారు. బీజేపీ ప్రభుత్వం వేస్తున్న లెక్కలను చూస్తే ఆర్మీలో రెండు రకాల అమరవీరులు ఉంటారు. ఒకరు సాధారణ జవానుకాగా మరొకరు అధికారి. ఒకరికి పెన్షన్, అమరువీరుడనే హోదా, ప్రభుత్వ ప్రయోజనాలు దక్కుతాయి. మరోవైపు పేద కుటుంబం నుంచి వచ్చి అగ్నివీర్‌గా ఆర్మీలో పనిచేసి వైదొలగిన వ్యక్తికి ఎలాంటి పెన్షన్ రాదు, అమరవీరుడనే గౌరవం దక్కదు, క్యాంటీన్ సదుపాయాలు ఉండవు'' అని ఆగ్రహంగా మాట్లాడారు.

రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారు

బీజేపీపై ప్రియాంకా గాంధీ ధ్వజం

గోడ్డా (జార్ఖండ్): బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చివేయాలని కంకణం కట్టుకుందని, గడిచిన పదేళ్లలో పార్లమెంటు, న్యాయవ్యవస్థలను బలహీనపరిచిందని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ అన్నారు. గోడ్డాలో బుధవారం ఒక ఎన్నికల సభలో మాట్లాడుతూ కేంద్ర విధానాలను వ్యతిరేకించే వారందరినీ బాధితులను చేశారని ఆరోపించారు. ఒకవేళ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే వారు రాజ్యాంగాన్ని మార్చివేసి రిజర్వేషన్లకు కోత పెడతారన్నారు. 'ప్రధాని నరేంద్ర మోదీ జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ను తప్పుడు కేసుల్లో జైలుకు పంపారు. ఆయన భార్య కల్పన సివంగిలా పోరాడుతున్నారు. హేమంత్ సోరెన్‌ను జైల్లో పెడితే తమకు అడ్డు లేకుండా ఉంటుందని బీజేపీ భావించింది. కానీ గిరిజనలు ఆ పార్టీ గిరిజన వ్యతిరేక విధానాలపై గట్టి పోరాడుతున్నారు. గతంలో పార్లమెంటులో చట్టాలు చేయడానికి చర్చలు జరిగేవి.. కానీ ఇప్పుడు బీజేపీ నాయకులు ప్రతిపక్షంపై దాడి చేయడానికే పార్లమెంటు ఉపయోగపడుతోంది' అని ప్రియాంక అన్నారు.


సభలో కల్పనతో ప్రియాంకా గాంధీ

ప్రసంగాలు శృతిమించుతున్నాయి: ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచారారంలో ప్రసంగాలూ శృతిమించుతున్నాయని కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. నేతలు, స్టార్ క్యాంపెయినర్లు కులం, మతం ప్రస్తావనలు తేవడాన్ని ఆక్షేపించింది. భద్రతా బలగాలు, రాజ్యాంగంపై వ్యాఖ్యలు గాడి తప్పుతున్నాయని మండిపడింది. ఈ విషయంలో నేతలు తమ తీరును మార్చుకునేలా, నియంత్రణ పాటించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులు నడ్డా, ఖర్గేలకు బుధవారం ఈసీ నోటీసులు జారీ చేసింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించింది. బీజేపీ స్టార్ క్యాంపెయినర్లు సమాజంలో విభజనకు దారితీసే మతపరమైన ప్రసంగాలకు దూరంగా ఉండాలని ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఈసీ సూచించింది. లేదంటే ప్రచారంపై నిషేధం విధిస్తామని సూటిగా చెప్పింది. ఎన్నికల ప్రచారంలో స్టార్ క్యాంపెయినర్లు అసంబద్ధ ప్రకటనలు చేస్తూ.. రక్షణ దళాలను ప్రతిష్టను దెబ్బతీయవద్దని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు సూచించింది.

భారత సంతతి శాస్త్రవేత్తకు 'షా' అవార్డ్



హాంకాంగ్: విద్యుదయస్కాంత కిరణాలను వెదజల్లే న్యూట్రాన్ నక్షత్రాలు, నక్షత్రాల పేలుడు, గామాకిరణాల వెల్లువ వంటి ఖగోళ అంశాలపై విశేష పరిశోధనలకు గుర్తింపుగా భారతీయ అమెరికన్ శాస్త్రవేత్త శ్రీనివాస్ రామచంద్ర కులకర్ణి.. ప్రఖ్యాత 'షా' అవార్డ్‌కు ఎంపికయ్యారు. శ్రీనివాస్ ప్రస్తుతం అమెరికాలోని కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆస్ట్రానమీ, ప్లానెటరీ సైన్స్, డివిజన్ ఆఫ్ ఫిజిక్స్, మేథమేటిక్స్, ఆస్ట్రానమీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అమెరికాలోని పలోమర్ ట్రాన్సియెంట్ ఫ్యాక్టరీలో ఆ తర్వాత జ్విక్కీ ట్రాన్సియెంట్ ఫ్యాక్టరీల్లో టెలిస్కోప్‌ల సాయంతో రోదసీలో నిర్దిష్ట ప్రాంతంలోని ఖగోళ అంశాలను పరిశీలించి వాటిపై విశేష పరిశోధనలు చేసినందుకుగాను ఈ అవార్డ్‌ను శ్రీనివాస్‌కు ప్రదానం చేయనున్నారు. 2024 సంవత్సరానికి ఆస్ట్రానమీ విభాగంలో శ్రీనివాస్‌కు అవార్డ్ ఇస్తున్నట్లు షా ప్రైజ్ ఫౌండేషన్ మంగళవారం ప్రకటించింది.

అమెరికాలో రోడ్డు ప్రమాదం
ముగ్గురు భారత విద్యార్థుల మృతి

వాషింగ్టన్: అమెరికాలోని జార్జియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భారతీయ అమెరికన్ విద్యార్థులు దుర్మరణం చెందారు. వీరు ప్రయాణిస్తున్న కారు వేగంగా వెళుతున్నపుడు డ్రైవర్ వాహనంపై అదుపు కోల్పోవడంతో పల్టీలు కొట్టి రోడ్డు పక్కనున్న చెట్లను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రియా అవసరాల, అన్వి శర్మ, ఆర్యన్ జోషి మృతి చెందారు. రిత్విక్ సోమేపల్లి, కారు డ్రైవర్ మొహమ్మద్ గాయపడ్డారు. వీరందరి వయసు 18 ఏళ్లే. శ్రియా, అన్వి జార్జియా యూనివర్శిటీ విద్యార్థులు. ఆర్యన్ జోషి అల్ఫరెటా హైస్కూల్‌లో చదువుతున్నాడు.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 23 । మే । 2024



ప్రకృతిపై అవగాహన అవసరం

బాల్యదశ నుంచే ప్రకృతి, అడవులపై అవగాహన ఎంతో అవసరమని ఫారెస్ట్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్ అన్నారు. -8లో



అమ్మకానికి ఆడబిడ్డ

ముక్కు పచ్చలారని మూడు నెలల పసికందును అమ్మకానికి పెట్టి సొమ్ము చేసుకునేందుకు యత్నించిన అమానవీయ ఘటన పీర్జాది గూడలో బుధవారం కలకలం రేపింది. -8లో

25న 'నేచర్ క్యాంప్'

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న నేచర్‌క్యాంప్-ఫారెస్ట్రెక్‌పార్క్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్యాంప్‌లో టీమ్ బిల్డింగ్ యాక్టివిటీస్, టెంట్లలో క్యాంపు నిర్వహణ, ఫైర్‌క్యాంప్, నేచర్‌వాక్, ట్రెక్కింగ్, బర్డ్‌వాక్ వంటివి ఏర్పాటు చేస్తారు. ఆసక్తి ఉన్న వారు 25న సాయంత్రం 4 గంటలకు ఈ క్యాంప్‌లో చేరవచ్చు. ఇందులో పాల్గొనేందుకు రూ.1200 నుంచి రూ.1800 రుసుము చెల్లించాలి.

బోర్డుదే బాధ్యత

నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణం బలి

- చెట్టుకూలిన ఘటనపై రవీందర్ బంధువులు, స్థానికుల ఆగ్రహం
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన



ఆసుపత్రి ఆవరణలో అంబులెన్స్‌లో ఉన్న సరళాదేవి



రసూల్‌పురా: బొల్లారం కంటోన్మెంట్ జనరల్ ఆసుపత్రిలో ఆవరణలో చెట్టు కూలి మృతి చెందిన తూంకుంట నివాసి రవీందర్ కుటుంబానికి కంటోన్మెంట్ బోర్డు అధికారులు న్యాయం చేయాలని కోరుతూ బంధువులు, కుటుంబ సభ్యులు బుధవారం ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. ఎండిన చెట్టు తొలగించడంలో బోర్డు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నిండు ప్రాణం బలైందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయ పడిన రవీందర్ సతీమణి సరళాదేవి ఆస్పత్రి ఆవరణలో అంబులెన్స్‌లోనే ఉండి ఈ ఆందోళనలో పాల్గొన్నారు. వీరికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తిరుమలగిరి మండల పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మద్దతు పలికి ఆందోళనలో పాల్గొన్నారు. దీనిపై సమాచారం అందుకున్న బోర్డు సీఈవో మధుకర్ నాయక్ తమ తరపున ప్రతినిధులుగా వాటర్‌వర్క్స్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, నర్సింగ్ రావు, యాని, రమణ, రాములును ఆస్పత్రికి పంపించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ బోర్డు అధికారులు ఘటనకు బాధ్యత వహించి రవీందర్ ఇద్దరు కుమార్తెలకు న్యాయం చేయాలని కోరారు. అధికారుల నిర్లక్ష్యంవల్లే రవీందర్ మృతి చెందాడని ఆరోపించారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని ఆస్పత్రి ముందు, మీటింగ్ హాల్లో, సూపరింటెండెంట్ రామకృష్ణ వద్ద నాలుగు గంటల పాటు నిరసనకు దిగారు. ఒక దశలో ఉపాధ్యాయులు అధికారి రాజ్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగారు.

అధికారుల హామీతో ఆందోళన విరమణ

ఈ విషయంలో నిర్ణయం తీసుకునే వీలు తమకు లేదని, బోర్డు పాలకమండలి సమావేశంలో చర్చించి రవీందర్ కుటుంబానికి, వారి ఇద్దరు కుమార్తెలకు న్యాయం చేసేందుకు తగిన నిర్ణయం తీసుకుంటామని వాటర్‌వర్క్స్ అధికారి రాజ్‌కుమార్ హామీ ఇచ్చారు. అదే విధంగా తీవ్రంగా గాయపడిన సరళాదేవికి కిమ్స్ హాస్పిటల్‌లో మెరుగైన చికిత్స అందజేస్తామని, ఆ ఖర్చు మొత్తం బోర్డు భరిస్తుందని, బొల్లారం హాస్పిటల్ నుంచి ఓ డాక్టర్‌ను కిమ్స్ ఆసుపత్రికి సరళాదేవితో పంపిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.



ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న రవీందర్ కుమార్తెలు, బంధువులు

పకడ్బందీగా కౌంటింగ్ ఏర్పాట్లు



ఓట్ల లెక్కింపు రిహార్సల్స్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు తెలిపారు. బుధవారం హైదరాబాద్ ఆబిడ్స్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఆఫీసులో నిర్వహించిన గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్ ఏంకోర్ డాటా ఎంట్రీ(డమ్మీ) రిహార్సల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేసి కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టవంతంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలని తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ ఏఆర్‌ఓ విక్టర్, డిప్యూటీ కలెక్టర్ అండ్ ఏఆర్‌ఓ ఎస్. విద్యాధర్, తహసీల్దార్, ప్రేమ్ కుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

నిఖత్ జరీన్‌కు సన్మానం



సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల కజకిస్తాన్‌లో జరిగిన ఎలోర్డా కప్ పోటీల్లో 52 కేజీల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించిన బాక్సర్ నిఖత్‌జరీన్ బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఆమెను సత్కరించిన కమిషనర్, హైదరాబాద్ పేరు ప్రతిష్టలు దశ దిశలా వ్యాపించేలా, దేశ గౌరవం ఇనుమడించేలా ముమ్ముందు మరింతగా రాణించాలని అభిలషించారు. బాలబాలికల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు జీహెచ్‌ఎంసీ కూడా కృషి చేస్తుండటాన్ని, సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తుండటాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ విభాగం మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్సార్ ప్రేమ్ రాజ్, తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాబురావు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్లీ 'డిమాండ్'!

- ఆస్తిపన్ను వసూళ్ల కోసం 'నోటీసులు'
- ముందస్తుగానే జారీ చేస్తోన్న జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: 'ఎర్లీబర్డ్' గురించి తెలుసు కానీ.. ఎర్లీ డిమాండ్ ఏమిటనుకుంటున్నారా ? ఇదీ ఆస్తిపన్ను వసూళ్లకు సంబంధించిందే. ఆర్థిక సంవత్సరం ఆరంభమయ్యే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నెలాఖరు వరకు ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఉండటమే ఎర్లీబర్డ్ ఉద్దేశమని తెలిసిందే. ప్రతియేటా ఎర్లీబర్డ్ ముగిశాక.. ఆ స్కీమ్‌ను వినియోగించుకోని మిగతా వారికి జూలై లోనో ఆగస్టు లోనో ఆస్తిపన్ను చెల్లించాల్సిందిగా జీహెచ్‌ఎంసీ డిమాండ్ నోటీసులు జారీ చేసేది. ఆ తర్వాత రెడ్ నోటీసులు జారీ చేసేది. ఈసారి అందుకు భిన్నంగా ఏప్రిల్ నెలాఖరుతో ఎర్లీబర్డ్ ముగియగానే, డిమాండ్ నోటీసుల జారీ చర్యలకు శ్రీకారం చుట్టి ప్రస్తుతం వాటిని జారీ చేస్తోంది. గతంలో లేని విధంగా ఎర్లీగా డిమాండ్ నోటీసులు జారీ చేస్తోంది. తద్వారా ఇళ్ల యజమానులకు నెలకు 2 శాతం వడ్డీ భారం తగ్గుతుందని పేర్కొంటున్నారు. జీహెచ్‌ఎంసీ ఖజానాకు సైతం తగిన మొత్తంలో నిధులు జమ కాగలవని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

ఆదాయం పెరుగుతున్నా..

ఏటికేడు జీహెచ్‌ఎంసీకి ఆస్తిపన్ను ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతున్నా..ఖర్చులు అంతకుమించి భారంగా మారడంతో సిబ్బంది జీతాల నుంచి కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల వరకు జాప్యం జరుగుతోంది. జీతాల చెల్లింపుల్లో జాప్యం ఉండరాదని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలుండటంతో చెల్లించక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆస్తిపన్ను చెల్లించాల్సిన అందరి నుంచీ పన్ను వసూలు చేసేందుకు జీహెచ్‌ఎంసీ ఈ సంవత్సరం ఎర్లీగానే డిమాండ్ నోటీసులు జారీ చేస్తోంది. ఈ సంవత్సరం రూ.2200 కోట్ల ఆస్తిపన్ను వసూలు లక్ష్యంగా ఉంది. ఎర్లీ బర్డ్‌ను వినియోగించుకోవడం ద్వారా 7.34 లక్షల మంది ఇళ్ల యజమానులు రూ.827 కోట్ల ఆస్తిపన్ను చెల్లించారు. ఆ తర్వాత కూడా చెల్లిస్తున్నవారున్నప్పటికీ పరిస్థితి మందకొడిగా ఉంది.

ఎర్లీబర్డ్ స్కీమ్ ద్వారా రూ.20 కోట్ల కంటే తక్కువ ఆస్తిపన్ను వసూలైన సర్కిళ్లు

సర్కిల్	వసూలు (రూ.కోట్లు)
ఉప్పల్	16.10
మలక్‌పేట	14.62
సంతోష్‌నగర్	6.06
చాంద్రాయణగుట్ట	2.78
చార్మినార్	5. 35
ఫలక్‌నుమా	3.11
రాజేంద్రనగర్	19.72
మెహిదీపట్నం	17.38
కార్వాన్	8.39
ముషీరాబాద్	17.54
యూసుఫ్‌గూడ	12.50
గాజుల రామారం	13.39
అల్వాల్	15.35
సికింద్రాబాద్	11.04

- ఈ సర్కిళ్ల నుంచి ఎర్లీబర్డ్ ద్వారా తక్కువ ఆస్తిపన్ను మాత్రమే వసూలైంది. డిమాండ్ నోటీసులు, ఎస్ఎంఎస్‌లతో అలర్ట్ చేయడం వల్ల ఈ సర్కిళ్లే కాక మిగతా సర్కిళ్ల నుంచి కూడా ఆస్తిపన్ను చెల్లించే వారు చెల్లిస్తారని, తద్వారా కొన్ని పనులకైనా ఈ నిధులు వినియోగించుకో వచ్చునని అధికారులు భావిస్తున్నారు.



మిడిల్.. జిగేల్

మధ్యతరగతికి 2వ అనుకూల నగరంగా హైదరాబాద్

సగటు నెలవారీ ఆదాయంలో టాప్

ఆన్‌లైన్ ఆర్థిక మోసాల బాధితులూ ఎక్కువే..

ఆదాయం మరింత పెరుగుతుందని మధ్యతరగతి ఆశాభావం

వెల్లడించిన గ్రేట్ ఇండియన్ వాలెట్ అధ్యయనం





సాక్షి, సిటీబ్యూరో:

మధ్యతరగతి వర్గాలు సౌకర్యవంతంగా జీవించడానికి, తగినంత ఆదాయం పొందడానికి దేశంలోనే ఉత్తమ నగరంగా హైదరాబాద్ నిలిచింది. ఇక్కడ మిడిల్ క్లాస్..అటు వ్యయంలోనూ ఇటు పొదుపులోనూ తగినన్ని జాగ్రత్తలు పాటిస్తున్నారని హోమ్ క్రెడిట్ ఇండియా 'ది గ్రేట్ ఇండియన్ వాలెట్' జాతీయస్థాయి అధ్యయనం స్పష్టం చేసింది. జాతీయ స్థాయిలో పలు నగరాల్లో మధ్యతరగతి జీవనం గురించి జరిపిన ఈ అధ్యయనం మన నగరం గురించి వెల్లడించిన ఆసక్తికర అంశాల్లో కొన్ని...

- దేశంలోని దిగువన ఉండే మధ్య తరగతి ప్రజల కోసం అనుకూల నగరంగా హైదరాబాద్ వరుసగా రెండవ సంవత్సరం తన హోదాను నిలబెట్టుకుని రెండో స్థానంలో నిలిచింది. బెంగళూరు మొదటి స్థానంలో ఉంది.
- అత్యధిక వ్యక్తిగత నెలవారీ ఆదాయంతో (రూ.44 వేలు) దిగువ-మధ్యతరగతి జీవనంలో మన నగరం అగ్రస్థానంలో ఉంది, నగరంలో 69 శాతం మంది 2024లో ఎక్కువ ఆదా చేయగలిగారని అధ్యయనం తేల్చింది.
- నెలవారీ ఖర్చుల విషయానికి వస్తే, పర్యటనలు/సైట్ సీయింగ్‌ల కోసం ఆదాయంలో 35శాతం, బయటి ఆహారం కోసం 28 శాతం, సినిమాల కోసం 19 శాతం, ఫిట్‌నెస్ కోసం 6 శాతం, ఓటీటీ యాప్‌ల కోసం 10 శాతం ఖర్చు చేయడానికి ఇష్టపడుతున్నారు.
- ఆన్‌లైన్ ఆర్థిక మోసాలను తాము విన్నామని/చూస్తున్నామని నగరంలో 41 శాతం మంది ధృవీకరించారు. తామే స్వయంగా ఆన్‌లైన్ మోసానికి గురయ్యామని 27 శాతం మంది చెప్పారు. ఆర్థిక మోసం చేయాలనే ఉద్దేశ్యంతో వచ్చే బూటకపు ఫోన్ కాల్స్‌ను/మెసేజ్‌లను అందుకుంటున్నామని 37 శాతం మంది నగరవాసులు తెలిపారు.



- సులభంగా రుణ ఊబిలో ఇరుక్కునే అవకాశాలు ఉన్నాయని 31 శాతం మంది, అధిక వ్యయం గురించి భయపడి 28 శాతం మంది, అధిక వడ్డీ రేట్ల కారణంగా 24 శాతం మంది, అధిక ప్రాసెసింగ్ ఇతర అధిక ఛార్జీలు గురించి 7 శాతం మంది యూపీఐపై రుణ సౌకర్యాన్ని వినియోగించుకోవడానికి ఇష్టపడడం లేదు.
- యూపీఐ సేవలకు రుసుములు గానీ వసూలు చేస్తే 64 శాతం మంది తాము దానిని ఉపయోగించడం ఆపివేస్తామని అంటున్నారు.
- తమ ఆదాయం గత సంవత్సరం కంటే ప్రస్తుత సంవత్సరంలో పెరిగిందని 52 శాతం మంది చెప్పారు, అలాగే రాబోయే సంవత్సరం నాటికి తమ ఆదాయం ఇంకా పెరుగుతుందని 74 శాతం మంది భావిస్తున్నారు. రాబోయే సంవత్సరంలో తాము మరింత పొదుపు చేయగలమని 66 శాతం మంది మరింత పెట్టుబడి పెట్టగలమని 66 శాతం మంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
- నగరంలో సగటు వ్యక్తిగత నెలవారీ ఆదాయం 2023లో రూ.42 వేల నుంచి 44 వేలకు పెరిగింది. అలాగే స్థిర నెలవారీ ఖర్చులు కూడా రూ.19 వేల నుంచి 24 వేలకు పెరిగాయి.
- గత ఆరు నెలల్లో 57 శాతం మంది దుస్తులు, ఇతర అవసరార్థ వస్తువుల కొనుగోలులో మునిగిపోయారని గణాంకాలు చెబుతున్నాయి. ఇంటి ఖర్చుల కోసం 79 శాతం వెచ్చిస్తూ, నగరం ఈ విషయంలో ముంబై (75శాతం)ని అధిగమించింది.
- వ్యక్తిగత నెలవారీ ఆదాయం విషయంలో బెంగుళూరు హైదరాబాద్ నగరాలు జాతీయ సగటు కంటే వరుసగా 15 శాతం, 33 శాతం అధిక ఆదాయాలతో ముందున్నాయని గణాంకాలు తెలియజేస్తున్నాయి.
- ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్ పూణే వంటి నగరాలలో ఆర్థిక మోసాల బారిన పడిన సంఘటనలు ఎక్కువగా ఉన్నాయని నివేదికలు తెలుపుతున్నాయి.
- నగరంతో సహా ఢిల్లీ-ఎన్.సి.ఆర్, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, పుణే, లక్నో, జైపూర్, భోపాల్, పాట్నా, రాంచీ, చండీగఢ్, డెహ్రాడూన్, లుథియానా, కొచ్చితో సహా 17 నగరాల్లో గ్రేట్ ఇండియన్ వాలెట్ ఈ అధ్యయనం నిర్వహించింది. దీని కోసం 18-55 సంవత్సరాల మధ్య వయస్కులు, వార్షిక ఆదాయం రూ.2 లక్షల నుండి రూ.5 లక్షల మధ్య ఉన్నవారిని ఎంచుకున్నారు.

ఏఎంసీలో ఏమైంది?

- నిమ్స్ యాజమాన్యాన్ని వివరణ కోరిన ప్రభుత్వం
- సంజాయిషీ ఇవ్వాలని వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలు


సాక్షి ఎఫెక్ట్..


లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలోని పాత అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ)లో ఏసీలు పని చేయకపోవడంపై బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పందించింది. దీనిపై వివరణ ఇవ్వాలని నిమ్స్ మెడికల్ సూరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణను ఆదేశించింది. దీంతో నిమ్స్ యాజమాన్యం ఏఎంసీలోని పరిస్థితులపై సంజాయిషీ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శికి రాసిన లేఖ ప్రతులను మీడియాకు విడుదల చేశారు. నిమ్స్‌లోని అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ)లో ప్రస్తుతం ఉన్న ప్యాకేజీ యూనిట్లు(ఏసీ) పురాతనమైనవి కారణంగా పనిచేయడం లేదని, మరమ్మతులు చేసినా ఫలితం కన్పించడం లేదని లేఖలో అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుత ప్యాకేజీ యూనిట్లను మరింత సమర్థవంతమైన డక్టబుల్ యూనిట్‌లతో భర్తీ చేయడానికి రూ.12.50 లక్షల వ్యయంతో అంచనా వేశామని తెలిపారు. ఈ మేరకు నిపుణుల అభిప్రాయం కోసం అంతర్గత కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా టెండర్లు వేయడం కుదరదని అడ్మినిస్ట్రేషన్ సూచించిందని, ఈ కారణంగా తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారిని తాత్కాలికంగా అదే బ్లాక్‌లోని పాత ఐసీయూకి మార్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా..బుధవారం సాయంత్రానికల్లా ఏసీలను తాత్కాలికంగా మరమ్మతు చేయించారు. దీంతో పనిచేయడం మొదలు పెట్టాయని రోగుల బంధువులు పేర్కొన్నారు. 'సాక్షి' పుణ్యమా అని తమకు ఉపశమనం లభించిందని ఓ రోగి సహాయకుడు డానియేల్ సంతృప్తి వ్యక్తం చేశారు.

భూమి ఇక పిరమే!

కొత్త ప్రభుత్వ ప్రతిపాదనలపై భిన్నాభిప్రాయాలు

- 'విలువ' పెంచితే సామాన్యులపై పెనుభారం
- ఎల్‌ఆర్‌ఎస్, రిజిస్ట్రేషన్ చార్జీలూ పెరుగుతయ్
- క్రయ విక్రయాలపైనా ప్రభావం
- ఇప్పటికే ఏడాది కాలంగా ఒడిదుడుకుల్లో స్థిరాస్తి మార్కెట్
- సొంతింటి కల కష్ట సాధ్యమే...





సాక్షి స్పెషల్ స్టోరీ

సాక్షి, సిటీబ్యూరో: సామాన్యులకు సొంతింటి కల అందనంత దూరంలో ఉంది. ఇప్పటికే పెరిగిన ధరల కారణంగా మధ్యతరగతి ప్రజలు గూడు కోసం జాగా కొనుక్కోవడం కష్టంగా మారింది. ఈ తరుణంలో తెలంగాణలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం భూముల విలువ పెంచాలని నిర్ణయించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భూముల విలువ పెంచితే ఎల్‌ఆర్‌ఎస్, రిజిస్ట్రేషన్ చార్జీలు సైతం భారీగా పెరుగుతాయి. ఇది క్రయవిక్రయాలపై ప్రభావం చూపుతుందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అంటున్నారు. ఏడాది కాలంగా స్తబ్దుగా ఉన్న స్థిరాస్తి మార్కెట్ మరింత కుదేలయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. ప్రభుత్వం మాత్రం తెలంగాణలో భూముల విలువ..వాస్తవ విలువకు చాలా తేడా ఉందని..పెంచితేనే రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం పెరుగుతుందని అంటోంది.

ఇది తరుణం కాదు...

భూమి రేట్లు పెరిగితే ఆ మేరకు 14 శాతం ఎల్‌ఆర్‌ఎస్ ఛార్జీలు, 7.5 శాతం రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా చెల్లించాల్సిందే. ఇది సామాన్య, మధ్యతరగతికి అదనపు భారం పడుతుంది. ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం భావించడం సమంజసమే అయినా ప్రస్తుతం రాష్ట్రంలో స్థిరాస్తి రంగం స్తబ్దుగా ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో పెంపు సరికాదని స్థిరాస్తి వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

గత పరిస్థితులు వేరే..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత 2014 నుంచి 2021 వరకు అప్పటి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచలేదు. 2021జూలైలో తొలిసారిగా భూముల విలువలను, రిజిస్ట్రేషన్ ఫీజును సవరించింది. అప్పటి వరకు మార్కెట్ విలువపై 6 శాతంగా ఉన్న రిజిస్ట్రేషన్ ఫీజును 7.5 శాతానికి పెంచింది. భూముల విలువలను సైతం వ్యవసాయ భూమికి ఎకరాకు చొప్పున, ఖాళీ ప్లాట్లకు చదరపు గజాల చొప్పున, ఇళ్లు, అపార్ట్‌మెంట్లకు చదరపు అడుగుల చొప్పున కనీస ధర నిర్ణయించడంతో పాటు మార్కెట్ విలువను సవరించింది. అయితే అప్పటివరకు మార్కెట్‌లో పెరిగిన ధరలతో పోలిస్తే ప్రభుత్వ ధరల పెంపు ప్రభావం పెద్దగా కనిపించలేదు. ఆ తర్వాత 2022 ఫిబ్రవరిలోనూ మరోసారి భూముల విలువను సవరించింది. కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితులు వేరు. గతేడాది సెప్టెంబర్ నుంచి వరుస ఎన్నికల నేపథ్యంలో మార్కెట్ స్తబ్దుగా ఉంది. కొత్త ప్రభుత్వం వచ్చి రాగానే ఫార్మాసిటీ రద్దు, జిల్లాల కుదింపు వంటి నిర్ణయాలతో స్థిరాస్తి మార్కెట్ దెబ్బతింది. పైగా కరువు పరిస్థితుల నేపథ్యంలో క్రయవిక్రయాలపై ప్రభావం చూపిస్తుంది. గత ఏడాది కాలంగా స్థిరాస్తి మార్కెట్ తిరోగమనంలో సాగుతుంది. ఇలాంటి సమయంలో భూముల విలువను పెంపు నిర్ణయం సరికాదని రియల్ ఎస్టేట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

తేడా ఎంతంటే..

- కీసరలో ప్రభుత్వ విలువ గజానికి రూ.3 వేలుగా ఉంది. ఇక్కడ వంద గజాల స్థలానికి రూ.3 లక్షల వైట్ మనీతో పాటు స్టాంప్ డ్యూటీ రూపంలో రూ.22,500 చెల్లించాలి. భూముల విలువను ఈ ప్రాంతంలో 50 శాతం పెంచిందనుకుంటే.. వందగజాల ప్లాట్‌కు రూ.4.50 లక్ష ల వైట్‌మనీతో పాటు స్టాంప్ డ్యూటీ రూపంలో 33,700 చెల్లించాలి. అంటే భూమి విలువ రూ.1.50 లక్షలు, స్టాంప్ డ్యూటీ రూపంలో రూ.11,200 అదనపు భారం పడుతుందన్నమాట.
- జూబ్లీహిల్స్‌లో ప్రభుత్వ విలువ గజానికి రూ.66 వేలుగా ఉంది. ఇక్కడ వంద గజాలు కొనాలంటే రూ.66 లక్షల వైట్‌మనీతో రూ.4.95 లక్షలు స్టాంప్‌డ్యూటీ చెల్లిస్తే సరిపోతుంది. ఇక్కడ ప్రభుత్వ విలువ 50 శాతం మేర పెంచితే..అప్పుడు వంద గజాల స్థలానికి రూ.కోటి అవుతుంది. అప్పుడు రూ.కోటి వైట్‌మనీ మీద స్టాంప్ డ్యూటీ రూ.7.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే రూ.36.55 లక్షలు అదనపు భారం పడుతుంది.

సమాంతర రేటు సరికాదు..

నగరంలోని కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు ప్రభుత్వ విలువ, మార్కెట్ రేటుకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. మాదాపూర్, కొండాపూర్, కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, తెల్లాపూర్, పుప్పాలగూడ వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాల్లో ఈ వ్యత్యాసం మరింత ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా పెంచాలి. దీంతో సామాన్యునిపై భారం పడకుండా ఉండటంతో పాటు ప్రభుత్వానికి అనుకున్న ఆదాయం వస్తుంది. అలా కాకుండా అన్ని ప్రాంతాల్లో సమాంతర స్థాయిలో విలువలను పెంచితే సామాన్యుడిపై అధిక భారం పడుతుంది. శామీర్‌పేట, ఆదిభట్ల, ఉప్పల్, ఘట్‌కేసర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల్లో భూముల విలువలు పెంచితే లాభం ఉండదు.

పైన పటారం.. లోన లొటారం

- హోటళ్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు
- లోపించిన పరిశుభ్రత
- గడువు ముగిసిన ఆహార పదార్థాలు


హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

బంజారాహిల్స్: సోమాజిగూడలోని పలు హోటళ్లలో ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీమ్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. సోమాజిగూడ కృతుంగ ది పాలేగర్స్ క్యూజిన్ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించి లైసెన్స్, లోగో లేకుండా గంగా గోల్డ్ పన్నీర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గడువు ముగిసిన మెంతి మలాయి వాడుతున్నట్లు గుర్తించారు. 156 వాటర్ బాటిళ్లను నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తుండటంతో సీజ్ చేశారు. నాన్‌వెజ్ పేస్ట్‌తో పాటు ఇతర ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పరిశుభ్రతను బేఖాతర్ చేస్తూ ఇష్టానుసారంగా హోటల్ కొనసాగుతున్నట్లుగా గుర్తించారు. అలాగే.. సోమాజిగూడలోని రెస్ట్ ఓ బార్‌లో కూడా తనిఖీలు చేసిన అధికారులు నిబంధనలు పాటించకుండా వాడుతున్న పలు ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. కిచెన్‌లో పరిశుభ్రత పూర్తిగా లోపించినట్లుగా గుర్తించారు. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదని కూడా తేలింది. వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ పదార్థాలు ఫ్రిజ్‌లో ఒకేచోట భద్రపరిచినట్లుగా తేలింది. సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నట్లు కూడా గుర్తించారు. కేఎఫ్‌సీలో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించి ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌ను గుర్తించిన చోట ప్రదర్శించకుండా నిర్లక్ష్యం వహించారని నోటీసులు ఇచ్చారు. ఈ హోటళ్లన్నీ పరిశుభ్రత లేకుండానే కిచెన్‌లో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారని, అధ్వానంగా ఉన్నట్లు కూడా అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఆయా హోటళ్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు. పలు ఆహార పదార్థాలను సీజ్ చేశారు.

అమ్మకానికి ఆడబిడ్డ

- విజయవాడ నుంచి శిశువును తెప్పించి..
- రూ.4.5 లక్షలకు బేరం పెట్టిన ఆర్‌ఎంపీ
- సహకరించిన మరో ఇద్దరు వ్యక్తులు
- గుట్టురట్టు చేసిన స్వచ్ఛంద సంస్థ మహిళలు
- పీర్జాదిగూడలో వెలుగులోకి ఘటన
- ఆర్‌ఎంపీ సహా మరో ఇద్దరి అరెస్ట్


మూడునెలల పసికందు


ఆర్‌ఎంపీ శోభారాణి

మేడిపల్లి: ముక్కు పచ్చలారని మూడు నెలల పసికందును అమ్మకానికి పెట్టి సొమ్ము చేసుకునేందుకు యత్నించిన అమానవీయ ఘటన పీర్జాదిగూడలో బుధవారం కలకలం రేపింది. మూడు నెలల ఆడ శిశువును విక్రయిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మేడిపల్లి పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం .. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామకృష్ణా నగర్ కాలనీలో ఐతె శోభారాణి ఆర్‌ఎంపీగా పని చేస్తూ ప్రథమ చికిత్స కేంద్రాన్ని నిర్వహిస్తోంది. కొంత కాలంగా ఉప్పల్ ఆదర్శనగర్ కాలనీకి చెందిన చింత స్వప్న, రామకృష్ణా నగర్ కాలనీకి చెందిన షేక్ సలీం పాషాతో కలిసి నగరంతో పాటు విజయవాడ తదితర ప్రాంతాల్లో నివసించే పేద కుటుంబాలకు చెందిన చిన్నారుల ఆచూకీ తెలుకుంటున్నారు. ఆయా కుటుంబాలకు డబ్బుల ఆశ చూపిస్తున్నారు. కొంత మొత్తం ముట్టజెప్పి వారి పిల్లలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని స్థానికంగా ఉన్న ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన కొందరు మహిళలు తెలుసుకున్నారు. తమకు పిల్లలు లేరని పెంచుకోవడానికి ఆడపిల్ల కావాలని శోభారాణిని సంప్రదించారు. మూడునెలల పసికందును రూ.4.5 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. ముందుగా రూ.10 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చి మిగతా డబ్బులు పాపను తీసుకున్న తర్వాత ఇస్తామని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం విజయవాడ నుంచి తీసుకు వచ్చిన మూడు నెలల ఆడ శిశువును శోభారాణి, స్వప్న, సలీం పాషా స్వచ్ఛంద సంస్థ మహిళలకు చూపించారు. ఈ విషయాన్ని వెంటనే వారు మేడిపల్లి పోలీసులకు చేరవేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆర్‌ఎంపీ శోభారాణి, ఆమెకు సహకరించిన స్వప్న, సలీంలను అదుపులోకి తీసుకున్నారు. చిన్నారిని శిశు విహార్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు.


చింత స్వప్నను విచారిస్తున్న పోలీసులు

25, 26వ తేదీల్లో 'సమ్మర్ డే క్యాంప్'

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఈ నెల 25, 26వ తేదీల్లో 'సమ్మర్ డే క్యాంప్' నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందులో అందరికీ అవకాశం కల్పిస్తారు. ఒక్కొక్కరు రూ.499 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ప్రకృతిలో విహరించేందుకు అవకాశం కల్పించడమే కాకుండా థీమ్ పార్కుల సందర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. గోల్ఫ్ కోర్సు ఆడేందుకు కూడా అవకాశం కల్పిస్తారు. ప్రకృతి, పర్యావరణ విద్యకు సంబంధించిన చిన్న నిడివి కలిగిన వీడియోలను తిలకించవచ్చు. ఆహ్లాదాన్ని పంచే అడ్వెంచర్ గేమ్స్‌లో పాల్గొనేందుకు కూడా అవకాశం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. వివరాలకు 94935 49399, 93463 64583లను సంప్రదించవచ్చు.

ఠాణా ఎదుట ద్విచక్ర వాహనం దగ్ధం



పంజగుట్ట: పంజగుట్ట పోలీస్ స్టేషన్ బయట పార్కింగ్‌లో స్థలంలో ద్విచక్ర వాహనం మంటల్లో కాలిపోయింది. ఈ వాహనం పక్కనే ఉన్న మరో వాహనం పాక్షికంగా ధ్వంసమైంది. పోలీసుల సమాచారం మేరకు.. అంబర్‌పేటకు చెందిన మహ్మద్ హమీద్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని పంజగుట్ట పోలీస్‌స్టేషన్ బయట పార్క్ చేసి పని నిమిత్తం బోయిన్‌పల్లికి వెళ్లాడు. మధ్యాహ్నం వాహనంలోంచి ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు రాసాగాయి. గమనించిన పోలీసులు, స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే వాహనం కాలిపోయింది. పక్కనే ఉన్న మరో వాహనం పాక్షికంగా కాలింది. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బయటకు వెళ్లే వ్యక్తి ఠాణా ఎదుట వాహనాన్ని ఎందుకు పార్క్ చేశాడు? అనే అంశాన్ని ఆరా తీస్తున్నామన్నారు.

చిత్రపురి కాలనీ ఫ్లాట్ల కేటాయింపులో అవకతవకలు

- తెలుగు సినీవర్కర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ అరెస్ట్
- మేనేజింగ్ కమిటీ సభ్యులపై కేసు నమోదు

గచ్చిబౌలి: సినీ కార్మికులకు చెందిన చిత్రపురి కాలనీలో ఫ్లాట్ల కేటాయింపులో జరిగిన అవకతవకలపై తెలుగు సినీ వర్కర్స్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్‌ను బుధవారం రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. మేనేజింగ్ కమిటీ సభ్యులపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ పరిధిలోని చిత్రపురి కాలనీలో ఫ్లాట్ల కేటాయింపులకు అయిదుగురు సభ్యుల కమిటీ అర్హులను ఎంపిక చేసింది. కాగా.. సదరు అలాట్‌మెంట్లను రద్దు చేసి ఇతరులకు ఫ్లాట్లను రిజిస్ట్రేషన్ చేసినట్లు బాధితులు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రాయదుర్గం పోలీసులు వల్లభనేని అనిల్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తెలుగు సినీ వర్కర్స్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ కమిటీలో సభ్యులైన పరుచూరి వెంకటేశ్వరరావు, వినోద్‌బాల, చంద్రమధు, కాదంబరి కిరణ్, మహనందరెడ్డిలతో పాటు సొసైటీ మాజీ అధ్యక్షుడు కొమరవెంకటేష్‌తో పాటు మరికొందరిపై 420, 120బి, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. డబ్బులు చెల్లించినప్పటికీ ఫ్లాట్ల అలాట్‌మెంట్ రద్దు చేసిన బాధితుల సంఖ్య దాదాపు 150 వరకు ఉంటుందని, ఒక్కో బాధితుడి నుంచి సుమారు రూ.4 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు స్పష్టం చేశారు. సినీ కార్మికుల కోసం నిర్మించిన చిత్రపురి కాలనీ ఫ్లాట్ల అలాట్‌మెంట్ల కుంభకోణంలో సంబంధిత అధికారుల పాత్ర, అర్హుల నుంచి వసూలు చేసిన డబ్బులు ఎటు వెళ్లాయనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ జనసభ నేతలు

కవాడిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కామారెడ్డి విజయ భేరి సభలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధిరామయ్య చేతుల మీదుగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ అన్నారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. కులగణన, సామాజిక న్యాయం పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ లబ్ధి పొందిందన్నారు. కానీ.. కులగణన చేయకుండా, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఆగమేఘాల మీద స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి బీసీలను మోసం చేసేందుకు సిద్ధమైందని విమర్శించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధపడితే జూన్ 8న ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మహాధర్నా చేపడతామన్నారు. అప్పుడు కూడా మొండిగా ముందుకు వెళ్తే జూన్ 15న సెక్రటేరియేట్‌ను దిగ్బంధం చేయనున్నట్లు రాజారాం యాదవ్ ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంకోటి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తి గౌడ్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, బీసీ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ ఎలిచాల దత్తాత్రేయ, పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ నేత, విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొంపల్లి రాజు, బీసీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కర్నాటి శ్రీనివాస్, నాయకులు రాజు ముదిరాజ్, గోవర్ధన్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రకృతిపై అవగాహన అవసరం: వాణీప్రసాద్


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వాణీ ప్రసాద్

బంజారాహిల్స్: బాల్యదశ నుంచే ప్రకృతి, అడవులపై అవగాహన ఎంతో అవసరమని ఫారెస్ట్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్ అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో ఇంటర్నేషనల్ బయోడైవర్సిటీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ఆమె ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వాణీప్రసాద్ మాట్లాడుతూ... పర్యావరణాన్ని కాపాడేందుకు తమ వంతుగా ప్రతి ఒక్కరూ బాధ్యత స్వీకరించాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. వైల్డ్‌లైఫ్ చీఫ్ కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి మోహన్ చంద్ర పర్గేన్, తెలంగాణ బయోడైవర్సిటీ సెక్రటరీ కాళీచరణ్, డీఎఫ్‌వో జోజి, రేంజ్ ఆఫీసర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

'పీఎస్‌టీయూ' ఇన్‌చార్జి వీసీగా శైలజా రామయ్యర్ బాధ్యతల స్వీకరణ



నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారిణి శైలజా రామయ్యర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 21వ తేదీతో రాష్ట్రంలోని వీసీల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను ఆయా విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి వీసీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.

ఓయూ ఇన్‌చార్జి వీసీగా దాన కిశోర్..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇన్‌చార్జి వీసీగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్‌రావు, ఎగ్జామినేషన్ కంట్రోలర్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బంగారు ఆభరణాల పట్టివేత


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలతో రైల్వే పోలీస్ అధికారులు

చిలకలగూడ: సికింద్రాబాద్ నుంచి ఏపీలోని గుంటూరుకు అక్రమంగా తరలిస్తున్న బంగారు ఆభరణాలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, ఎస్పీ షేక్ సలీమా, డీఎస్పీ ఎస్ఎన్ జావేద్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల కోడ్ కొనసాగుతున్న నేపథ్యంలో రైల్వే పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సికింద్రాబాద్ జీఆర్‌పీ సీఐ సాయిఈశ్వర్‌గౌడ్ నేతృత్వంలో బుధవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. చార్మినార్ చార్‌కమాన్ చేలాపూర్‌కు చెందిన కౌషిక్ సంత్రా వృత్తిరీత్యా స్వర్ణకారుడు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫారం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. రూ.18.20 లక్షల విలువైన 260 గ్రాముల బంగారు ఆభరణాలు అందులో కనిపించాయి. సదరు ఆభరణాలకు చెందిన ఎటువంటి రసీదులు చూపించలేదు. లింగంపల్లి నుంచి విజయవాడ వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో బంగారు ఆభరణాలను గుంటూరుకు తరలిస్తున్నట్లు నిందితుడు అంగీకరించాడు. బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని తెలంగాణ ట్యాక్స్ విభాగానికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సీఐలు సాయిఈశ్వర్ గౌడ్, సారస్వత్, సిబ్బంది మునీశ్వరరావు, చంద్రశేఖర్‌లను రైల్వే పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

గంజాయి కేసులో 9 మంది అరెస్టు

మోర్తాడ్: బంధువుల ఇంటికి శుభకార్యానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన ఆరుగురితో పాటు కమ్మర్‌పల్లికి చెందిన ఒకరు, నిర్మల్‌కు చెందిన మరో ఇద్దరు గంజాయి కేసులో అరెస్టు అయ్యారు. ఏర్గట్ల ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మర్‌పల్లికి చెందిన ఎండీ ఆరీఫ్ ఇంట్లో శుభకార్యానికి హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ రహమాన్, ఎండీ అజర్, ఎస్‌కే శంషద్, సమీర్, ప్యార్శని వంశీవర్ధన్, ఎండీ సలీం పాషా హాజరయ్యారు. వీరు ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ ఈతవనంలో మంగళవారం గంజాయి సేవనంతో హంగామా చేశారు. స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు వీరిని అరెస్టు చేశారు. వీరు నిర్మల్‌కు చెందిన షేక్ షాదుల్లా, సయ్యద్ అజారుద్దీన్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు గుర్తించి, వారిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. 268 గ్రాముల గంజాయి, ఒక స్కార్పియో వాహనం, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

మద్యం లోడ్ వాహనం బోల్తా

- రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన కాటన్ బాక్సులు
- మందు సీసాలతో ఉడాయించిన పలువురు
- 3 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం



రసూల్‌పురా: మద్యం సీసాల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వాహనం టైరు పేలి బోల్తా పడిన ఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొంపల్లి ఐఎంఎఫ్ఎల్ డిపో నుంచి రూ.32 లక్షల విలువైన మద్యం కాటన్ బాక్సులతో డీసీఎం కంటైయినర్ బంజారాహిల్స్ వైపు వెళ్తోంది. బోయిన్‌పల్లి ఎంఎంఆర్ గార్డెన్ వద్దకు చేరుకోగానే వెనక టైరు పేలి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో కంటెయినర్‌లో నుంచి మద్యం సీసాల కాటన్ బాక్సులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమీపంలో ఉన్న బస్తీవాసులు, రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు మద్యం సీసాలను తీసుకుని ఉడాయించారు. మద్యం సీసాలను తీసుకుని వెళ్తున్న కొందరిని డీసీఎం డ్రైవర్ బసవలింగప్ప, ఇద్దరు హెల్పర్లు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. డీసీఎం బోల్తా పడిన ఘటనతో జాతీయ రహదారిపై మూడు గంటల పాటు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.



గోనె సంచుల మాటున నకిలీ విత్తనాల తరలింపు

శామీర్‌పేట్: ఖాళీ గోనె సంచుల చాటున నకిలీ విత్తనాలను తరలిస్తుండగా జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేసన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున మేడ్చల్ ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ నుంచి కర్నూలు మీదుగా మంచిర్యాలకు నకిలీ విత్తనాలను బొలేరో వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారంతో మేడ్చల్ పోలీసులు మేడ్చల్ జిల్లా జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని అచ్చాయిపల్లి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా పైన ఖాళీ గోనె సంచులు, కింద నకిలీ విత్తనాలను గుర్తించారు. మొత్తం 30 బస్తాల్లో 1,200 కిలోల నకిలీ విత్తనాలతో పాటు వాహనాన్ని సీజ్ చేసి జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


పోలీసులు పట్టుకున్న నకిలీ విత్తనాలు, వాహనం

ఆర్థిక రంగ అవసరాలకు అనుగుణంగా వినూత్న కార్యక్రమాలు


సర్టిఫికెట్ల ప్రదానోత్సవంలో పాల్గొన్న అతిథులు

బంజారాహిల్స్: అభివృద్ధి చెందుతున్న ఆర్థిక రంగ అవసరాలకు అనుగుణంగా వినూత్న విద్యా కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ ప్రకటించింది. విశ్వవిద్యాలయంలో ఫిన్‌టెక్ క్యాప్‌స్టోన్ శిక్షణ, బ్లాక్ చెయిన్ సర్టిఫికేషన్ కోర్సు పూర్తి చేసిన ఎంబీఏ–ఫిన్‌టెక్ మొదటి బ్యాచ్ విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అతిథులుగా అసెండియన్‌లోని సీనియర్ బ్రాస్ సునీల్ మనోహర్, ఫిన్‌టెక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బోర్డు సభ్యుడు డాక్టర్ శ్రీనివాసన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ఎంహెచ్ఎస్ డీన్ కిషోర్‌బాబు మాట్లాడుతూ.. బ్యాంకింగ్, ఫిన్‌టెక్, బీబీఏ ఫిన్‌టెక్‌లలో ఎంబీఏ కోర్సును అందిస్తున్నట్లు తెలిపారు. ఫిన్‌టెక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మద్దతుతో బ్యాంకింగ్, ఫిన్‌టెక్‌లో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సు కూడా ప్రారంభించినట్లు వివరించారు. పాఠ్యాంశాల్లో అధునాతన ఆర్థిక సాంకేతికతలను అనుసంధానం చేయడం హర్షణీయమన్నారు. విద్యా బోధన మాత్రమే కొత్త కార్యక్రమాలను రూపొందించలేదని, ఫైనాన్స్ పరిశ్రమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆర్థిక అభివృద్ధి జరిగేలా తీర్చిదిద్దుతున్నామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

- గజం 2200/-కే విజయవాడ హైవే నార్కెట్‌పల్లి దగ్గర 4లైన్ల రోడ్డు ప్రక్కన ఫామ్‌ల్యాండ్ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, ఫామ్ హౌస్, ఎర్రచందనం పండ్ల మొక్కలతో 1210గజాలు(10గుంటలు) ప్లాట్స్ కలవు. సంప్ర॥ 9666695886 [G-3151]
- గజం 2750/- కే బెంగుళూరు హైవేకి బాలానగర్ దగ్గర పండ్ల మొక్కలు, గెస్ట్ హౌస్ స్విమ్మింగ్ పూల్ గేటెడ్ కమ్యూనిటీ కాంపౌండ్ వాల్‌తో. ఫోన్: 9347986771 [HA-32175]
- షాద్‌నగర్ @ శంషాబాద్ టౌన్‌లో DTCP లేఔట్లో ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో 0% ఇంట్రెస్టుతో 40 EMI పద్ధతిలో ఓపెన్ ప్లాట్స్ కలవు. డైరెక్ట్ కంపెనీ ఆఫర్, సైట్ విజిట్ కొరకు. సంప్ర: 9949695027 [H-796155]

WANTED

- Lease/Rent Building For School Area: Nacharam / Mallapur, Minimum 1000 Sq.Yards. Contact: 9642221010, 9030080242 [HA-144]

Services

- Home & Personal Loans Services Mortgage, Top-up Loans Without IT returns, Single Registration,GST Filing & Registration Services. Ph:9121024365 [H-800407]

BUSINESS SERVICE

- మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739. [H-800406]

BUSINESS OFFER

- INVESTORS welcome for imported Alchoholic Beverages. Discussions shall be held on 23th May 2024 at Hotel Taj Krishna Lobby, Rd No.1, Banjara Hills, Hyd. Please feel free to call 9324902794, 8867588202 [HA-14338]

HOME NEEDS

PEST CONTROL

- వాసనలేని మరకలు పడని ISI కెమికల్స్ 5 సం॥ వ్యారంటీతో చెదలు (బొద్దింకలు, నల్లులు, బల్లులు) నివారించే సంస్థ, హిందుస్థాన్ పెస్ట్ కంట్రోల్. సంప్ర: 7981533849 / 9490179238 [HA-152]

PERSONAL CARE

CHANGE OF NAME

- I, Harish Kumar Ramakant Mehata R/o 7-1-621/239/10, Sri Jagadeeshwari Residency, 133/2R, Flat No. 101, S R Nagar, Ameerpet, Hyderabad-500038. I have changed my name from Harish Mehata to HARISH KUMAR RAMAKANT MEHATA for all records. [H-778790]
- My son G SAI KOUSHIK YADAV S/o GAJJELA MAHENDER YADAV, Age: 16 Years, Occupation: Student, D.O.B.: 05/03/2008, for the purpose of name correction on Aadhar Card and SSC Certificate, due to parental mistake, changed Name as GAJJELA KOUSHIK YADAV S/o GAJJELA MAHENDER YADAV, in all concerned records. [HA-154]

LOST

- I, Afshan Abedi, R/o Plot No.1, Phase 2, Gunrock Enclave, Secunderabad have Lost / misplaced original property document of plot no. 34, Sy. No. 105, Al-wahed Garden, Kethireddypally. Finder pls Contact: 9985263301 [H-796201]
- I, Mennakanti Prasad S/o Pratap Mennakanti, R/o: Plot no. 29, Balaji Homes, Gurramguda, Rangannaguda X Road, Hayathnagar, lost my original Passport no H1046356 While Shifting House Moosapet to Gurramguda If anyone Find Call: 9052026013 [H-804950]

OLD AGE HOME

- వృద్ధులు & భార్యాభర్తలు A/C & N/C అటాచ్డ్ బాత్రూం, మేడిపల్లి / ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు. Ecil, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతి మరియు 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్: 7981467036, 9391039990, 9515474083. [H-778801]

Wanted

- RTC x రోడ్స్ అశోక్‌నగర్ బాయ్స్ హాస్టల్ హౌస్ కీపింగ్‌కు, ఉతుట్టకు, కడుగుటకు స్త్రీ/పురుషులు కావలెను. మంచి జీతం ఉచిత వసతి+భోజనం. ఫోన్: 9292101119 [HA-14350]
- సెక్యూరిటీ గార్డ్స్ కావలెను: వెస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్. SSC, Age: 38 yrs, హైట్: 5'7", 8 గంటలు, జీతం: 12000/- (on 1st) + WO + ESI + PF ✆ 98497 26274 / 83097 96635 [B-3525]
- హాస్టల్‌లో క్లీనింగ్ పని చేయడానికి సింగిల్ లేడీ కావలెను (40 నుండి 50 సంవత్సరాల లోపు వారు) వసతి, భోజనం ఉచితం + జీతం ఇవ్వబడును. చైతన్యపురి, దిల్‌సుఖ్ నగర్, సంప్ర: 70752 39265 [HA-14077]
- AS రావ్ నగర్, నాగారం, కర్మన్‌ఘాట్, మదీనగూడ ఏరియాలకు హెల్పర్స్ ప్రముఖ షోరూం కొరకు కావలెను. 9 గం॥ డ్యూటీ, 4 వీక్లీ ఆఫ్స్ ESI+PF మంచి జీతం. సంప్ర: 9032153413 [H-778789]
- రిసెప్షన్, టెలికాలర్, ఆఫీస్‌బాయ్, వీడియో ఎడిటింగ్, టైపింగ్ DTP, డ్రైవర్లు, సూపర్‌వైజర్, ఆయాలు, కుక్స్, హెల్పర్స్, గార్డెన్ వర్కర్స్, మేస్త్రీలు, జీ: 15-18K, ఫ్రీ హాస్టల్. ఫోన్: 9505288777. [H-778727]
- వేద హోంకేర్: హైదరాబాద్ నందు వృద్ధులకు,పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు॥ కావలెను. జీతం: 17000 రూం+భోజనం ఫ్రీ ✆ 9177963179 [G-1490]
- Required Cold storage technician for Chillers and Freezers In Dubai, UAE. WhatsApp : +971507582216 citycooltrd2010@gmail.com [HA-1297]
- Wanted Commercial Vehicle Driver for Ashok leyland in Shamirpet, Turkapally. Contact Number: 9550447220 [HA-5894]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక: ఐకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన విజయారెడ్డి



స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–11లోని ఉదయ్‌నగర్‌లో దావూద్‌జంగ్ కాలనీని ఆనుకుని 250 గజాల ప్రభుత్వ స్థలం ఇటీవల కబ్జాకు గురికాగా షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ స్థలం అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే కబ్జాదారులు ఈ స్థలాన్ని తిరిగి ఆక్రమించి చుట్టూ ప్రహరీ నిర్మించారు. స్థానికులు ఈ కబ్జాపై ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. బుధవారం ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి ప్రభుత్వ స్థలం చుట్టూ అక్రమంగా నిర్మించిన ప్రహరీగోడను నేలమట్టం చేయించారు. స్థలాన్ని పరిశీలించారు. ప్రజా ప్రయోజనాల కోసం ఈ స్థలాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని స్థానికులకు ఆమె హామీ ఇచ్చారు.

నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

రహమత్‌నగర్: బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ మంగళవారం రాత్రి డివిజన్‌లోని ఎస్‌ఆర్టీ నగర్, బంజారానగర్ బస్తీల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ, తాగునీటి సమస్యలు ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అక్కడి నుంచే ఆయా శాఖల అధికారులకు ఫోన్ ద్వారా సమస్యలను వివరించి పరిష్కరించాలని కార్పొరేటర్ ఆదేశించారు. వర్షపు నీరు రహదారలపై నిల్వకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను సూచించారు. ఆయా బస్తీలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు నరసింహా, మహేశ్‌గౌడ్, రంగనాయక్, ఖదీర్, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే పోలీసు కేసులు

జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 శానిటరీ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్

వెంగళరావునగర్: జీహెచ్‌ఎంసీ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఇకపై పోలీసు కేసులు కూడా పెట్టడానికి వెనుకాడేది లేదని జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 శానిటరీ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 కార్యాలయంలో బుధవారం జీహెచ్‌ఎంసీ ఎస్‌ఎఫ్‌ఏలు, పొదుపు సంఘాల మహిళలకు ప్రత్యేక సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ... గతంలో పలుమార్లు జీహెచ్‌ఎంసీ ప్రజలకు విజ్ఞప్తులను చేసిందన్నారు. చెత్త విషయంలో అనేకమంది ఇంకా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఇప్పటికే ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు సైతం తెలియజేశామన్నారు. జూన్ 1వ తేదీ నుంచి చెత్త ఆటోలో ఎవరైనా చెత్తను వేయకుండా రోడ్ల మీద, జనసంచారం ఉన్న ప్రాంతాల్లో పడేస్తే వారికి రూ. 10 వేలకు పైనే జరిమానా విధించడంతో పాటుగా వారిపై పోలీసు కేసులు కూడా పెట్టనున్నామని హెచ్చరించారు. సర్కిల్–19 పరిధిలో ఈ వారం రోజుల్లో చాలామందికి చలానాలు విధించామన్నారు. తప్పనిసరిగా ప్రజలు జీహెచ్‌ఎంసీ నిబంధనలను పాటించి తీరాలని సూచించారు. కార్యక్రమంలో పొదుపు సంఘాల ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట్ కిషన్, ఎస్‌ఎఫ్‌ఏలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో పోటీ చేస్తాం

ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ

పంజగుట్ట: ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను నిలబెట్టేందుకు కృషి చేస్తామని పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు సింగం శ్రీనివాస్ రావు పార్టీలో చేరగా ఆయనను పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి, ఉపాధ్యక్షుడు దశరథం, నామిని భాస్కర్, లక్ష్మి, పుష్పాంజలి, నవీన్, రమేష్, పావని, శారద, సరిత తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మిస్తున్న స్లాబ్ కూల్చివేత

వెంగళరావునగర్: జీహెచ్‌ఎంసీ నిబంధనలు పాటించకుండా నిర్మించిన బహుళ గృహ సముదాయం స్లాబ్‌ను అధికారులు బుధవారం కూల్చివేశారు. వివరాలివీ... వెంగళరావునగర్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో పద్మావతి అనే మహిళ ఇంటిని నిర్మిస్తుంది. ఆమెకు జీహెచ్‌ఎంసీ కేవలం జీ ప్లస్ త్రీ భవనం నిర్మాణానికి మాత్రమే టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతి ఇచ్చారు. అయితే ఆమె నిబంధనలను ఉల్లంఘిస్తూ మరో అంతస్తును నిర్మించింది. దాంతో అదే కాలనీలో ఉన్న శాంతి జ్యోతి అనే మహిళ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. దీనికి స్పందించిన సర్కిల్–19 టౌన్ ప్లానింగ్ అధికారులు ఆమెకు నోటీసులు జారీ చేశారు. అయినా సదరు యజమాని వినకుండా మరో అంతస్తును నిర్మించారు. దాంతో ఉన్నతాధికారులకు తెలియజేయగా జోనల్ కార్యాలయం ఇంజినీరింగ్ విభాగం ప్రత్యేక అధికారులు బుధవారం తన సిబ్బందితో వచ్చి అదనంగా ఉన్న స్లాబ్ నిర్మాణాన్ని తొలగించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ నిబంధనలు పాటించకుండా బహుళ అంతస్తులు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తల్లీకుమార్తెల అదృశ్యం



ఖైరతాబాద్: తల్లి కూతుళ్లు కనిపించకుండా పోయిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎఎస్‌ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.... బంజారాహిల్స్‌లో రోడ్‌నెం 10లో నివాసముండే ఆటోడ్రైవర్ మహ్మద్ నవాజ్, భార్య ఆయేష బేగం(35), కూతురు సమ్‌రీన్(12)తో కలిసి మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆటోలో అత్త ఇంటికి వెళ్తున్నారు. వీరు వెళ్తున్న ఆటో ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ మీదకు రాగానే ఆటోలోంచి కిందకు దిగిన ఆయేష తనను కిడ్నాప్ చేస్తున్నాడని కాపాడాలంటూ అరిచింది. దీంతో దారిలో వెళ్తున్న ప్రయాణికులు ఆటో డ్రైవర్‌ను పట్టుకొని ఆమెను మరొక ఆటోలో పంపించారు. చివరగా వారిద్దరు భార్యాభర్తల గొడవ అని తెలియడంతో ప్రయాణికులు అక్కడినుంచి వెళ్లిపోయారు. దీంతో నావాజ్ ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భార్యను రెండవ వివాహం చేసుకున్నానని, మొదటి భర్తకు పుట్టిన పాప పుట్టిన తరువాత వారిద్దరు విడిపోయారని, ఆ తరువాత తాను పెళ్లి చేసుకున్నానని, బ్యూటీషియన్‌గా పనిచేసే తన భార్య వారి అమ్మ ఇంటికి వెళ్దామంటే ఆటోలో వెళ్తున్నామని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆటోలోంచి వెళ్లిపోయిన సమయంలో ఆమె ఫోన్ కూడా తీసుకువెళ్లలేదని, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం అక్కడకు కూడా రాలేదని తెలుపడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తల్లి, కూతుళ్ల ఆచూకీ తెలిస్తే ఖైరతాబాద్ పోలీసులకు తెలియజేయాలని తెలిపారు.

ప్రైవేటుకు దీటుగా సర్కారు బడులు

- ఎస్‌ఎస్‌సీ ఫలితాల్లో ప్రైవేటుపై పైచేయి
- ఫలితాలను ప్రదర్శిస్తున్న టీచర్లు
- ఆసక్తి చూపిస్తున్న తల్లిదండ్రులు



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు పది ఉత్తీర్ణతపై టీచర్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలలు అంటే వచ్చామా.. వెళ్లామా.. జీతం తీసుకున్నామా.. అనే రీతిలోనే ఉపాధ్యాయులు చాలా చోట్ల కనిపిస్తుంటారు. సర్కారు బడుల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచే దిశలో ఏమాత్రం శ్రద్ధ చూపకుండా తమకెందుకులే అనుకుంటూ జారుకుంటారు. అయితే కొన్ని పాఠశాలల్లో మాత్రం ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ ఇది కూడా మా పాఠశాల అనే రీతిలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. మాకెందుకులే.. అని అనుకోకుండా ఇది మాదే.. అనే ధోరణిలో వ్యవహరిస్తుండటంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను అంకితభావంతో పనిచేస్తున్న టీచర్లు ఉన్న పాఠశాలల్లో చేర్పడానికి ఆసక్తి చూపిస్తున్నారు.

- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల వెలువడ్డ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు మెచ్చుకోదగ్గ ఉత్తీర్ణత సాధించారు.
- ఈ పాఠశాలలో ఆంగ్లం, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో మొత్తం 69 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 63 మంది (98 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- విద్యా శాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని అత్యుత్తమ ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలో ఇది కూడా ఒకటి. అందుకే ఇక్కడ పనిచేస్తున్న టీచర్లు తలో కొంత డబ్బు పోగుచేసుకుని మొన్నటి పది పరీక్షల ఫలితాల ఉత్తీర్ణతను ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేశారు.
- 9.0కి పైగా జీపీఏ సాధించిన విద్యార్థుల ఫొటోలను కూడా ఫ్లెక్సీల్లో ఏర్పాటు చేసి రాబోయే విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగించారు. తమకెందుకులే అని చేతులు దులుపుకోకుండా తాము పనిచేస్తున్న పాఠశాల ఘనతను చాటుకునేలా వీరు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రైవేటు పాఠశాల ముందు ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీ అందరినీ ఆకట్టుకుంటుంది.
- ఈ పాఠశాలలో చదివితే మంచి మార్కులు సాధించవచ్చనే ధైర్యాన్ని విద్యార్థుల్లో కలిగించారు. దీంతో ఈ పాఠశాలల్లో చేరేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు.
- కొత్త ప్రవేశాలు కూడా ఇప్పటికే 50కి మించాయి. ఈ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులంతా పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారనడానికి ఈ ఫ్లెక్సీల రూపంలో తల్లిదండ్రుల్లో భరోసా కలిగించారు.
- ఇదే బాటలో మిగతా ప్రభుత్వ పాఠశాలలు కూడా నడుస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల కంటే తామేమీ తక్కువ కాదని చెబుతూ, తమ వద్ద విద్యార్థుల సాధించిన ఫలితాలను ఫ్లెక్సీల రూపంలో వెల్లడిస్తున్నారు.
- ఇటీవల వెలువడ్డ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రాజ్‌భవన్ హైస్కూల్‌లో 129 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, అందులో 123 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటు పాఠశాలల కంటే ఇక్కడ ఎక్కువ ఫలితాలు వెలువడ్డాయి.
- ఎర్రమంజిల్ హైస్కూల్‌లో 49 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 36 మంది పాస్ అయ్యారు.
- సోమాజిగూడ మక్తా పాఠశాలలో 33 మందికి గాను 21 మంది పాస్ అయ్యారు.
- శ్రీరామ్‌నగర్ పాఠశాలలో 71 మందికి గాను 66 మంది ఉత్తీర్ణులయ్యారు.
- యూసుఫ్‌గూడ హైస్కూల్‌లో 162 మంది విద్యార్థులకు గాను 135 మంది పాసయ్యారు.
- ఫిలింనగర్ పాఠశాలలో 168 విద్యార్థులకు గాను 134 మంది పాసయ్యారు.
- బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్బీటీనగర్ హైస్కూల్‌లో 97 మంది విద్యార్థులకు 88 మంది పాసయ్యారు.
- ఇలా చెప్పుకుంటూ పోతే ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 17 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 82 శాతం ఉత్తీర్ణత లభించింది. గత విద్యా సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు వచ్చాయి. పదో తరగతి విద్యార్థుల పట్ల ఈ పాఠశాలల్లో టీచర్లు శ్రద్ధ వహించి ప్రత్యేక తరగతులతో బోధన కొనసాగించడం వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి.
- ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా ఫలితాల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే ఎక్కువ శాతం ఫలితాలు రావడాన్ని తల్లిదండ్రులు కూడా గుర్తించారు. కేవలం ఎస్‌ఎస్‌సీ మాత్రమే కాకుండా 1 నుంచి 9వ తరగతి వరకు నిర్వహించిన వార్షిక పరీక్షల్లో కూడా విద్యార్థులు మంచి ఫలితాలు రాబట్టారు.
- నాణ్యమైన బోధన, ఉపాధ్యాయులు అంకితభావం, కొత్తగా వస్తున్న మౌలిక సదుపాయాలు ఇందుకు కారణాలుగా తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఈ ఫలితాలు చూసి ఈ విద్యా సంవత్సరం ప్రైవేటు స్కూళ్ల నుంచి ఎక్కువ మంది విద్యార్థులను ఆకర్షించాలని సర్కార్ బడుల టీచర్లు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
- ప్రైవేటుపై తల్లిదండ్రులకు రోజురోజుకూ అనాసక్తత పెరుగుతుండగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు మొగ్గుచూపుతున్నారు.

వరదనీటి కాలువలోని బురద శుభ్రం

సాక్షి ఎఫెక్ట్..



నాలాలో బురదను శుభ్రం చేస్తున్న జలమండలి సిబ్బంది

బంజారాహిల్స్: 'రహదారుల మురుగుమయం.. నడక నరకప్రాయం' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి బంజారాహిల్స్ జలమండలి అధికారులు స్పందించారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని భాగ్యనగర్ స్టూడియో ముందు బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ భారతీ నాయక్ ఇంటిని ఆనుకుని గత కొంతకాలంగా వరదనీటి కాలువలో నుంచి మురుగు బయటకు పొంగుకొస్తూ ఇక్కడ రోడ్డంతా దుర్గంధమయమైంది. ఈ సమస్యను 'సాక్షి' వెలుగులోకి తీసుకురాగా జలమండలి జీఎం హరిశంకర్ వెంటనే స్పందించి స్థానిక సిబ్బందితో వరదనీటి కాలువలో నిండిపోయిన బురద, ఇతర వ్యర్థాలను తొలగింపజేసి వరద, మురుగునీరు కాలువలో నుంచి సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మురుగు సమస్యపై జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 ఈఈ విజయ్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి వరదనీటి కాలువలో డీసిల్టింగ్ చేపట్టి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అయితే ఈఈ విజయ్‌కుమార్ ఎమ్మెల్యే ఆదేశాలను బేఖాతర్ చేస్తూ పట్టించుకోకపోవడంతో జలమండలి అధికారులు ఇక్కడకు చేరుకుని సమస్యను పరిష్కరించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ మణిపాల్, ఏఈ సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కునాల్ తదితరులు ఎవరూ వరద నీటి కాలువలో మురుగు నిండిపోయి లీక్ అవుతున్న ప్రాంతాన్ని పట్టించుకోలేదని, వీరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వరదనీటి కాలువలో డ్రైనేజీ పైపులు కలపడం వెనుక జీహెచ్‌ఎంసీ ఇంజినీర్ల పాత్ర ఉందని, దీనిపై విచారణ జరపాలని ఆమె డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని, వీరి నిర్వాకం వల్లనే రోడ్లపై వరద, మురుగు పొంగిపొర్లుతూ మ్యాన్‌హోళ్లు లీకవుతున్నాయని దుయ్యబట్టారు. సకాలంలో జలమండలి అధికారులు స్పందిస్తూ తమ పరిధి కాకపోయినా వరదనీటి కాలువలో బురదను, వ్యర్థాలను తొలగిస్తున్నారని, జీహెచ్‌ఎంసీ మాత్రమే ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ కమిషనర్ స్పందించి ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ఇంజినీర్ల నిర్వాకంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకనే జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఇంజినీర్లు, పారిశుద్ధ్య విభాగం, టౌన్‌ప్లానింగ్ విభాగం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని జనం విమర్శిస్తున్నారు.

ఆక్రమణల్లో జీహెచ్‌ఎంసీ పార్కు స్థలం



జీహెచ్‌ఎంసీ పార్కు స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బా

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ పార్కు స్థలాలు ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించాలి. ఎక్కడైనా ఆక్రమణలకు గురైతే జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే వాటిని తొలగించి పార్కు స్థలాలను కాపాడాలి. మరి అదే జీహెచ్‌ఎంసీ అధికారులు పార్కు స్థలాల్లో డబ్బాలు ఏర్పాటుచేస్తే ఎలా ఉంటుంది..? జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45లోని ప్రధాన రహదారిలో ఇదే జరిగింది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45 గీత ఆర్ట్స్ ఎదురుగా రోడ్డుకు అవతలి వైపు జీహెచ్‌ఎంసీ పార్కు ఉంది. ఐదు రోజుల క్రితం ఈ స్థలంలో ఓ డబ్బా ఏర్పాటుచేశారు. ఒక వ్యాపారికి పార్కు స్థలంలో ఈ డబ్బా ఏర్పాటుచేసుకునేందుకు జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పారిశుద్ధ్య విభాగం అధికారి సహకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్కులను కాపాడాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులే ఆక్రమణలకు ప్రోత్సహిస్తున్నారని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు చేసుకునేవారు ఉపాధి పొందడం మంచిదే. అయితే పార్కుల్లో, ప్రభుత్వ స్థలాల్లో వీటిని ఏర్పాటుచేసుకోవడం మాత్రం నిబంధనలకు విరుద్ధం. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ డబ్బా ఏర్పాటు వెనుక ఉన్న అధికారి ఎవరు అని విచారించి వెంటనే ఈ ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉద్యోగం కోసం రూ. 20 పంపితే ఆన్‌లైన్‌లో నగదు మాయం

వెంగళరావునగర్: ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే మహిళ నుంచి నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్ గురుద్వార్ గల్లీలో నివాసం ఉండే వి.త్రివేణికి ఈ నెల 2న ప్రైవేట్ సంస్థ నుంచి మెయిల్ వచ్చింది. ఉద్యోగం కావాలంటే రూ. 20 పంపాలని సూచించారు. ఆమె తన క్రెడిట్ కార్డు ద్వారా రూ. 20 పంపగా వెంటనే దాంతో పాటుగా రూ. 20,560 నగదు డెబిట్ అయినట్టుగా మెసేజ్ వచ్చింది. ఆమె ఆందోళన చెంది ఎస్బీఐకి వెళ్ల నగదు హోల్డ్ చేయమని కోరింది. బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ తీసుకురావాలని కోరారు. ఈ నెల 18న సైబర్ క్రైమ్ నుంచి ఎఫ్ఐఆర్ కాపీ తీసుకుని బ్యాంకుకు పంపింది. అయితే బ్యాంకు మాత్రం సకాలంలో ఎఫ్ఐఆర్ కాపీ తీసుకురానందున హోల్డ్‌లో ఉంచలేకపోయామని ఆమెకు తెలియజేశారు. దాంతో త్రివేణి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న కశ్మీరీ అందాలు!



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న రఫీక్ బేగ్

ఖైరతాబాద్: కశ్మీర్ అందాలను పరిచయం చేస్తూ ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్‌ఎండీఏ మైదానంలో ఏర్పాటు చేసిన సమ్మర్ ఉత్సవ్ మేళా సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. కశ్మీర్‌లోని అనంత్‌వల్లి, మినీ స్విట్జర్లాండ్, తులిప్ గార్డెన్, దూద్‌వ్యాలీ వంటి ప్రాంతాలను అద్భుతంగా రూపొందించి మైనస్ డిగ్రీల్లో ఉండే చలిలో ఎగ్జిబిషన్‌లోకి ప్రవేశించేలా ఏర్పాటు చేసిన తీరు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. సందర్శకులు సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ కశ్మీర్‌లో పర్యటించే అనుభూతిని పొందుతున్నారు. గడచిన రెండు దశాబ్దాగా ఏటా వివిధ రకాల అనుభూతులను పరిచయం చేస్తూ ఎగ్జిబిషన్‌లను ఏర్పాటు చేస్తూ వస్తున్న నిర్వాహకుడు మిర్జా రఫీక్ బేగ్ బుధవారం సందర్శకులతో కలిసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. సమ్మర్ ఉత్సవ్ మేళా రోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 11 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

వేడుకగా నరసింహస్వామి జయంతి



బంజారాహిల్స్: హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో శ్రీనరసింహ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగిన ఈ ఉత్సవంలో భాగంగా స్వయంభూ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి మూల విరాట్టుకు శాస్త్రోక్త అభిషేకం, శ్రీనరసింహ హోమం, శ్రీభూ సమేత లక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణోత్సవం, శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఉత్సవ మూర్తికి మహాభిషేకం జరిగాయి. అనంతరం ప్రత్యేక ప్రవచనం జరిగింది. సాయంత్రం వేద మంత్రోచ్ఛారణలు, హరినామ సంకీర్తనల నడుమ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవమూర్తులకు 108 కలశాలతో మహా అభిషేకం సంప్రాయబద్ధంగా నిర్వహించారు. చివరగా ఊంజల్ సేవ, పల్లకి ఉత్సవంతో ఈ వేడుకలు ఘనంగా ముగిశాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస ప్రభుజీ మాట్లాడుతూ... నరసింహ స్వామి అవతారం మహత్యాన్ని వివరించారు.

ఫిర్యాదు చేసేందుకెళ్తే...

వెంగళరావునగర్: పోలీసులు కొట్టారని ఫిర్యాదు చేయడానికి వెళితే మహిళా ఎస్‌ఐ తన భర్త మర్మాంగాలపై తన్నారని ఓ మహిళ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మధురానగర్‌కాలనీలో నివాసం ఉండే ఎర్రోళ్ల రమేష్ ఈ నెల 17వ తేదీ మధుర వైన్స్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో వైన్స్ నిర్వాహకులు ఎం.రఘునాథరెడ్డి తన సిబ్బంది కలిసి రమేష్‌ను కొట్టారు. విషయం తెలిసి అతని భార్య సజిదా బేగం వైన్స్ వద్దకు వెళ్లగా ఆమెను కూడా కొట్టారు. ఈ విషయంపై మధురానగర్ పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లగా ఎస్‌ఐ మాధవీరెడ్డి తన భర్తను మర్మాంగాలపై తన్నారని, తనను సైతం కొట్టారని, కులం పేరుతో దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈ సంఘటనలో ఇప్పటికే వైన్ షాపు సిబ్బందిపై ఒక కేసు, రమేష్, సాజిదాలపై రెండు కేసులు నమోదయ్యాయి. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... రమేష్, సాజిదాబేగంలు తమ సిబ్బందిపై అసత్య ప్రచారం చేస్తున్నారని, వారు ఆరోపిస్తున్న ఘటనలు పోలీస్ స్టేషన్‌లో జరగలేదని వివరించారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

మహిళలు 10 శాతమైనా లేరు!



ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో మహిళల సంఖ్య 10 శాతం కంటే తక్కువే ఉంది! ఈసారి మహిళా అభ్యర్థులు కేవలం 797 మందేనని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. అంటే 9.5 శాతం! తొలి విడతలో 1,618 మంది అభ్యర్థుల్లో మహిళలు 135 మంది. రెండో విడతలో 1,192 మంది అభ్యర్థుల్లో 100 మంది, మూడో విడతలో 1,352 మందిలో 123, నాలుగో విడతలో 1,717 మందిలో 170, 5వ విడతలో 695 మందిలో 82 మంది మహిళలున్నారు. పోలింగ్ జరగాల్సిన ఆరో విడతలో 869 మంది అభ్యర్థుల్లో 92 మంది మహిళలున్నారు. ఏడో విడతలో కూడా 904 మంది అభ్యర్థుల్లో మహిళలు కేవలం 95 మందే. మహిళా రిజర్వేషన్ల అమలుపై పార్టీల చిత్తశుద్ధి ఏపాటిదో చెప్పేందుకు ఈ ఉదంతం ఒక్కటి చాలని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

ఈసారి మొత్తం 8,337 మంది అభ్యర్థులు లోక్‌సభ బరిలో నిలిచారు. ఇంతమంది పోటీలో ఉండటం 1996 తర్వాత ఇదే తొలిసారి. 1996లో రికార్డు స్థాయిలో 13,952 మంది పోటీ చేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇద్దరికీ కీలకమే

బెంగాల్లో తృణమూల్, బీజేపీ హోరాహోరీ

- 25న ఆరో విడతలో 8 స్థానాలకు పోలింగ్
- బరిలో మంత్రి, మాజీ న్యాయమూర్తి, నటులు

తృణమూల్, బీజేపీ ముఖాముఖి పోరుకు వేదికైన పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు ఆరో దశకు చేరుకున్నాయి. ఇప్పటిదాకా ఐదు విడతల్లో 25 లోక్‌సభ స్థానాలకు ఎన్నిక ముగిసింది. ఆరో దశలో భాగంగా 8 స్థానాలకు శనివారం పోలింగ్ జరగనుంది. తామ్లుక్, కాంథీ స్థానాల్లో బీజేపీ కీలక నేత సువేందు అధికారిపై ప్రతీకారానికి తృణమూల్ ఉవ్విళ్లూరుతోంది. సువేందు సోదరుడు సౌమేందు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి అభిజిత్ గంగోపాధ్యాయ, కేంద్ర మంత్రి సుభాష్ సర్కార్, పలువురు బెంగాలీ నటుల భవితవ్యాన్ని ఈ దశలో ఓటర్లు తేల్చనున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

బాంకురా



● సుభాష్ సర్కార్

2019లో తృణమూల్ సీనియర్ నేత సుబ్రతా ముఖర్జీపై కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ 1.74 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. కానీ సొంత కార్యకర్తలే ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు! టీఎంసీ నుంచి బాంకురా ఎమ్మెల్యే అరూప్ చక్రవర్తి, సీపీఎం నుంచి న్యాయవాది నీలాంజన్ దాస్ గుప్తా పోటీలో ఉన్నారు. త్రిముఖ పోటీలో ఎవరు నెగ్గుతారన్నది ఆసక్తికరం.

ఘాటల్



● దీపక్ అధికారి

సిట్టింగ్ ఎంపీ, నటుడు, గాయకుడు దీపక్ అధికారి (దేవ్) తృణమూల్ నుంచి హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. బీజేపీ కూడా ప్రముఖ బెంగాలీ నటుడు, ఖరగ్‌పూర్ ఎమ్మెల్యే హిరేన్ ఛటర్జీని పోటీకి దించింది.

ఎంపీ భారీ సభల ద్వారా దర్పం ప్రదర్శిస్తుంటే తాను రోడ్లపైకొచ్చి సామాన్యులతో మమేకం అవుతున్నానని హిరేన్ అంటున్నారు. సీపీఐ కూడా బరిలో ఉండటంతోటిక్కడ త్రిముఖ పోటీ నెలకొంది.

కాంథీ



● సౌమేందు అధికారి

ఈస్ట్ మిడ్నాపూర్ జిల్లా పరిధిలోని ఈ స్థానమూ సువేందు కుటుంబానికి కంచుకోటే. ఆయన తండ్రి శిశిర్ అధికారి తృణమూల్ టికెట్‌పై 2009, 2014, 2019ల్లో వరుసగా గెలిచారు. ఈసారి సువేందు తమ్ముడు సౌమేందు అధికారి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. పతాష్‌పూర్ ఎమ్మెల్యే ఉత్తమ్ బారిక్ తృణమూల్ నుంచి, యువ న్యాయవాది ఊర్వశి భట్టాచార్య సీపీఎం మద్దతుతో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. తామ్లుక్‌తో పాటు కాంథీలోనూ నెగ్గి సువేందుపై ప్రతీకారం తీర్చుకోవాలని తృణమూల్ చూస్తోంది.

మేదినీపూర్



● జూన్ మాలియా

బీజేపీ నుంచి ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అగ్నిమిత్ర పాల్ పోటీ చేస్తున్నారు. ఆమె బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు. అసన్‌సోల్ దక్షిణ ఎమ్మెల్యే. తృణమూల్ నుంచి మేదినీపూర్ ఎమ్మెల్యే జూన్ మాలియా బరిలో ఉన్నారు. అభ్యర్థులిద్దరికీ సొంత పార్టీల్లో విభేదాలు తలనొప్పిగా మారాయి. తమ పార్టీలో విభేదాలు సర్దుకున్నాయని అగ్నిమిత్ర చెబుతున్నారు. సీపీఐ నుంచి బిప్లబ్ భట్టా పోటీలో ఉన్నారు.

ఝార్‌గ్రాం



● ప్రణత్ తుడు

ఇక్కడ బీజేపీ సిట్టింగ్ ఎంపీ కునార్ హెంబ్రమ్ పార్టీని వీడటంతో ప్రణత్ తుడుకు టికెట్ దక్కింది. సంథాలీ రచయిత, పద్మశ్రీ, సాహిత్య అకాడమీ అవార్డుల గ్రహీత కాళీపద సోరెన్‌ను టీఎంసీ బరిలోకి దింపింది. మరోసారి విజయంపై ధీమాతో ఉంది. సీపీఎం నుంచి సోనామణి ముర్ము పోటీ చేస్తున్నారు. జార్ఖండ్ పీపుల్స్ పార్టీ, ఐఎస్ఎఫ్ కూడా పోటీలో ఉన్నాయి.

పురూలియా



● జ్యోతిర్మయ్ మహతో

బీజేపీ సిట్టింగ్ ఎంపీ జ్యోతిర్మయ్ సింగ్ మహతో ఈసారి కూడా బరిలో ఉన్నారు. తృణమూల్ నుంచి మాజీ మంత్రి శాంతిరాం మహతో, కాంగ్రెస్ నుంచి నేపాల్‌దేవ్ మహతో, ఫార్వార్డ్ బ్లాక్ తరఫున ధీరేంద్ర నాద్ మహతో, బీఎస్పీ నుంచి సంతోష్ రాజోవర్ పోటీ చేస్తున్నారు. వీరికి ఎస్‌యూసీఐ విద్యార్థి నేత సుష్మిత మహతో, స్వతంత్ర అభ్యర్థి అజిత్ ప్రసాద్ మహతో గట్టి పోటీ ఇస్తున్నారు. మహతోలంతా కుర్మి సామాజిక వర్గీయులే. బలమైన కుర్మి ఓటు బ్యాంకు కోసం తృణమూల్ బాగా ప్రయత్నిస్తోంది. దాంతో కుర్మిల ఓటు బ్యాంకు చీలేలా కన్పిస్తున్నాయి. ఆ లెక్కన బీజేపీకి ఈసారి విజయం సులువు కాదంటున్నారు.

తామ్లుక్



● అభిజిత్ గంగోపాధ్యాయ

తృణమూల్, బీజేపీ ఇక్కడ విజయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అసెంబ్లీలో విపక్ష నేత, రాష్ట్ర బీజేపీ దిగ్గజం సువేందు అధికారి 2009, 2014ల్లో ఇక్కణ్నుంచే లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2016 ఉప ఎన్నికలో, 2019 ఎన్నికల్లో ఆయన సోదరుడు దిబ్యేందు అధికారి తృణమూల్ టికెట్‌పై గెలవడం విశేషం! ఈసారి గెలుపు కోసం తృణమూల్ గట్టిగా పోరాడుతోంది. ఈస్ట్ జిల్లా పరిధిలో సువేందు కుటుంబానికి అపార పలుకుబడి ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం మమతపై నందిగ్రాం స్థానంలో సువేందు 1,956 ఓట్లతో గెలిచారు! మాజీ న్యాయమూర్తి అభిజిత్ గంగోపాధ్యాయకు బీజేపీ ఇక్కడ టికెటిచ్చింది. సీపీఎం కూడా కలకత్తా హైకోర్టు యువ న్యాయవాది సాయన్ బెనర్జీకి టికెటిచ్చింది. తృణమూల్ నుంచి పార్టీ ఐటీ సెల్ చీఫ్ 27 ఏళ్ల దేబాన్షు భట్టాచార్య బరిలో ఉన్నారు.

దేశ రాజధానిలో... బీజేపీకి సవాలే

ఆప్-కాంగ్రెస్ గట్టి పోటీ ● 7 లోక్‌సభ స్థానాలకు 25న పోలింగ్



దేశ రాజధానివాసులు గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీకి జైకొట్టారు. ఈసారి మాత్రం కాంగ్రెస్-ఆప్ గట్టి పోటీ ఇస్తున్నాయి. 2014, 2019 ఎన్నికల్లో మూడు పార్టీలూ విడిగా పోటీ చేయడం బీజేపీకి బాగా కలిసొచ్చింది. ఇండియా కూటమి భాగస్వాములైన కాంగ్రెస్ 3, ఆప్ 4 చోట్ల బీజేపీకి సవాలు విసురుతున్నాయి. దాంతో అధికార వ్యతిరేకతను అధిగమించేందుకు ఏకంగా ఆరుగురు సిట్టింగులను కాషాయ పార్టీ మార్చేసింది! ఆప్ సర్కారుపై అవినీతి ఆరోపణలనే ప్రచారాస్త్రంగా చేసుకుంది. అదంతా తమ పార్టీని అంతం చేసే కుట్రలో భాగమంటూ ఆప్ తిప్పికొడుతోంది. జైలు నుంచి తిరిగొచ్చిన అధినేత కేజ్రీవాల్ ప్రచార భారాన్ని భుజాలపై మోశారు. శనివారం జరిగే పోలింగ్‌లో ఓటర్లు ఎవరిని దీవిస్తారన్నది ఉత్కంఠగా మారింది...

- సాక్షి, నేషనల్ డెస్క్

న్యూఢిల్లీ

కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి స్థానంలో దివంగత సుష్మా స్వరాజ్ కుమార్తె, యువ న్యాయవాది, బాసురీ స్వరాజ్‌కు బీజేపీ టికెటిచ్చింది. 40 ఏళ్ల బాసురీ రాజకీయాలకు కొత్త కాదు. 2013, 2015, 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మాలవీయనగర్ నుంచి విజయం సాధించారు. ఆప్ అభ్యర్థి సోమనాథ్ భారతి కూడా లాయరే. ఇద్దరూ పోటాపోటీగా ప్రచారం చేశారు. ప్రధాని, కేంద్ర మంత్రులు, విపక్ష నేతలు, ప్రభుత్వ ఉన్నతాధికారుల నివాసాలు ఈ వీఐపీ స్థానం పరిధిలోనే ఉన్నాయి. ట్రాఫిక్ జామ్, మురుగు నీటి సమస్యలపై ప్రజల్లో అసంతృప్తి ఉంది.

చాందినీ చౌక్

విస్తీర్ణంలో దేశంలోనే అతి చిన్న లోక్‌సభ స్థానమిది. సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి హర్షవర్ధన్ బదులు వ్యాపారి ప్రవీణ్ ఖండేల్వాల్ (64)కు బీజేపీ టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి జై ప్రకాశ్ అగర్వాల్ పోటీలో ఉన్నారు. ఇక్కడ పెద్ద సంఖ్యలో ఉండే వర్తకుల కోసం తాము చేసిన పనులను గుర్తు చేస్తూ అగర్వాల్, ఖండేల్‌వాల్ ఓట్లడిగారు. ఆప్ మద్దతు అగర్వాల్‌కు అదనపు బలం.

నార్త్ ఈస్ట్ ఢిల్లీ

బీజేపీ సిట్టింగ్ ఎంపీ, భోజ్‌పురి నటుడు మనోజ్ తివారీ హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. మాజీ విద్యార్థి నేత కన్హయ్య కుమార్ కాంగ్రెస్ అభ్యర్థిగా సవాల్ విసురుతున్నారు. బిహార్, యూపీ, జార్ఖండ్ నుంచి వలస వచ్చిన ఓటర్లు ఇక్కడ ఏకంగా 30 శాతం పైగా ఉంటారు. అందుకే బిహార్‌కు చెందిన కన్హయ్యకు కాంగ్రెస్ చాన్సిచ్చింది. అయితే ఆయన పోటీ తమకే కలిసొస్తుందని బీజేపీ అంటోంది. ఢిల్లీ జేఎన్‌యూ విద్యార్థి సంఘం నాయకునిగా కన్హయ్య ఎదుర్కొన్న ఆరోపణలను ప్రచారంలో పదేపదే ప్రస్తావించింది.

ఈస్ట్ ఢిల్లీ

సిట్టింగ్ ఎంపీ, ప్రముఖ క్రికెటర్ గౌతమ్ గంభీర్ బదులు హర్షా మల్హోత్రాకు బీజేపీ టికెటిచ్చింది. ఆప్ నుంచి కులదీప్ కుమార్ పోటీ చేస్తున్నారు. వీరిద్దరూ తొలిసారి లోక్‌సభ బరిలో దిగారు. అయితే ఈస్ట్ ఢిల్లీ మేయర్‌గా చేసిన అనుభవం మల్హోత్రా సొంతం. ఈస్ట్ ఢిల్లీ బీజేపీ కంచుకోట అనే చెప్పాలి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అయిన పీసీసీ మాజీ చీఫ్ రవిందర్ సింగ్ లవ్లీ ఇటీవలే బీజేపీలో చేరడం ఆ పార్టీకి మరింత కలిసి రానుంది.

నార్త్‌వెస్ట్ ఢిల్లీ

ఈ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ హన్స్‌రాజ్ హన్స్ బదులు కౌన్సిలర్ యోగేంద్ర చందోలియాకు బీజేపీ చాన్సిచ్చింది. ఆయన గతంలో నార్త్ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా చేశారు. 2014 ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై ఎంపీగా గెలిచిన ఉదిత్‌రాజ్ ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగడం ఆసక్తికరం. ఆయన ఎంపీగా నియోజకవర్గానికి ముఖం కూడా చూపించలేదని ప్రచారంలో చందోలియా పదేపదే చెప్పారు.

వెస్ట్ ఢిల్లీ

ఆప్ నేత మహాబల్ మిశ్రా, బీజేపీ అభ్యర్థి కమల్‌జీత్ షెరావత్ మధ్య గట్టి పోటీ నెలకొంది. 70 ఏళ్ల మహాబల్ మిశ్రాది బిహార్‌లోని మధుబని. ఇక్కడ బిహారీ ఓటర్లు భారీగా ఉండటం ఆయనకు అనుకూలించే అంశం. షెరావత్ బీజేపీ మహిళా మోర్చా ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఎక్కువ మంది ఇంటి నుంచి ఓటేసిన లోక్‌సభ స్థానంగా ఈసారి వెస్ట్ ఢిల్లీ వార్తల్లోకెక్కింది. 85 ఏళ్లు పై బడిన 969 మంది, 179 మంది దివ్యాంగులు ఇంటి నుంచి ఓటేశారు.

సౌత్ ఢిల్లీ

సిట్టింగ్ ఎంపీ, వివాదాస్పద నేత రమేశ్ బిధురి బదులు బదార్‌పూర్ ఎమ్మెల్యే రామ్‌వీర్ సింగ్ బిధురికి బీజేపీ టికెటిచ్చింది. ఆప్ నుంచి సాహిరాం పహిల్వాన్ బరిలో ఉన్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని 10 అసెంబ్లీ సీట్లలో బీజేపీ చేతిలో ఉన్నది బదార్‌పూర్ ఒక్కటే! అభ్యర్థులిద్దరూ గుర్జర్ సామాజికవర్గానికి చెందిన వారే కావడంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

ఆంధ్రప్రదేశ్

'గేటు'లో గూండాగిరి

పాల్వాయి గేటులో ఓటర్లను బెదిరించి పచ్చమూకల రిగ్గింగ్

వైఎస్సార్ సీపీ ఏజెంట్లను చితకబాది బూత్‌ల నుంచి ఈడ్చివేత

సాక్షి, నరసరావుపేట / రెంటచింతల: మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేశారని చెబుతున్న పాల్వాయి గేటులోని పోలింగ్ బూత్‌లో ఆ రోజు అసలు ఏం జరిగిందన్నది కీలకంగా మారింది. మే 13వతేదీన మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం పాల్వాయి గేటు 201, 202 పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలను బెదిరించి టీడీపీ గూండాలు భయానక వాతావరణం సృష్టించారు. పోలింగ్ సజావుగా జరగకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారితోపాటు పల్నాడు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసేందుకు పిన్నెల్లి పలుసార్లు ఫోన్ చేసినా వారు స్పందించలేదు. తమ పార్టీ పోలింగ్ ఏజెంట్లను పోలింగ్ కేంద్రం నుంచి బయటకు లాక్కొచ్చి దాడులు చేయడంతోపాటు టీడీపీ నేతలు రిగ్గింగ్ చేస్తున్నారనే సమాచారం అందడంతో ఎమ్మెల్యే పిన్నెల్లి అక్కడకు చేరుకున్నట్లు చెబుతున్నారు. యథేచ్ఛగా జరుగుతున్న రిగ్గింగ్‌ను ఆయన ప్రతిఘటించారు. ఈ క్రమంలో వాగ్వాదం చోటు చేసుకుంది. అయితే పచ్చ మూకలు పల్నాడు ప్రాంతంలో దాదాపు ఏడు చోట్ల ఈవీఎంల విధ్వంసాలకు తెగబడగా దీన్ని అడ్డుకున్న పిన్నెల్లి వీడియోను మాత్రమే బహిర్గతం చేయడం వెనుక కచ్చితంగా కుట్ర కోణం ఉన్నట్లు స్పష్టం అవుతోంది.

ఈసీకి మొర పెట్టుకున్నా...

పాల్వాయిగేట్, తుమృకోట, ఒప్పిచర్ల, చింతలపల్లి పోలింగ్ కేంద్రాలలో గతంలో పలుమార్లు టీడీపీ నేతలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఆయా కేంద్రాలలో పటిష్ట బందోబస్తు కల్పించి ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పలు దఫాలు ఈసీ, కలెక్టర్, ఎస్పీలను అభ్యర్థించినా స్పందించలేదు. పోలింగ్ రోజు కూడా రెండుసార్లు ఈసీకి మొర పెట్టుకున్నా ఫలితం శూన్యం. పాల్వాయి గేట్ పోలింగ్ కేంద్రంలో టీడీపీ అరాచకాలకు సహకరించేందుకు 50 ఏళ్లకు పైగా వయసున్న ఒక పోలీసు కానిస్టేబుల్‌కు మాత్రమే విధులు కేటాయించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగితే టీడీపీకి మరోసారి ఓటమి తప్పదని గుర్తించి రిగ్గింగ్‌కు తెగబడింది.

వైఎస్సార్ సీపీ ఏజెంట్లను చితకబాది..

పాల్వాయి గేట్ కేంద్రంలో వైఎస్సార్ సీపీ పోలింగ్ ఏజెంట్లుగా ఉన్న చింతా సుబ్బారావు, డేరంగుల శ్రీను, చల్లా సుబ్బయ్యలను టీడీపీ నేతలు కొట్టి బయటకు ఈడ్చేశారు. ఓటు వేయడానికి క్యూలో నిలబడ్డ మహిళలను భయకంపితుల్ని చేసి తరిమేశారు. అనంతరం అక్కడ టీడీపీ నేతలు యథేచ్ఛగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. స్థానికులతో కలసి మరోసారి దీన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలింగ్ ఏజెంట్లపై విచక్షణారహితంగా దాడి చేయడంతో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తెచ్చారు. దీంతో అక్కడకు చేరుకున్న పిన్నెల్లి రిగ్గింగ్‌ను ప్రతిఘటించారు. దీన్ని అడ్డుకోవాలని పోలింగ్ అధికారులను అభ్యర్థించారు. టీడీపీ మూకల అరాచకాలను ఎన్నికల అధికారుల దృష్టికి తెచ్చినా స్పందించలేదు. పిన్నెల్లి కుమారుడు గౌతమ్‌రెడ్డి, డ్రైవర్ అంజిరెడ్డి, మరికొందరిపై టీడీపీ నేతలు దాడులు చేసి తీవ్రంగా గాయపరిచారు. పిన్నెల్లి కాన్వాయ్‌లోని వాహనాలను ధ్వంసం చేశారు. ఓటర్లు, ఏజెంట్లను భయపెట్టి రిగ్గింగ్ చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు.

ఆ వీడియో ఒక్కటే.. వారం తరువాత

మాచర్ల నియోజకవర్గంలో పోలింగ్ రోజు మొత్తం ఏడు ఈవీఎంలు ధ్వంసమయ్యాయి. ఒక్క పాల్వాయి గేటు వీడియో మినహా మిగతావి ఏవీ బయటకు రాలేదు. అది కూడా వారం తరువాత తాపీగా విడుదల చేయడంపై సందేహాలు ముసురుకుంటున్నాయి. ఈవీఎంలు ధ్వంసమైన మిగిలిన ఆరు వీడియోలను ఎన్నికల సంఘం ఇప్పటికీ బయట పెట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీడియోను తాము రిలీజ్ చేయలేదని పోలీసులు, రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. పలువురు అధికారులపై సస్పెన్షన్ వేటు పడిన తరువాత విదేశాల్లో గడుపుతున్న నారా లోకేష్ 'ఎక్స్' ఖాతా నుంచి వీడియో పోస్టు కావడం గమనార్హం. మరోవైపు ఈసీ వ్యవహరించిన తీరు కూడా వివాదాస్పదంగా మారింది. పాల్వాయి గేట్ పోలింగ్ బూత్‌లో టీడీపీ మూకలు రిగ్గింగ్ చేస్తుంటే ఎందుకు స్పందించలేదు? ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నా ఏమి పట్టనట్లు వ్యవహరించడం ఏమిటి? ఫిర్యాదులు అందినా ఎందుకు పట్టించుకోలేదు? అనే ప్రశ్నలకు ఈసీ జవాబు చెపాల్సి ఉంది.

తుమృకోటలో దాడులు.. ఈవీఎంలు ధ్వంసం

రెంటచింతల మండలం తుమృకోటలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన ఎస్సీ, ముస్లిం మైనార్టీలపై టీడీపీ నేతలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 203, 204, 205 పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలను ధ్వంసం చేశారు. రీపోలింగ్ జరపకుండా సాయంత్రం 4 గంటల సమయంలో కొత్త ఈవీఎంలతో తిరిగి పోలింగ్ కొనసాగించారు. ఆ సమయంలో వైఎస్సార్ సీపీ ఏజెంట్లు లేకుండా రిగ్గింగ్ చేశారు.



వీడియోను మొబైల్‌లో రికార్డు చేశారని చెప్పడానికి గల ఆధారాలు..

ఆ వీడియో వెనుక అసలు నిజాలు..

1. మే 13న పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఓటర్లను టీడీపీ మూకలు అడ్డుకున్నాయి.
2) పాల్వాయి గేట్‌లోని అన్ని బూత్‌లను ఆక్రమించి పచ్చ ముఠాలు రిగ్గింగ్ చేశాయి.
3) బ్రహ్మారెడ్డి కుట్రలను ముందే పసిగట్టి మే 11న పిన్నెల్లి ఈసీకి లేఖ రాశారు.
4) సమస్యాత్మక మాచర్లలో భారీగా పోలీసులను మోహరించాలని పిన్నెల్లి కోరారు.
5) టీడీపీ అరాచకాలకు పాల్పడినందున రీ పోలింగ్ నిర్వహించాలని పిన్నెల్లి కోరారు.
6) ప్రజాస్వామ్యాన్ని టీడీపీ ఖూనీ చేసినందున రీ పోలింగ్ జరపాల్సిందేనని అభ్యర్థిస్తూ పిన్నెల్లి మరో లేఖ రాశారు.
7) టీడీపీ కుట్రలపై మే 11న ఒక లేఖ, పోలింగ్ జరిగిన మే 13న రెండు లేఖలను పిన్నెల్లి ఈసీకి రాశారు.
8) 11 చోట్ల ఈవీఎంలు ధ్వంసం అయినట్లు ఎన్నికల అధికారి ప్రెస్ మీట్‌లో చెప్పారు.
9) టీడీపీ గూండాలు 10 చోట్ల ఈవీఎంలను ధ్వంసం చేసే ఆ వీడియోలను ఎందుకు బయట పెట్టలేదు?
10) నారా లోకేష్ ఫిర్యాదుతో 8 రోజుల తరువాత ఒక వీడియో విడుదల చేసి అరెస్టుకు ఆదేశాలిచ్చారు.

ఈసీ డేటా భద్రమేనా?

సాక్షి, నరసరావుపేట: పాల్వాయి గేట్ పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం వీడియోపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగా అది సీసీ ఫుటేజేనా? లేక మార్ఫింగ్ చేసిన వీడియోనా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వీడియో కుడివైపు పైభాగంలో మొబైల్ 5జీ సిగ్నల్, 65 శాతం బ్యాటరీ పర్సంటేజ్, అలారం ఇండికేషన్స్ కనిపించడం గమనార్హం. వీడియోలో మొత్తం నిడివి 23.52 గంటలు ఉండగా 12.06 గంటల వద్ద తమకు అవసరమైన మేరకు రెండు నిమిషాల పాటు మొబైల్‌లో రికార్డు చేసినట్టు స్పష్టమవుతోంది. ఎంతో భద్రంగా ఉండాల్సిన పోలింగ్ వెబ్ కాస్టింగ్ సమాచారం బయటకు వెళ్లడంపై సందేహాలు అలుముకుంటున్నాయి. ఈ వీడియో తొలుత నారా లోకేష్ ఎక్స్ ఖాతా, టీడీపీ సోషల్ మీడియా గ్రూప్‌లలో కనిపించింది. గ్రాఫిక్స్‌కు పెట్టింది పేరైన పచ్చ ముఠాల వీడియోను నిర్ధారించుకోకుండా, ఎలా బయటకు వచ్చిందనే విషయాన్ని పట్టించుకోకుండా ఎన్నికల సంఘం కేసు నమోదుకు ఆదేశించడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

ఓటమి బాటలో చంద్రబాబు

తప్పిన లెక్కలు.. వికటించిన వ్యూహాలు ● ఇన్నాళ్లూ బాబును గెలిపించింది 51 వేల దొంగ ఓట్లే


- రెండు విడతలుగా ఆ ఓట్ల తొలగింపు
- దీంతో ఓటమికి దగ్గరవుతూ వచ్చిన బాబు
- స్థానిక సంస్థల ఎన్నికలన్నింటిలోనూ టీడీపీ ఘోర పరాజయం
- 35 ఏళ్లుగా కుప్పం ప్రజలను నమ్మించి మోసం చేసిన వైనం
- వైఎస్సార్‌సీపీ రాకతో ప్రతి ఇంటికీ సంక్షేమం, అభివృద్ధి
- మారుతూ వచ్చిన ఓటర్ల తీర్పు.. గత ఎన్నికల్లో తగ్గిన మెజారిటీ
- ఈ దఫా ఓటమి ఖాయం అని తేలడంతో కుటుంబ సమేతంగా పరుగులు
- కుప్పంలో ఓటు, ఇల్లు లేని బాబు.. ఓటమి భయంతో ఇంటి నిర్మాణ పనులు
- ఓటుకు రూ.2 వేలు పంపిణీ చేసినా విఫల యత్నమే అంటున్న స్థానికులు

చంద్రబాబు మెజారిటీ ఇలా..	
1989 -	6,918
1994 -	56,588
1999 -	65,687
2004 -	59,588
2009 -	46,066
2014 -	47,121
2019 -	30,722

సాక్షి, తిరుపతి: ఐదేళ్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగినంత మేలు చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ జరగలేదని, అందుకే కుప్పం ప్రజలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటెత్తారని స్పష్టమవుతోంది. 35 ఏళ్ల పాటు మాయ మాటలతో ప్రజలను నమ్మించి.. సీఎంగా, ఎమ్మెల్యేగా కొనసాగిన చంద్రబాబును కుప్పం ఓటర్లు ఈసారి శంకరగిరి మాన్యాలకు పంపుతున్నట్లు ఈవీఎంలలో ఫ్యాన్ గుర్తుపై గట్టిగా నొక్కి చెప్పినట్లు తెలుస్తోంది. 2019 సాధారణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పం వాసులు ఇచ్చిన తీర్పే.. ఇప్పుడూ పునరావృతం కాబోతోందని సమాచారం. నాటి చంద్రబాబు.. నేటి వైఎస్ జగన్ పాలనను బేరీజు వేసుకునే ఓటర్లు ఓటెత్తారని స్పష్టమవుతోంది. సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో డీబీటీ ద్వారా 4,32,067 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.1,400 కోట్లకుపైగా జమ చేశారు. నాన్ డీబీటీ ద్వారా మరో 3,03,080 మంది లబ్ధిదారులకు రూ.1,175.21 కోట్లు అందించారు. కుప్పం వాసులకు కలగా మారిన కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు కృష్ణా జలాలు తీసుకొచ్చారు. చంద్రబాబు ఉన్నన్ని రోజులు అదిగో ఇదిగో అంటూ కాలం గడిపేశారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక హంద్రీ–నీవా సృజల స్రవంతిలో భాగంగా రూ.560.29 కోట్లతో కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను పూర్తి చేసి కృష్ణా జలాలను తీసుకొచ్చి కలను నిజం చేశారు.

బాబును గెలిపిస్తూ వచ్చింది దొంగ ఓట్లే

చంద్రబాబు 1989 నుంచి కుప్పంలో గెలుపొందుతూ వచ్చారు. కుప్పం వాసుల అమాయకత్వంతో పాటు పక్కనే ఉన్న కర్ణాటక, తమిళనాడుకు చెందిన 52 వేల మంది పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చి.. దొంగ ఓట్లు వేయించుకోవడమే ఇందుకు కారణం. 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఐఏఎస్ అధికారి చంద్రమౌళి.. బాబు దొంగ ఓట్ల బాగోతాన్ని బయటపెట్టారు. ఎన్నికల సమయంలో కర్ణాటక, తమిళనాడు నుంచి జనం భారీగా తరలివచ్చి, ఓట్లు వేసి వెళ్లటం గమనించిన చంద్రమౌళి దొంగ ఓట్లపై విచారణ జరిపించారు. అధికారుల విచారణలో దొంగ ఓట్లు ఉన్నట్టు తేలడంతో ఇదివరకు 18 వేల ఓట్లు, ఈ ఎన్నికలకు ముందు 33 వేల ఓట్లు తొలగించారు. దొంగ ఓట్లను తొలగించటంతో పాటు కుప్పం వాసులు చైతన్య వంతులు కావటంతో చంద్రబాబుకు భయం పట్టుకుంది.



చంద్రబాబు 35 ఏళ్ల కుప్పం ప్రస్థానంలో జరిగిన ఎన్నికల్లో వచ్చిన ఓట్లు, సీట్లను బట్టి చూస్తే గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ గట్టి పట్టు సాధించిందని స్పష్టమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లను, ఇటీవల తొలగించిన 33 వేల టీడీపీ దొంగ ఓట్లను పరిగణనలోకి తీసుకుంటే, మే 13న జరిగిన ఎన్నికలో కుప్పం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భరత్ గెలుపు వాకిట నించున్నారని తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, మద్దతుదారులకు వచ్చిన ఓట్లకంటే కేవలం 3 – 4 వేల ఓట్లు (0.02%) మాత్రమే అదనంగా అవసరం. అయితే భారీగా టీడీపీ దొంగ ఓట్లకు చెక్ పడటంతో కుప్పంలో చంద్రబాబు నాయుడు ఓడిపోబోతున్నారని స్పష్టమవుతోంది. ఇటు ఓటర్లు, అటు రాజకీయ విశ్లేషకులు, పలు సర్వే నివేదికలు చెబుతున్న వాస్తవం ఇది.

కుటుంబ సమేతంగా కుప్పానికి పరుగు

- కుప్పంలో 2014 ముందు ఒక లెక్క. ఆ తర్వాత ఒక లెక్క అన్న చందంగా మారింది. వైఎస్సార్ సీపీ రానంత వరకు అన్ని గ్రామాల్లో చంద్రబాబు చెప్పిందే శాసనంలా సాగింది. భయపెడుతూ.. బెదిరిస్తూ ప్రత్యర్థి లేకుండా జాగ్రత్త పడుతూ వచ్చారు. 2014లో వైఎస్సార్‌సీపీ అడుగు పెట్టడంతో షాక్‌ల మీద షాక్‌లు తగలటం మొదలయ్యాయి.
- బాబు అండ్ కో బ్యాచ్ అరాచకాలను జీర్ణించుకోలేని స్థానికులు ప్రతిగ్రామంలో టీడీపీకి పోటీగా వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేయటం ప్రారంభించారు. 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో మొదటి రెండు రౌండ్లలో టీడీపీ అభ్యర్థి కంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థికే మెజారిటీ ఓట్లు నమోదవ్వటంతో చంద్రబాబు షాక్‌కు గురయ్యారు. 2019 తర్వాత జరిగిన స్థానిక సంస్థలకు జరిగిన అన్ని ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, మున్సిపల్ చైర్మెన్ అంతా వైఎస్సార్‌సీపీ మద్దతు దారులే గెలుపొందటంతో చంద్రబాబు మైండ్ బ్లాక్ అయ్యింది.
- 35 ఏళ్లుగా కుప్పంలో ఇల్లు కట్టుకోవాలనే ఆలోచనే చేయని చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ నేతల మాటలతో జ్ఞానోదయం అయింది. ఎట్టకేలకు ఇంటి నిర్మాణం చేపట్టారు. కుప్పానికి చుట్టపు చూపుగా వచ్చి వెళ్లే చంద్రబాబు.. 2019 ఎన్నికల తర్వాత కుటుంబ సమేతంగా పరుగులు పెట్టారు.
- కుమారుడు లోకేశ్, సతీమణి భువనేశ్వరి సైతం కుప్పం దారిపట్టారు. ఓటమి భయంతోనే లోకేశ్ తన పాదయాత్రను కుప్పం నుంచి ప్రారంభించి అభాసుపాలయ్యారు. నారా భువనేశ్వరి ఇటీవలి కాలంలో రెండు పర్యాయాలు కుప్పానికి వచ్చి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో చంద్రబాబు నామినేషన్ వేయటానిక్కూడా కుప్పానికి వచ్చిన దాఖలాలు లేవు. స్థానిక నాయకులే చందాలు వేసుకుని ఆయన తరుపున నామినేషన్ వేసేవారు. అటువంటిది ఈసారి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నేరుగా కుప్పానికి చేరుకుని, సొంత డబ్బులతో నామినేషన్ వేశారు.

ఓటుకు రూ.2 వేలు పంపిణీ

చంద్రబాబు గతంలో కుప్పంలో ఓటర్లకు పెద్దగా డబ్బులు ఇచ్చిన దాఖలాలు లేవు. స్థానిక నాయకులే అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా సంపాదించిన సొమ్ములో నుంచి ఓటుకు రూ.200 లేదా రూ.300 పంపిణీ చేసేవారు. ఈ నగదు కూడా ఓటర్లందరికీ ఇచ్చేవారు కాదు. సగం ఓటర్లకు ఇచ్చి మిగిలిన సగం నగదు నొక్కేసి అందరికీ పంపిణీ చేశామని లెక్క చూపేవారని ఆరోపణలు ఉన్నాయి. అటువంటి చంద్రబాబు ఈ ఎన్నికల్లో మే 10, 11, 12 తేదీల్లో ఒక్కో ఓటుకు రూ.2 వేలు చొప్పున డబ్బులు పంపిణీ చేశారు. ఈ నగదును చంద్రబాబే స్వయంగా పంపించారని స్థానిక టీడీపీ నేతలు చర్చించుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చారని, ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాల ద్వారా కుటుంబ ఆర్థిక పురోభివృద్ధికి దోహద పడ్డారని, కుప్పాన్ని అభివృద్ధి చేసినందుకే తాము ఫ్యాన్ గుర్తుకు ఓటేశామని అత్యధికులు స్పష్టం చేస్తున్నారు.



దీప్తి జివాంజీ

కలకు సాధన తోడైంది

కలకు సాధన తోడైతే చాలు మిగతావన్నీ వాటికవే వచ్చి చేరతాయి. ఈ మాట నా విషయంలో అక్షర సత్యం అంటోంది దీప్తి జివాంజీ. తెలంగాణలోని వరంగల్ వాసి అయిన దీప్తి జివాంజీ దినసరి కూలీ కుమార్తె. జపాన్‌లో జరుగుతున్న ప్రపంచ పారా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ మహిళల విభాగంలో సోమవారం 400 మీటర్ల పరుగులో ప్రపంచ రికార్డు సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా 21 ఏళ్ల దీప్తిని పలకరిస్తే ఇలా సమాధానమిచ్చింది.

అథ్లెటిక్ చాంప్ దీప్తితో మాటామంతి

■ క్రీడలే ప్రధానంగా!

నా చిన్నప్పుడు స్కూల్‌లో పీఈటీ సర్ చెప్పిన విధంగా ప్రాక్టీస్ చేసేదాన్ని. అప్పుడే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే దాన్ని. నాకు చిన్నతనంలో తరచూ ఫిట్స్ వస్తుండేవి. రన్నింగ్ చేసేటప్పుడు బాడీ షేక్ అయ్యేది. దీంతో మా పీఈటీ సర్ పారా అథ్లెట్స్‌తో మాట్లాడి, టెస్టులు చేయించారు. వారితో మాట్లాడి 'ఇక పారా అథ్లెట్స్ గ్రూప్‌లో పాల్గొనమ'ని చెప్పారు. మా అమ్మనాన్నలది మేనరికం కావడం వల్ల జన్యుపరమైన సమస్యలు వచ్చాయని తెలిసింది. అక్కణ్ణుంచి పారా అథ్లెటిక్ కాంపిటిషన్‌లో పాల్గొంటూ వచ్చాను. ఖమ్మంలో స్టేట్ మీట్ జరిగినప్పుడు అందులో పాల్గొన్నాను. మెడల్ రావడంతో అక్కణ్ణుంచి నా జీవితంలో క్రీడలు ప్రధాన భాగంగా మారిపోయాయి. డిగ్రీలో చేరాను కానీ, అప్పటికి ఇంకా పరీక్షలు రాయడం పూర్తి చేయలేదు.

■ బలహీనతలను అధిగమించేలా..

స్పోర్ట్స్‌లో పాల్గొనడం వల్ల ఒక ఆరోగ్యపరమైన సమస్యను ఆ విధంగా అధిగమించాను అనుకుంటాను. చిన్నప్పుడు మా చుట్టుపక్కల ఈ ఆటలు నీకు అవసరమా అన్నట్టు మాట్లాడేవారు. కానీ, కానీ, మా అమ్మ మాత్రం 'అవన్నీ పట్టించుకోవద్దు. నీవనుకున్నదానిపైనే దృష్టి పెట్టు. ఈ రోజు నిన్ను అన్నవాళ్లే రేపు నీ గురించి గొప్పగా చెప్పుకుంటారు' అని చెప్పేది. ఆ విధంగా మానసిక ధైర్యం కూడా పెరిగింది. స్పోర్ట్స్ అన్ని బలహీనతలను దూరం చేస్తుందని.. గెలిచినా, ఓడినా.. ఎప్పుడూ పాఠాలు నేర్చుకుంటూనే ఉంటామని నమ్ముతాను. ఇప్పటివరకు నాలుగు వరల్డ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నాను. నాకు సాయం చేయడానికి దాతలు ముందుకు వస్తున్నారు.

■ ధైర్యమే బలం

మా ఇంటి పరిస్థితులు ఎప్పుడూ కష్టంగానే ఉండేవి. మా అమ్మ ధనలక్ష్మి కూలి పనులకు వెళుతుంది. నాన్న


కుటుంబ సభ్యులతో దీప్తి

పైపుల కంపెనీలో పనిచేస్తాడు. చెల్లెలు స్కూల్‌కు వెళుతుంది. ఉండటానికి మాకు కనీసం అద్దె ఇల్లు కూడా ఉండేది కాదు. మొన్న మొన్నటి వరకు మా అమ్మమ్మ వాళ్లింటోనే ఉన్నాం. ఎన్నో అవమానాలూ ఎదుర్కొన్నాం. ఈ మధ్య ఆ ఇంటినే కొనుగోలు చేశాం. ఇక బలమైన ఆహారం అంటే స్పోర్ట్స్ అకాడమీలోకి వచ్చిన తర్వాతే అని చెప్పుకోవాలి. అమ్మ ఎప్పుడూ చెప్పే విషయాల్లో బాగా గుర్తుపెట్టుకునేవి కొన్ని ఉంటాయి. వాటిలో 'కష్టపడితే ఏదీ వృథా పోదు. నీకు నువ్వు ధైర్యంగా నిలబడాలి. అప్పుడే నిన్ను కాదని వెళ్లిపోయినవి కూడా నీ ముందుకు వస్తాయి' అంటుంది. మొన్న జపాన్‌లో జరిగిన పారా ఒలింపిక్‌లో బంగారు పతకం సాధించిన విషయం చెప్పినప్పుడు అమ్మ చాలా సంతోషించింది. నా బలం మా అమ్మే. ఆమె ఏమీ చదువుకో లేదు. కానీ, ధైర్యంగా ఎలా ఉండాలో చెబుతుంది. ఆడపిల్లలమైనా మేం బాగా ఎదగాలని కోరుకుంటుంది.

■ ప్రాక్టీస్ మీదనే దృష్టి

టీవీ కూడా చూడను. పొలిటికల్ లీడర్స్‌కు సంబంధించి వచ్చే సాంగ్స్ వింటుంటాను. ఆ పాటల్లో స్ఫూర్తిమంతమైన పదాలు ఉంటాయి. హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఉంటున్నాను. మరో మూడు నెలల్లో ఒలపింక్స్ లో పాల్గొనబోతున్నాను. దేశం తరపున పాల్గొనబోతున్నాను కాబట్టి నా దృష్టి అంతా ప్రాక్టీస్ మీదనే ఉంది. సాధారణంగా ఉదయం రెండు గంటలు; సాయంత్రం రెండు గంటలు ప్రాక్టీస్ ఉంటుంది. మధ్యలో మా రోజువారీ పనులు, విశ్రాంతికి సమయం కేటాయిస్తాం. నాతో పాటు ఉన్న స్నేహితులతో చిట్ చాట్ ఉంటుంది.

■ బాధ్యతగా ఉండాలి

చిన్నప్పటి నుంచి అమ్మనాన్నల కష్టం చూస్తూ పెరగడం వల్ల సొంతంగా ఇష్టాలు, అభిరుచులు అనే ధ్యాస ఏమీ లేదు. కానీ, చిన్నప్పటి నుంచి పోలీసు కావాలనేది నా కల. ఇప్పటికీ అదే ఆలోచన. నా కృషి నేను చేస్తున్నాను. నేను కోరుకున్నది వస్తుందనేది నా నమ్మకం. అమ్మనాన్నలు ఇంకా కష్టపడుతూనే ఉన్నారు. పోలీసుని అయి మా అమ్మ నాన్నలను, చెల్లెలిని బాగా చూసుకోవాలి, అది నా బాధ్యత అనుకుంటున్నాను'' అంటూ ముగించింది దీప్తి.

ఆమె ఆశలు, ఆశయాలు నెరవేరాలని కోరుకుందాం.

– నిర్మలారెడ్డి

ఆస్ట్రేలియాలో 'బేర్‌ఫుట్ వాకింగ్'
ఇప్పుడు చాలామంది అలవాటు చేసుకుంటున్నారు.
ఉత్తకాళ్లతో నడవడం
భారతీయులకు వేల ఏళ్లుగా తెలిసినా
ఆ తర్వాత వ్యాయామ నడక కోసం తగిన షూస్,
చెప్పులు తప్పనిసరిగా ఉపయోగిస్తున్నారు.
కాని 'భూమితో పాదాలను తాకించడం' వల్ల
ఆరోగ్యమని ఇంకా ప్రయోజనాలున్నాయని
నిపుణులు అంటున్నారు.
ఉత్తకాళ్ల నడక ప్రయోజనాలేమిటి?

ఈ నడక ఆరోగ్యం అంటున్నారు



ఆస్ట్రేలియాలో ఉత్త కాళ్లతో నడవడం ఇప్పుడు ఒక వ్రతంలా పాటిస్తున్నారు. కొందరు మార్నింగ్ వాక్ కోసం ఉత్త కాళ్లను ఉపయోగిస్తుంటే మరికొందరు ఎల్లవేళలా చెప్పులు, షూస్‌కు దూరంగా ఉంటున్నారు. ఇదొక పెద్ద ధోరణిగా మారిందక్కడ. మన దేశంలో చెప్పుల్లేని పాదాలతోనే జనం నడిచారు. ఇప్పటికీ నడిచేవారున్నారు. కాని ఆరోగ్య చర్యల్లో భాగంగా చెప్పుల్లేకుండా భూస్పర్శను పొందడం అనేది మెల్లమెల్లగా మన దేశంలోనూ కనిపిస్తోంది. గతంలో చూస్తే చిత్రకారుడు ఎం.ఎఫ్.హుసేన్ తన జీవితంలో ఎప్పుడూ చెప్పులు వేసుకోలేదు. ఆయన ఎన్ని దేశాలు తిరిగినా ఖాళీ పాదాలతోనే తిరిగాడు. ఇక ఇటీవల యువ దర్శకుడు అనుదీప్ ఖాళీ పాదాలతో నడకను ప్రచారం చేస్తున్నాడు. ఆస్ట్రేలియా వారైనా గానీ, ఇలా నడవడాన్ని ఇష్టపడుతున్నవారు గానీ చెబుతున్నదేమిటి? ఇలా నడవడం వల్ల ఉపయోగాలేమిటి?

ట్రెండ్



ఎక్కడ నడవాలి: ఉత్తపాదాలతో నడిచే వారు కూసు రాళ్లు లేదా ముళ్లు లేని మట్టి బాటల్లోగాని, గడ్డి మైదానంలోగాని, ఇసుక దారుల్లో గాని నడవడం మంచిదని నిపుణులు అంటున్నారు. సూపర్ మార్కెట్‌లో లేదా నున్నటి రాళ్లు పరిచిన స్థలాల్లో నడిస్తే జారి పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

1. ప్రకృతితో అనుసంధానం

ప్రకృతిలో పుట్టిన మనిషి ప్రకృతితో అనుసంధానం కావడం లేదు. ప్రకృతి స్పర్శను అనుభవించడం లేదు. ఏసీ గదుల్లో ఉంటూ కాలికి నేలంటకుండా జీవిస్తున్నాడు. నేల తగిలితే– కాలి కింద భూమికి ఉన్న రకరకాల స్వభావాలు అంటుతూ ఉంటే ప్రకృతితో ఒక అనుసంధానం ఏర్పడుతుంది. వినమ్ర భావన కలుగుతుంది. ఇంకా మామూలు భాషలో చెప్పాలంటే కళ్లు నెత్తికెక్కి ఉంటే అవి కిందకు దిగుతాయి.

2. విద్యుదయస్కాంత సమతుల్యత

ఖాళీ పాదాలతో నడవడం వల్ల భూమిలోని నెగెటివ్ అయాన్లు శరీరంలోకి ప్రవేశిస్తాయి. మనం నిత్యం వాడే ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ వల్ల శరీరంలో పేరుకున్న అయాన్లను ఇవి బేలెన్స్ చేస్తాయి. దాని వల్ల శరీరంలోని విద్యుదయస్కాంత స్థితి సమతుల్యం అవుతుంది. దీంతో వాపులు తగ్గడం, నిద్ర బాగా పట్టడం వీలవుతుంది.

3. ఒత్తిడి దూరం

ఖాళీ పాదాలతో నడవడం వల్ల పాదాలలో ఉండే నరాలు క్రమబద్ధంగా తాకిడికి లోనవుతాయి. దాని వల్ల ఒత్తిడి దూరమయ్యి సేదదీరిన భావన కలుగుతుంది.

4. సరైన పోశ్చర్

ఖాళీ పాదాలతో నడిచినప్పుడు పాదాలు, కాళ్లు, మడమలు అనుసంధానంలోకి వస్తాయి. చెప్పులు లేదా షూస్ వేసుకుని నడిచేటప్పుడు తెలియకనే నడక పోశ్చర్ మారుతుంది. కాని ఖాళీ పాదాలతో నడిచేటప్పుడు నడకకు వీలుగా శరీరం సరైన పోశ్చర్‌కు వస్తుంది. అంతేకాదు కాలి కండరాలు బలపడతాయి. శరీరాన్ని సరిగ్గా బేలెన్స్ చేస్తూ నడవడం తెలుస్తుంది. కాళ్లను పూర్తిగా ఆన్చి నడవడం వల్ల నడకలో కుదురు వస్తుంది.

5. రక్తప్రసరణ

ఖాళీ పాదాలతో నడవడం వల్ల రక్తప్రసరణ బాగా జరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. పాదంపై ఒత్తిడి పడటం వల్ల రక్తప్రసరణలో చురుకు వచ్చి గుండెకు మేలు జరుగుతుంది. అంతేకాదు పాదాలపై ఉండే మృతకణాలు వదిలిపోయి చర్మం మెరుగవుతుంది.

తాబేలు నడకల గురించి తక్కువ చేసి నవ్వుకునే కాలం కాదు ఇది.
ప్రమాదం అంచున ఉన్న తాబేలు జాతి గురించి సీరియస్‌గా మాట్లాడుకోవాల్సిన సమయం ఇది.
చెన్నైకి చెందిన సుప్రజ నుంచి లక్నోకు చెందిన అరుణిమ సింగ్ వరకు ఎంతోమంది నారీమణులు
తాబేళ్ల సంరక్షణకు విశేష కృషి చేస్తున్నారు...

నేడు ప్రపంచ తాబేలు దినోత్సవం

నారి... తాబేలు మేలు కోరి


సౌందర్య

చుట్టుపక్కల చూడరా...

ముంబైకి చెందిన మోడల్ సౌందర్య గార్గ్ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ కార్యాలయానికి సమీపంలోని చెత్తకుప్పలో ఒక ప్లాస్టిక్ బ్యాగ్ కదలడం చూసి ఆ బ్యాగును ఓపెన్ చేసింది. అందులో చావు బతుకుల మధ్య ఊగిసలాడుతున్న ఒక పెద్ద తాబేలు కనిపించింది. వెంటనే ప్లాంట్ అండ్ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ హెల్ప్ లైన్‌కు ఫోన్ చేసింది. అక్కడి నుంచి వచ్చిన వాలంటీర్ సూచనలతో తాబేలును ఇంటికి తీసుకెళ్లి నీటిలో పెట్టింది. ఆ తరువాత ఆ తాబేలును పాస్–రెస్క్యూ టీమ్‌కు అప్పగించింది. 'నేను–నా పని అని మాత్రమే... అని కాకుండా చుట్టుపక్కల కూడా తొంగి చూడాలి. ఇంటికి వెళ్లడానికి ఆలస్యం అవుతుందని ఆరోజు సౌందర్య అనుకొని ఉంటే, తాబేలే కదా వదిలేద్దాం అనే నిర్లక్ష్యంలో ఉండి ఉంటే ఒక జీవి బతికేది కాదు' అంటుంది యానిమల్ వెల్ఫేర్ ఆఫీసర్ నిషా సుబ్రమణ్యియన్.

దిల్లీలో మార్నింగ్ వాక్‌కు వెళుతున్న ఒక మహిళ రోడ్డుపై తాబేలును గమనించి రక్షించింది. దీని తాలూకు వీడియో వైరల్ కావడమే కాదు నీటిలో ఉండాల్సిన తాబేళ్లు రోడ్డు మీదికి ఎందుకు వస్తున్నాయి? వాటిని రక్షించడానికి ఏంచేయాలి?' అనే విషయం మీద సోషల్ మీడియాలో చర్చ కూడా జరిగింది.


ఆ విషాదంలో నుంచే...

కొన్ని సంవత్సరాల క్రితం ప్రపంచ ప్రఖ్యాత పర్యావరణవేత్త డా.జేన్ గుడాల్‌పై వచ్చిన నేషనల్ జియోగ్రాఫిక్ డాక్యుమెంటరీని చూసింది చెన్నైకి చెందిన సుప్రజ ధరణి. 'ప్రతి ఒక్కరు తమవంతుగా కృషి చేస్తే పర్యావరణానికి మేలు జరుగుతుంది' అనే మాట ఆమెకు బాగా నచ్చడమే కాదు 'నా వంతుగా ఏం చేయగలను' అని ఆలోచించింది.

ఒకరోజు పెరియ నీలంకరై బీచ్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న సుప్రజ ఒడ్డున కనిపిస్తున్న తాబేలు దగ్గరికి వెళ్లింది. అది చనిపోయి ఉంది. దాని శరీరంపై పదునైన తీగలతో కోతలు కోశారు. ఈ దృశ్యం తనని చాలా బాధ పెట్టింది. ఒక రకంగా చెప్పాలంటే కొన్ని రోజుల వరకు ఆ బాధ తనని వెంటాడింది.

ఈ నేపథ్యంలోనే తాబేళ్ల సంరక్షణకు నడుం బిగించింది. పుస్తకాలు చదవడం, మత్స్యకారులతో మాట్లాడం ద్వారా తాబేళ్ల గురించి ఎన్నో విషయాలు తెలుసుకుంది. ఆ తరువాత ట్రీ ఫౌండేషన్ (ట్రస్ట్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, ఎడ్యుకేషన్, కన్జర్వేషన్ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్)కు శ్రీకారం చుట్టింది.

తాబేళ్ల సంరక్షణ విషయంలో చేసిన కృషికి గుర్తింపుగా డిస్నీ వరల్డ్ వైడ్ కన్జర్వేషన్ అవార్డ్, సీ వరల్డ్‌లాంటి ఎన్నో అవార్డ్‌లు అందుకుంది సుప్రజ.


విజయ

విజ్జీ–ది టర్టిల్ గర్ల్

భారతదేశ మొట్టమొదటి మహిళా హెర్పెటాలజిస్ట్, టర్టిల్ ఫీల్డ్ బయాలజిస్ట్‌గా గుర్తింపు పొందింది జె.విజయ. చిన్న వయసులోనే చనిపోయింది. అయితే ఆమె తన జీవితంలో ఎక్కువ భాగం తాబేళ్ల సంరక్షణ కోసం కృషి చేసింది. మద్రాస్ క్రొకొడైల్ బ్యాంక్ పక్కన ఉన్న టర్టిల్ పాండ్ దగ్గర ఆమె స్మారక చిహ్నం ఉంది. మద్రాస్ స్నేక్ పార్క్‌లోకి వాలంటీర్‌గా అడుగుపెట్టింది విజయ. అప్పుడు ఆమె మద్రాస్‌లోని ఎతిరాజ్ కాలేజీ జువాలజీ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్. స్నేక్‌పార్క్‌లో రకరకాల తాబేళ్లను వేరు వేరు వ్యక్తులకు అప్పగించేవారు. అలా విజ్జీకి మంచినీటి తాబేళ్లను అప్పగించారు. అక్కడితో మొదలైన తాబేళ్లతో చెలిమి ఎంతో దూరం వెళ్లింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ నుంచి పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తా వరకు తాబేళ్లకు ఎదురవుతున్న ముప్పు, సంరక్షణ గురించి ఎంతో పరిశోధన చేసింది. తాను తెలుసుకున్న వాటిని అక్షరబద్ధం చేసింది.


సుప్రజ

అరుణోదయం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన అరుణిమ సింగ్ వేలాది తాబేళ్లను రక్షించింది. తాబేళ్ల జీవితం, వాటి ప్రాధాన్యత, సంరక్షణ గురించి ఎన్నో విద్యాలయాల్లో విద్యార్థుల కోసం అవగాహన సదస్సులు నిర్వహించింది. తాబేళ్ల సంరక్షకురాలిగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన అరుణిమ సింగ్ తన బాటలో ఎంతోమందిని నడిపిస్తోంది.


అరుణిమ

గ్రీన్ టర్టిల్స్ ... మీరు పచ్చగా బతకాలి

ఆకుపచ్చ తాబేళ్లు (చెలోనియా మైడాస్) ప్రమాదం అంచున అంతరించిపోయే జాతుల జాబితాలో ఉన్నాయి. లక్షద్వీప్ దీవుల్లో ఆకుపచ్చ తాబేళ్లపై గతంలో జరిగిన పరిశోధనలను పీహెచ్‌డీ స్టూడెంట్ నుపుల్ కాలే మరింత ముందుకు తీసుకువెళుతోంది. సముద్రపు గడ్డి మైదానాలు తగ్గడంలాంటివి గ్రీన్ టర్టిల్స్‌పై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుంది అనేది తన పరిశోధనలో తెలుసుకుంది. 'సముద్ర తాబేళ్ల గురించి అధ్యయనం చేయడానికి ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి' అంటుంది కాలే. యూనివర్శిటీలో ఒకరోజు 'గ్రీన్ టర్టిల్స్ గురించి పనిచేయడంపై ఆసక్తి ఉందా?' అని అడిగారు లెక్చరర్. 'ఉంది' అని చెప్పింది. ఆ తరువాత గ్రీన్ టర్టిల్స్‌కు సంబంధించి శ్రీలంకలో ఫీల్డ్‌వర్క్ చేసింది.'గూడు కట్టుకోవడానికి ఒక గ్రీన్ టర్టిల్ బీచ్‌లోకి వచ్చిన దృశ్యం తొలిసారిగా చూశాను. ఆ దృశ్యం చెక్కుచెదరకుండా ఇప్పటికీ నా మదిలో నిలిచిపోయింది' అంటుంది కాలే.


నుపుల్ కాలే



వింబుల్డన్ మెయిన్ 'డ్రా'లో సుమిత్ నగాల్

భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్ తన కెరీర్‌లో తొలిసారి ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మెయిన్ 'డ్రా'కు నేరుగా అర్హత సాధించాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీ ప్రారంభానికి ఆరు వారాల ముందు ఏటీపీ ర్యాంకింగ్స్‌లో టాప్–104లో ఉన్న క్రీడాకారులకు నేరుగా మెయిన్ 'డ్రా'లో చోటు లభిస్తుంది. సుమిత్ నగాల్ ప్రస్తుతం 94వ ర్యాంక్‌లో ఉన్నాడు. 2019లో చివరిసారి భారత్ తరఫున ప్రజ్నేశ్ గుణేశ్వరన్ వింబుల్డన్ టోర్నీలో పాల్గొన్నాడు.

అర్జున్‌కు తొమ్మిదో స్థానం

షార్జా మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తొమ్మిదో స్థానంలో నిలిచాడు. బర్దియా దానేశ్వర్ (ఇరాన్)తో జరిగిన చివరిదైన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను అర్జున్ 47 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. అర్జున్‌తోపాటు మరో ఏడుగురు 6 పాయింట్లతో ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... అర్జున్‌కు తొమ్మిదో స్థానం ఖరారైంది. పంక్‌లాండ్ (అమెరికా), వొఖిదోవ్ (ఉజ్బెకిస్తాన్), బర్దియా, ముర్జిన్ (రష్యా) 6.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు.



రాయల్స్ ముందుకు...
చాలెంజర్స్ ఇంటికి...

అసాధారణ రీతిలో ఆరు వరుస విజయాలతో 'ప్లే ఆఫ్స్' వరకు దూసుకొచ్చిన బెంగళూరు ప్రస్థానం ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముగిసింది. 'కప్ నమ్‌దే' అంటూ కొత్త ఆశలు రేపిన టీమ్ నాకౌట్ సమరంలో కుప్పకూలి మరోసారి అభిమానులను నిరాశకు గురి చేసింది. వరుసగా నాలుగు ఓటముల తర్వాత ఎట్టకేలకు అసలు పోరులో తమ స్థాయిని ప్రదర్శించిన రాజస్తాన్ రాయల్స్ మరో అడుగు ముందుకేసి రెండో క్వాలిఫయర్‌లో సన్‌రైజర్స్‌తో సమరానికి సిద్ధమైంది. ముందుగా పదునైన బౌలింగ్‌తో బెంగళూరును కట్టిపడేసిన రాజస్తాన్ ఆ తర్వాత సాధారణ లక్ష్యాన్ని ఆరు బంతుల ముందే అందుకుంది. అక్కడక్కడా కాస్త తడబాటు కనిపించినా...ఆఖరికి గెలుపు తీరం చేరింది. 700కుపైగా పరుగులు చేసిన తర్వాత కూడా ఇక్కడే ఆగిపోయిన విరాట్ కోహ్లి చిత్రం చూస్తే చాలు ఆర్‌సీబీ దురదృష్టం ఎలాంటిదో చెప్పేందుకు!


నిరాశలో కోహ్లి

- ఎలిమినేటర్‌లో రాజస్తాన్ విజయం
- 4 వికెట్ల తేడాతో ఓడిన బెంగళూరు
- రేపు రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌తో రాజస్తాన్ 'ఢీ'


చహల్, అశ్విన్


యశస్వి జైస్వాల్

అహ్మదాబాద్: ఐపీఎల్ ఫైనల్లో స్థానం కోసం రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో రాజస్తాన్ రాయల్స్ తలపడనుంది. బుధవారం జరిగిన 'ఎలిమినేటర్' మ్యాచ్‌లో రాజస్తాన్ 4 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. రజత్ పటిదార్ (22 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (24 బంతుల్లో 33; 3 ఫోర్లు, 1 సిక్స్), మహిపాల్ లోమ్రోర్ (17 బంతుల్లో 32; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం రాజస్తాన్ 19 ఓవర్లలో 6 వికెట్లకు 174 పరుగులు సాధించి గెలిచింది. యశస్వి జైస్వాల్ (30 బంతుల్లో 45; 8 ఫోర్లు), రియాన్ పరాగ్ (26 బంతుల్లో 36; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. కీలకమైన రెండు వికెట్లు తీసిన అశ్విన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

దూకుడు లేకుండా...

బెంగళూరు ఇన్నింగ్స్ ఆరంభం నుంచి తడబడుతూనే సాగింది. కోహ్లి, డుప్లెసిస్ ఆశించిన మెరుపు ఆరంభాన్ని ఇవ్వలేకపోయారు. బౌల్ట్ తన 3 ఓవర్లలో 6 పరుగులే ఇచ్చి ప్రత్యర్థిని కట్టిపడేశాడు. డుప్లెసిస్, కోహ్లి తక్కువ వ్యవధిలో వెనుదిరిగిన తర్వాత కామెరాన్ గ్రీన్ (21 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని పరుగులు జోడించాడు. అయితే గ్రీన్, మ్యాక్స్‌వెల్ (0)లను వరుస బంతులకు అవుట్ చేసి అశ్విన్ దెబ్బ కొట్టాడు. ఈ దశలో పటిదార్ ఇన్నింగ్స్ ఆర్‌సీబీని ముందుకు నడిపించింది. 5 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద జురేల్ సునాయాస క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన పటిదార్ కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. చహల్ ఓవర్లో అతను 2 సిక్స్‌లు, ఫోర్ బాదడంతో స్కోరు వంద పరుగులు దాటింది. తన చివరి ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో దినేశ్ కార్తీక్ (11) విఫలం కాగా, చివర్లో లోమ్రోర్ ధాటిగా ఆడాడు.

రాణించిన జైస్వాల్...

ఛేదనను జైస్వాల్, టామ్ కోలర్ (20) జాగ్రత్తగా మొదలు పెడుతూ తొలి 2 ఓవర్లలో 6 పరుగులే చేశారు. అయితే యశ్ దయాళ్ వేసిన మూడో ఓవర్లో జైస్వాల్ 4 ఫోర్లు బాది జోరు మొదలు పెట్టగా, సిరాజ్ వేసిన తర్వాతి ఓవర్లో కూడా 3 ఫోర్లు వచ్చాయి. కోలర్ వెనుదిరిగిన తర్వాత జైస్వాల్, శామ్సన్ ఇన్నింగ్స్‌ను నడిపించారు. అయితే వీరిద్దరు ఐదు పరుగుల వ్యవధిలో వెనుదిరగడం, జురేల్ (8) రనౌట్ కావడంతో కొంత ఉత్కంఠ పెరిగింది. అయితే మరో ఎండ్‌లో పరాగ్ ఆకట్టుకునే ఆటతో గెలుపు భారాన్ని తీసుకున్నాడు. పరాగ్, హెట్‌మైర్ (14 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) మధ్య 45 పరుగుల భాగస్వామ్యం (25 బంతుల్లో) రాజస్తాన్‌ను విజయం దిశగా తీసుకెళ్లింది. విజయానికి చేరువైన దశలో వీరిద్దరు నిష్క్రమించినా రావ్‌మన్ పావెల్ (8 బంతుల్లో 16 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) పని పూర్తి చేశాడు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) (సబ్) ఫెరీరా (బి) చహల్ 33; డుప్లెసిస్ (సి) పావెల్ (బి) బౌల్ట్ 17; గ్రీన్ (సి) పావెల్ (బి) అశ్విన్ 27; పటిదార్ (సి) పరాగ్ (బి) అవేశ్ 34; మ్యాక్స్‌వెల్ (సి) జురేల్ (బి) అశ్విన్ 0; లోమ్రోర్ (సి) పావెల్ (బి) అశ్విన్ 32; కార్తీక్ (సి) జైస్వాల్ (బి) అవేశ్ 11; స్వప్నిల్ (నాటౌట్) 9; కరణ్ (సి) పావెల్ (బి) సందీప్ 5; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు)** 172. **వికెట్ల పతనం:** 1–37, 2–56, 3–97, 4–97, 5–122, 6–154, 7–159, 8–172. **బౌలింగ్:** బౌల్ట్ 4–0–16–1, సందీప్ శర్మ 4–0–48–1, అవేశ్ ఖాన్ 4–0–44–3, అశ్విన్ 4–0–19–2, చహల్ 4–0–43–1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) కార్తీక్ (బి) గ్రీన్ 45; టామ్ కోలర్ (బి) ఫెర్గూసన్ 20; శామ్సన్ (స్టంప్డ్) కార్తీక్ (బి) కరణ్ 17; పరాగ్ (సి) సిరాజ్ 36; జురేల్ (రనౌట్) 8; హెట్‌మైర్ (సి) డుప్లెసిస్ (బి) సిరాజ్ 26; పావెల్ (నాటౌట్) 16; అశ్విన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (19 ఓవర్లలో 6 వికెట్లకు)** 174. **వికెట్ల పతనం:** 1–46, 2–81, 3–86, 4–112, 5–157, 6–160. **బౌలింగ్:** స్వప్నిల్ 2–0–19–0, సిరాజ్ 4–0–33–2, దయాళ్ 3–0–37–0, ఫెర్గూసన్ 4–0–37–1, కరణ్ శర్మ 2–0–19–1, గ్రీన్ 4–0–28–1.

ఫైనల్లో జ్యోతి సురేఖ బృందం

ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నీ


అదితి, పర్ణీత్ కౌర్, జ్యోతి సురేఖ

యెచోన్ (దక్షిణ కొరియా): కొత్త సీజన్‌లో తమ జోరు కొనసాగిస్తూ భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు వరుసగా రెండో స్వర్ణ పతకంపై గురి పెట్టింది. ప్రపంచకప్ స్టేజ్–2 టోర్నీలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, అదితి స్వామిలతో కూడిన టీమిండియా ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీఫైనల్లో జ్యోతి సురేఖ బృందం 233–229 పాయింట్లతో అమెరికా జట్టును ఓడించింది. టీమ్ క్వాలిఫయింగ్‌లో రెండో స్థానంలో నిలువడం ద్వారా నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడిన భారత జట్టు 236–234 పాయింట్లతో ఇటలీ జట్టుపై గెలిచింది. శనివారం జరిగే ఫైనల్లో టర్కీతో భారత జట్టు పోటీపడుతుంది. షాంఘైలో గత నెలలో జరిగిన ప్రపంచకప్ స్టేజ్–1 టోర్నీలో జ్యోతి సురేఖ, పర్ణీత్, అదితి బృందం పసిడి పతకాన్ని సాధించింది. మరోవైపు ప్రియాంశ్, ప్రథమేశ్, అభిషేక్ వర్మలతో కూడిన భారత పురుషుల జట్టు కాంపౌంట్ టీమ్ విభాగంలో కాంస్య పతకాన్ని చేజార్చుకుంది. కాంస్య పతక పోరులో భారత్ 233–233తో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. స్కోరు సమం కావడంతో 'షూట్ ఆఫ్' నిర్వహించగా... 'షూట్ ఆఫ్'లోనూ రెండు జట్లు 30–30తో సమంగా నిలిచాయి. అయితే భారత ఆర్చర్లు సంధించిన బాణాల కంటే ఆసీస్ ఆర్చర్లు కొట్టిన రెండు బాణాలు కేంద్ర బిందువుకు అతి సమీపంగా ఉండటంతో ఆస్ట్రేలియాకు కాంస్య పతకం ఖరారైంది.

ప్రిక్వార్టర్స్‌లో సింధు

సిక్కి రెడ్డి–సుమీత్ జోడీ కూడా ముందంజ



కౌలాలంపూర్: భారత స్టార్ షట్లర్ విజేత పీవీ సింధు మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు 21–17, 21–16తో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత్‌కే చెందిన అష్మిత చాలిహా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరగా... ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి జోడీ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. తొలి రౌండ్‌లో సిక్కి–సుమీత్ 21–15, 12–21, 21–17తో లుయి చున్ వే– ఫు చి యాన్ (హాంకాంగ్)లపై గెలిచారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో కిరణ్ జార్జి (భారత్) 21–16, 21–17తో టకూమా ఒబయాషి (జపాన్)పై నెగ్గాడు.

'షూటౌట్'లో భారత పురుషుల హాకీ జట్టు గెలుపు



అంట్‌వర్ప్ (బెల్జియం): అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రో లీగ్‌లో భారత జట్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల జట్టు 'షూటౌట్'లో 5–4తో అర్జెంటీనాపై నెగ్గింది. నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరుజట్లు 2–2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున మన్‌దీప్ (11వ ని.లో), లలిత్ (55వ ని.లో)... అర్జెంటీనా తరఫున మార్టినెజ్ (20వ ని.లో), థామస్ డొమినె (60వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. 'షూటౌట్'లో హర్మన్‌ప్రీత్, సుఖ్‌జీత్ చెరో రెండు గోల్స్ చేయగా, అభిషేక్ ఒక గోల్ చేశాడు. రాజ్‌కుమార్, లలిత్ విఫలమయ్యారు. ప్రత్యర్థి జట్టులో మైకో రెండు గోల్స్ కొట్టగా, లుకాస్, టోబియస్ ఒక్కో గోల్ చేశారు. ముగ్గురు విఫలమవడంతో భారత్ నెగ్గింది. ఇదే వేదికపై జరిగిన మరో మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 0–5 గోల్స్‌తో అర్జెంటీనా చేతిలో ఓడింది.

సినిమా


నాగ చైతన్య

వేటకు వేళాయె...

'ప్రేమమ్, సవ్యసాచి' వంటి చిత్రాల తర్వాత హీరో నాగచైతన్య– దర్శకుడు చందు మొండేటి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న మూడో చిత్రం 'తండేల్'. ఈ మూవీలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాకి సంబంధించి ఇప్పటికే కొన్ని ఫొటోలు విడుదల అయ్యాయి. తాజాగా మరో ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు నాగ చైతన్య. ఈ ఫొటోలో పల్లెటూరి గెటప్‌లో, ఫుల్ మాస్ లుక్‌లో కనిపిస్తున్నారు. వేటకు వెళ్లడానికి సిద్ధమవుతున్నట్లుగా ఫొటోలో కనబడుతోంది. ''తండేల్'లో నాగచైతన్య మత్స్యకారుడి పాత్ర చేస్తున్నారు. ఈ పాత్ర కోసం ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకొని కంప్లీట్‌గా మేకోవర్ అయ్యారాయన. అలాగే ఈ సినిమాలో శ్రీకాకుళం యాసలో డైలాగులు పలికేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: శ్యామ్‌దత్.

నూతన నటీనటులతో...


వైవీఎస్ చౌదరి

'శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండి, సీతారామరాజు, లాహిరి లాహిరి లాహిరిలో, సీతయ్య, దేవదాసు' వంటి హిట్ చిత్రాల దర్శకుడు వైవీఎస్ చౌదరి నుంచి మరో సినిమా రానుంది. నేడు (మే 23) ఆయన బర్త్ డే. అలాగే ఆయన అభిమాన దర్శకుడు కె. రాఘవేంద్రరావు పుట్టినరోజు కూడా. ఈ సందర్భాలను పురస్కరించుకొని ఓ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టబోతున్నారు వైవీఎస్ చౌదరి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''ప్రతిభగల నూతన నటీనటులతో ఓ సినిమా తీయనున్నాను. న్యూ ఏజ్ యునిక్ కంటెంట్‌తో హై టెక్నికల్ వాల్యూస్‌తో ఈ ప్రాజెక్ట్ ఉంటుంది. ఈ సినిమాకి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే తెలియజేస్తాను'' అన్నారు.



''హాయ్ డార్లింగ్స్.. ఎలా ఉంది బుజ్జి, భైరవ గ్లింప్స్. ఎంజాయ్ చేశారా? 'కల్కి..'లో అమితాబ్ సార్, కమల్ సార్‌తో పని చేసే అవకాశం ఇచ్చిన అశ్వినీదత్‌గారికి, నాగీ (నాగ్ అశ్విన్)కి థ్యాంక్స్. హోల్ ఇండియా ఇన్‌స్పైర్ అయ్యే అమితాబ్, కమల్‌గారు లాంటి గ్రేటెస్ట్ లెజెండ్స్‌తో పని చేసే అవకాశం నాకు రావడం నా అదృష్టం'' అని హీరో ప్రభాస్ అన్నారు. ఆయన హీరోగా నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దీపికా పదుకోన్ హీరోయిన్. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు చేశారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా జూన్ 27న విడుదలవుతోంది. కాగా బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'కల్కి స్పెషల్ క్రియేటివ్ ఈవెంట్'లో సినిమాలోని బుజ్జి (కారు) పాత్రను పరిచయం చేశారు. ఈవెంట్‌లో ఈ వాహనాన్ని ప్రభాస్ నడిపారు. అనంతరం ప్రభాస్ మాట్లాడుతూ– ''నాగీ మూడేళ్లు నన్ను బుజ్జితో వేధించాడు. ఫైనల్లీ బుజ్జిని పరిచయం చేశాం. నేనేదో మన డార్లింగ్స్‌కి హాయ్ చెప్పి వెళ్లిపోదాం అనుకుంటే ఈ కార్లు.. ఫీట్లు ఏంటి సార్ (నవ్వుతూ). బుజ్జి సూపర్ ఎగ్జయిటింగ్. నేను కూడా 'కల్కి' టీజర్, సినిమా ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నాను. కమల్ సార్ 'సాగర సంగమం' సినిమా చూసి నాకలాంటి బట్టలు కావాలని మా అమ్మను అడిగాను.. అలాంటివి కుట్టించుకుని వేసుకున్నాను. ఇక ఈ వయసులో కూడా అశ్వినీదత్‌గారి ప్యాషన్ చూసి ఆయన వద్ద ఎంతో నేర్చుకోవాలనిపిస్తుంది. నాకు తెలిసి 50 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న నిర్మాత ఆయనొక్కరే. ఆయన కుమార్తెలు స్వప్న, ప్రియాంకలకు కూడా ఆయనలా ప్యాషన్, ధైర్యం ఉంది. వాళ్లు పని చేసే విధానానికి మేమంతా స్ఫూర్తి పొందుతాం అని మా సిస్టర్స్‌కి చెబుతుంటాను'' అన్నారు. ''బుజ్జి కారుని ఎంతో కష్టపడి తయారు చేయించాం. ఇందుకోసం మహీంద్ర ఆటోమొబైల్ ఇంజినీర్స్ ఎంతో శ్రమించారు'' అన్నారు నాగ్ అశ్విన్. నిర్మాతలు అశ్వినీ దత్, స్వప్నా దత్, ప్రియాంకా దత్, కృష్ణంరాజు సతీమణి శ్యామల పాల్గొన్నారు.

> 'నా జీవితంలోకి ఒక ముఖ్యమైన వ్యక్తి రాబోతున్నారు' అంటూ మీరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఎంతమంది అమ్మాయిల గుండెలు జారిపోయాయో తెలుసా? అని యాంకర్ అడగ్గా.. 'ఆ అమ్మాయిల కోసమే పెళ్లి చేసుకోలేదు' అని ప్రభాస్ నవ్వుతూ సమాధానం ఇచ్చారు.


భూతల్లి పై ఒట్టేయ్...


కమల్‌హాసన్

'శౌర..' అంటూ చైతన్య గీతం పాడారు సేనాపతి. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో విడుదలైన సూపర్ హిట్ ఫిల్మ్ 'ఇండియన్' ('భారతీయుడు'). ఈ సినిమాకు సీక్వెల్స్‌గా 'ఇండియన్ 2, ఇండియన్ 3' ('భారతీయుడు 2, 3')' సినిమాను తెరకెక్కించారు దర్శకుడు శంకర్. ఈ చిత్రంలో సేనాపతి పాత్రలో కనిపిస్తారు కమల్ హాసన్. రెడ్ జెయింట్ మూవీస్, లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం ఆడియో ఆవిష్కరణ వేడుక జూన్ 1న చెన్నైలో జరగనుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని తొలి పాటను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేశారు. 'భూతల్లి పై ఒట్టేయ్... తెలుగోడి వాడి చూపెట్టేయ్...' అంటూ సాగే తెలుగు పాట 'శౌర..'కు సుద్దాల అశోక్‌తేజ సాహిత్యం అందించగా, రితేష్ జి. రావ్, శ్రుతికా సముద్రాల పాడారు. ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ డైరెక్టర్. జూలై 12న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 'ఇండియన్ 2' చిత్రం విడుదల కానుంది.

ఆ గ్యాప్‌లో లవ్ మీ చేశా!

- ఆశిష్



ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా నటించిన చిత్రం 'లవ్ మీ'. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం ఆశిష్ విలేకర్లతో మాట్లాడుతూ– ''లవ్ మీ'లో నేను అర్జున్ అనే యూ ట్యూబర్ పాత్ర చేశాను. ఎవరైనా ఏదైనా చేయవద్దు అంటే ఆ పని చేయాలనుకునే స్వభావం నా పాత్రకు ఉన్న ఓ లక్షణం. 'లవ్ మీ'లో హారర్ అనేది ఓ భాగం మాత్రమే. ఇందులో మంచి లవ్‌స్టోరీ, చక్కని ఎమోషన్స్ ఉన్నాయి. కీరవాణి, పీసీ శ్రీరామ్ గార్లు ఈ సినిమా ఒప్పుకోవడం మా తొలి విజయంగా భావించాం. కథలో పట్టు లేకపోతే వారు ఒప్పుకునేవారు కాదు కదా. 'లవ్ మీ'కు సీక్వెల్ చేయవచ్చు. కానీ అది 'దిల్' రాజుగారి చేతిలో ఉంది. 'రౌడీ బాయ్స్' తర్వాత యాభైకి పైగా కథలు విన్నాను. అలా నా రెండో చిత్రంగా 'సెల్ఫిష్' స్టార్ట్ చేశాం. కానీ ఈ మూవీలోని క్యారెక్టర్‌ను మరింత బాగా చూపించవచ్చని కథపై మళ్లీ వర్క్ స్టార్ట్ చేశాడు ఈ చిత్రదర్శకుడు కాశీ. ఈ గ్యాప్‌లో నేను 'లవ్ మీ' చేశాను. 'సితార ఎంటర్‌టైన్‌మెంట్స్'లో సినిమా కమిట్ అయ్యా. మరో రెండు కథలు విన్నాను'' అని చెప్పుకొచ్చారు.

ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్‌లో..?


కీర్తి సురేష్

ప్రముఖ గాయని ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్‌లో హీరోయిన్ కీర్తి సురేష్ నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి తమిళ చిత్ర పరిశ్రమ వర్గాలు. మహానటి సావిత్రి బయోపిక్‌గా రూపొందిన 'మహానటి' (2018)లో తన అద్భుత నటనతో ప్రేక్షకులను కట్టిపడేశారు కీర్తి సురేష్. ఈ చిత్రానికిగాను ఉత్తమ నటిగా జాతీయ అవార్డును కూడా అందుకున్నారామె. ఆ తర్వాత రెగ్యులర్ కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియంటెడ్ చిత్రాలు చేస్తున్న కీర్తి తాజాగా ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్‌లో నటించనున్నారని భోగట్టా. ఈ సినిమా దర్శకుడు, నిర్మాణ సంస్థ వంటి వివరాలు అధికారికంగా ప్రకటించనప్పటికీ ఎంఎస్ సుబ్బలక్ష్మి పాత్రని కీర్తి సురేష్ పోషించే అవకాశాలు ఉన్నట్లు కోలీవుడ్ టాక్. తమిళనాడులోని మధురైలో ఒక మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన సుబ్బలక్ష్మి ప్రపంచమంతా కీర్తించే గాయనిగా ఎలా ఎదిగారు? ఆమె ఎదుర్కొన్న ఒడిదొడుకులు, ఆనందం, విషాద ఘటనల నేపథ్యంలో ఈ బయోపిక్ తెరకెక్కనుందట. ఈ పాత్రకి కీర్తి సురేష్ సరైన ఎంపిక అని చిత్ర యూనిట్ ఆమెను సంప్రదించగా, ఆమె పచ్చజెండా ఊపారని టాక్. కాగా ఎంఎస్ సుబ్బలక్ష్మి 2004 డిసెంబరు 11న తుది శ్వాస విడిచారు.

అందుకే నా పేరుకి బ్లూ చేర్చా!

- దీపక్ బ్లూ



అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పుష్ప: ది రూల్'. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న రిలీజ్ కానుంది. కాగా ఈ సినిమా టైటిల్ సాంగ్ 'పుష్ప పుష్ప' లిరికల్ వీడియో ఈ నెల 1న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజైంది. ఈ పాట తెలుగు, తమిళ వెర్షన్స్‌లోని కొంత భాగాన్ని ఆలపించిన సింగర్ దీపక్ బ్లూ మాట్లాడుతూ– ''నా స్వస్థలం చెన్నై. మా నాన్నగారు కొంతకాలం రేపల్లెలో ఉన్నారు. అలా నాకు తెలుగు భాషపై అవగాహన ఉంది. మా అమ్మమ్మ, మా అమ్మగార్లకు సంగీతంలో ప్రావీణ్యం ఉంది. అలా సంగీతంపై నాకు ఆసక్తి కలిగింది. మైక్రోబయాలజీలో పీజీ చదివాను. కొంతకాలం ఉద్యోగం చేస్తూనే, సింగర్‌గా ఉన్నాను. ఆ తర్వాత ఉద్యోగం వదిలిపెట్టి సింగర్‌గా బిజీ అయ్యా. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో దాదాపు మూడొందలకు పైగా పాటలు పాడాను. విజయ్ ఆంటోనీగారి 'నాన్' సినిమాలో తొలి పాట పాడాను. తేజగారి దర్శకత్వంలో వచ్చిన 'నీకు నాకు డాష్ డాష్' చిత్రంలో 'బాయ్ బాయ్' పాట పాడాను. తెలుగులో అదే నా తొలి పాట. ఆ తర్వాత 'బీరువా, పండగ చేస్కో, కిక్ 2, చుట్టాలబ్బాయి, డిక్టేటర్, ఇటీవల 'వారసుడు' చిత్రాల్లో పాటలు పాడాను. కానీ ఎన్టీఆర్ 'నాన్నకు ప్రేమతో..' చిత్రంలోని 'లవ్ దెబ్బ', రామ్‌చరణ్ 'బ్రూస్‌లీ'లోని 'మెగా మీటర్' పాటలు గుర్తింపు తీసుకువచ్చాయి. ఇక 'పుష్ప'లోని 'హే బిడ్డ..' పాట బ్యాక్‌గ్రౌండ్‌లో ఓ చిన్న వాయిస్ ఇచ్చాను. ఇప్పుడు 'పుష్ప: ది రూల్' సినిమా టైటిల్ సాంగ్ 'పుష్ప పుష్ప' పాడటం హ్యాపీగా ఉంది. ఈ పాట నా కెరీర్ బిగ్గెస్ట్ హిట్‌గా భావిస్తున్నాను. నాకు చాలా మంది సింగర్స్ స్ఫూర్తి. ఎస్పీబీగారు ప్రేరణ'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''నా పేరు దీపక్. కానీ దీపక్ పేరుతో చాలామంది సింగర్స్ ఉన్నారు. నా ఫేవరెట్ కలర్ బ్లూ. అలా నా పేరుకి బ్లూ చేర్చుకున్నాను'' అన్నారు.

సస్పెన్స్... థ్రిల్


అదా శర్మ

'ది కేరళ ఫైల్స్, బస్తర్' వంటి చిత్రాల తర్వాత అదా శర్మ నటించిన చిత్రం 'సి.డి' (క్రిమినల్ ఆర్ డెవిల్). కృష్ణ అన్నం దర్శకత్వంలో ఎస్ఎస్‌సీఎమ్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. ''హారర్, యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్ జానర్లకు ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంది. కంటెంట్, కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలు ఎక్కువగా సక్సెస్ అవుతున్నాయి. మా 'సి.డి' సినిమా కూడా ఓ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందింది. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ సినిమా మీద అంచనాలు పెంచాయి. పైగా చాలా రోజుల తర్వాత తెలుగులో అదా శర్మ నటించడంతో ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సంగీతం: ఆర్ఆర్ ధృవన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	268	74,221
నిఫ్టీ ▲	69	22,598

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,791	▽ 41
డోజోన్స్	39,721	▽ 152
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,370	▽ 46
డాక్స్	18,680	▽ 47
షాంఘై	3,159	▽ 1
నికాయ్	38,617	▽ 329

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	72,640
బంగారం (22 క్యారెట్)	69,180
వెండి (కేజీ)	99,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.91	83.93
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.77	107.33
€	యూరో	ఎస్‌బీఐ	89.37	91.74
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.80	53.96
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.65	56.59
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.54	64.19
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.31	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.45

కేంద్రంపై ఆర్‌బీఐ కనకవర్షం

2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ. 2.11 లక్షల కోట్ల రికార్డ్ డివిడెండ్

ముంబై: కేంద్రానికి రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) గత ఆర్థిక సంవత్సరానికి (2023–24) భారీగా రూ.2,10,874 కోట్ల డివిడెండ్‌ను అందించనుంది. ఆర్‌బీఐ చరిత్రలోనే ఇది రికార్డ్ కాగా.. బడ్జెట్ అంచనాలకన్నా రెట్టింపు. జీడీపీలో 0.2% నుంచి 0.3 శాతానికి సమానం. ఎన్నికల అనంతరం అధికారంలోకి రానున్న కొత్త ప్రభుత్వానికి ఆదాయపరంగా ఇది పెద్ద ఊరటనిచ్చే అంశం. ఈ మేరకు గవర్నర్ శక్తికాంత్‌దాస్ నేతృత్వంలో జరిగిన ఆర్‌బీఐ 608వ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం తాజా కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకూ కేంద్రానికి ఆర్‌బీఐ నుంచి అందిన అత్యధిక నిధుల బదలాయింపు విలువ(2018–19) రూ. 1.76 లక్షల కోట్లు. తాజా నిర్ణయాలపై ఆర్‌బీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. కొన్ని ముఖ్యాంశాలు..

- 2024–25లో ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రూ.1.02 లక్షల కోట్ల డివిడెండ్లు అందుతాయని ఈ ఏడాది ఫిబ్రవరి బడ్జెట్ అంచనావేసింది. అయితే దీనికి రెట్టింపు మొత్తాలు రావడం గమనార్హం.
- తాజా బోర్డ్ సమావేశం దేశీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించింది. వృద్ధి అవుట్‌లుక్‌కు ఎదురయ్యే సవాళ్లను, తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించింది.

ద్రవ్యలోటు, బాండ్ ఈల్డ్ తగ్గే చాన్స్...


ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కేంద్రానికి వచ్చే ఆదాయం చేసే వ్యయానికి మధ్య నికర వ్యత్యాసం– ద్రవ్యలోటు రూ.17.34 లక్షల కోట్లుగా ఉంటుందని ఫిబ్రవరి బడ్జెట్ అంచనావేసింది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ తాజా నిర్ణయం కేంద్ర ఖజానాకు పెద్ద ఊరటకానుంది. తాజా నిర్ణయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు 4 బేసిస్ పాయింట్ల వరకూ తగ్గడానికి దోహదపడే అంశం. కేంద్రంపై రుణ భారాన్ని తగ్గిస్తుంది. తద్వారా బాండ్ మార్కెట్ విషయంలో కేంద్రానికి సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. దేశ బెంచ్‌మార్క్ 10 సంవత్సరాల బాండ్ ఈల్డ్ కూడా 4 శాతం తగ్గి 7 శాతం వద్ద స్థిరపడే వీలుంది.

భారీ మిగులుకు కారణం?

అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు నేపథ్యంలో ఆర్‌బీఐ ఫారిన్ ఎక్స్ఛేంజ్ అసెట్స్ ద్వారా లభించిన అధిక వడ్డీ ఆదాయాలు ఆర్‌బీఐ భారీ నిధుల బదలాయింపులకు ఒక ప్రధాన కారణం. దేశీయ, అంతర్జాతీయ సెక్యూరిటీలపై అధిక వడ్డీరేట్లు, ఫారిన్ ఎక్స్ఛేంజ్ భారీ స్థూల విక్రయాలు కూడా ఇందుకు దోహదపడ్డాయి.

ఆర్‌బీఐ నుంచి కేంద్రానికి ఆదాయాల పెరుగుదల (రూ.కోట్లలో)

సంవత్సరం	బదలాయింపు
2012-13	33,010
2013-14	52,679
2014-15	65,896
2015-16	65,876
2016-17	30,659
2017-18	50,000
2018-19	1,76,051
2019-20	57,128
2020-21	99,122
2021-22	30,307
2022-23	87,416
2023-24	2,10,874



ఎకానమీపై భరోసాతో 6.5 శాతానికి సీఆర్‌బీఐ పెంపు

మరోవైపు సెంట్రల్ బ్యాంక్ నిధుల నిర్వహణకు సంబంధించిన కంటింజెంట్ రిస్క్ బఫర్‌ను (సీఆర్‌బీ) ఆర్‌బీఐ బోర్డ్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 6.50 శాతానికి పెంచింది. భారత్ ఎకానమీ రికవరీని ఇది సూచిస్తోంది. ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్ మొత్తంలో తన వద్ద ఎంత స్థాయిలో మిగులు నిధులను ఉంచుకోవాలి, కేంద్రానికి ఎంత మొత్తంలో మిగులును బదలాయించాలి అనే అంశంపై మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలోని కమిటీ ఒక ఎకనమిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించింది. సీఆర్‌బీఐ 5.5% - 6.5 % శ్రేణిలో ఉండాలని ఈ ఫ్రేమ్‌వర్క్ నిర్దేశించింది. దీని ప్రకారమే ఆర్‌బీఐ మిగులు బదలాయింపు నిర్ణయాలు జరుగుతాయి. ఆర్థిక పరిస్థితులు, కోవిడ్–19 మహమ్మారి వంటి పరిణామాల నేపథ్యంలో 2018–19 నుంచి 2021–22 వరకూ 5.50 శాతం సీఆర్‌బీ నిర్వహణకు ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. తద్వారా కేంద్రానికి అధిక మిగులు నిధులు అందించి ఆర్థిక పురోగతి, ఎకానమీ క్రియాశీలతకు దోహదపడాలన్నది సెంట్రల్ బ్యాంక్ ఉద్దేశం. ఎకానమీ పురోగతి నేపథ్యంలో 2022–23లో సీఆర్‌బీని 6 శాతానికి, తాజాగా 6.5 శాతానికి సెంట్రల్ బ్యాంక్ బోర్డ్ పెంచింది.

సన్ ఫార్మా లాభం అప్

- క్యూ4లో రూ. 2,655 కోట్లు
- షేరుకి రూ. 5 తుది డివిడెండ్

న్యూఢిల్లీ: సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో రూ. 2,655 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 10,931 కోట్ల నుంచి రూ. 11,983 కోట్లకు బలపడింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. అంతేకాకుండా కంపెనీ ఎండీ దిలీప్ సంఘ్వీని చైర్మన్‌గా నియమించింది. కాగా.. పూర్తి ఏడాదికి సన్ ఫార్మా నికర లాభం రూ. 9,576 కోట్లను అధిగమించింది. 2022–23లో దాదాపు రూ. 8,474 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 43,886 కోట్ల నుంచి రూ. 48,497 కోట్లకు ఎగసింది. దేశీ ఫార్ములేషన్ల అమ్మకాలు రూ. 14,889 కోట్లను దాటగా.. యూఎస్ నుంచి 185.4 కోట్ల డాలర్లు (రూ. 15,440 కోట్లు)సాధించింది.

ఈ షేరు బీఎస్‌ఈలో నామ మాత్ర లాభంతో రూ. 1,540 వద్ద ముగిసింది.

100 శాఖల ఏర్పాటులో కరూర్ వైశ్యా బ్యాంక్


చెన్నై: ప్రైవేట్ రంగ కరూర్ వైశ్యా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశవ్యాప్తంగా కొత్తగా 100 శాఖలు ఏర్పాటు చేసే యోచనలో ఉంది. అయోధ్యలో తమ 840వ బ్రాంచీ ప్రారంభం సందర్భంగా బ్యాంకు ఎండీ బి. రమేష్ బాబు ఈ విషయాలు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా 39 శాఖలు ప్రారంభించినట్లు వివరించారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,605 కోట్ల నికర లాభంతో పటిష్ట పనితీరు కనబర్చినట్లు పేర్కొన్నారు.

పవర్‌గ్రిడ్ లాభం డౌన్

- క్యూ4లో రూ. 4,166 కోట్లు
- షేరుకి రూ. 2.75 డివిడెండ్

న్యూఢిల్లీ: విద్యుత్ రంగ ప్రభుత్వ దిగ్గజం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 4 శాతం నీరసించి రూ. 4,166 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 4,323 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 12,557 కోట్ల నుంచి రూ. 12,305 కోట్లకు స్వల్ప వెనకడుగు వేసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 2.75 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇక పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 15,420 కోట్ల నుంచి రూ. 15,573 కోట్లకు నామమాత్రంగా పుంజుకుంది. మొత్తం ఆదాయం రూ. 46,606 కోట్ల నుంచి రూ. 46,913 కోట్లకు బలపడింది. బ్యాంకుల కన్సార్షియం నుంచి రూ. 5,000 కోట్ల సమీకరణకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు పవర్ గ్రిడ్ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో పవర్‌గ్రిడ్ షేరు బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 326 వద్ద ముగిసింది.



గ్లాండ్ ఫార్మా లాభం రూ. 192 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో గ్లాండ్ ఫార్మా లాభం రూ. 192 కోట్లుగా నమోదైంది. అంతక్రితం క్యూ4లో ఇది రూ. 79 కోట్లు. మరోవైపు, ఆదాయం రూ. 785 కోట్ల నుంచి రూ. 1,537 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను షేరు ఒక్కింటికి రూ. 20 చొప్పున కంపెనీ తుది డివిడెండ్ ప్రకటించింది. యూరప్‌కు చెందిన సెనెక్సీ కొనుగోలు అంశం రాబోయే రోజుల్లో గణనీయంగా ప్రయోజనాలు చేకూర్చగలదని గ్లాండ్ ఫార్మా ఎండీ ఎస్. శ్రీనివాస్ తెలిపారు.

పేటీఎంకు పెరిగిన నష్టాలు



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ కంపెనీ వన్97 కమ్యూనికేషన్స్ క్యూ4లో నికర నష్టం భారీగా పెరిగి రూ. 168 కోట్ల నుంచి రూ. 550 కోట్లకు చేరింది. పేటీఎం బ్రాండ్ కంపెనీ మొత్తం ఆదాయం 3 శాతం క్షీణించి రూ. 2,267 కోట్లకు పరిమితమైంది. యూపీఐ లావాదేవీలు తదితరాలలో తాత్కాలిక అవరోధాలు, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్(పీపీబీఎల్)కు శాశ్వత అంతరాయం కారణంగా పనితీరు దెబ్బతిన్నట్లు కంపెనీ పేర్కొంది. బ్యాంక్ భవిష్యత్ బిజినెస్‌పై అనిశ్చితి కొనసాగనున్న నేపథ్యంలో పీపీబీఎల్‌లో 39 శాతం వాటాకుగాను క్యూ4లో రూ. 227 కోట్ల పెట్టుబడులను రద్దు చేసినట్లు కంపెనీ వెల్లడించింది. ఇక మొత్తం ఆదాయం 3 శాతం క్షీణించి రూ. 2,267 కోట్లను తాకినట్లు తెలియజేశారు. 2022–23లో రూ. 2,465 కోట్ల టర్నోవర్ సాధించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇక గతేడాది నికర నష్టం రూ. 1,422 కోట్లకు చేరగా.. 2022–23లో రూ. 1,777 కోట్ల నష్టం నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో పేటీఎం షేరు బీఎస్‌ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 369 వద్ద ముగిసింది.

నిఫ్టీకి అయిదో రోజూ లాభాలు

సెన్సెక్స్ లాభం 268 పాయింట్లు



ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్(2%), ఇన్ఫోసిస్(1.50%)తో పాటు ఎఫ్‌ఎంసీజీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు బుధవారం లాభపడ్డాయి. సెన్సెక్స్ 268 పాయింట్లు పెరిగి 74,221 వద్ద ముగిసింది. నిఫ్టీ 69 పాయింట్లు బలపడి 22,598 వద్ద స్థిరపడింది. ఈ సూచీకిది అయిదో రోజూ లాభాల ముగింపు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఎఫ్‌ఎంసీజీతో పాటు రియల్టీ, ఐటీ, యుటిలిటీ, ఇంధన, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు సూచీలకు దన్నుగా నిలిచింది. ఒక దశలో ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 354 పాయింట్లు ఎగసి 74,308 వద్ద, నిఫ్టీ 101 పాయింట్లు బలపడి 22,630 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. మరోవైపు కమోడిటీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకులు, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్రిటన్‌లో అంచనాలకు మించి ద్రవ్యోల్బణ గణాంకాల నమోదు, ఫెడరల్ రిజర్వ్ సమావేశ వివరాలు వెల్లడికి ముందు(బుధవారం రాత్రి) అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-5-2024	
విశాఖ	550–00
చిత్తూరు	628–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	550–00
వరంగల్	552–00
రిటైల్ ధర	6.10

భవిత

AP & TS EAPCET 2024: Check Rank-wise College Predictor Scan QR Code

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

చక్కని కెరీర్‌కు.. చక్కెర కోర్సులు!

అడ్మిషన్స్

మనం తినే తియ్యని పదార్థాల్లో చక్కెర తప్పనిసరి. చెరకు నుంచి వచ్చే ఈ చక్కెర తయారీ వెనుక ఎంతో సాంకేతికత, మానవ శ్రమ దాగి ఉంటుంది. చక్కెర తయారీ సంస్థలకు సంబంధిత విభాగంలో నైపుణ్యం ఉన్న మానవ వనరుల అవసరం ఉంటుంది. చక్కెర రంగానికి అవసరమైన మానవ వనరులను అందించడంలో కాన్పూర్‌లోని నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్‌కు మంచి పేరుంది. ప్రస్తుతం ఈ సంస్థ పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఆయా కోర్సుల వివరాలు..

పీజీ డిప్లొమా కోర్సులు

షుగర్ టెక్నాలజీ

కోర్సు వ్యవధి: ఈ కోర్సులో మొత్తం 66 సీట్లున్నాయి. కోర్సు కాలవ్యవధి రెండున్నరేళ్లు ఉంటుంది. **అర్హత:** బీఎస్సీ ఎంపీసీ లేదా కెమికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన వారు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

షుగర్ ఇంజనీరింగ్

ఈ కోర్సులో మొత్తం సీట్ల సంఖ్య 40. కోర్సు వ్యవధి 18 నెలలు. మెకానికల్ /ప్రొడక్షన్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో బీటెక్ లేదా ఏఎంఐఈ ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

ఇండస్ట్రియల్ ఫర్మెంటేషన్ అండ్ ఆల్కహాల్ టెక్నాలజీ

ఇందులో మొత్తం 50 సీట్లు ఉన్నాయి. కోర్సు కాలవ్యవధి 18 నెలలు. **అర్హత:** బీఎస్సీలో కెమిస్ట్రీ/ అప్లయిడ్ కెమిస్ట్రీ/ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ/బయోకెమిస్ట్రీల్లో ఏదో ఒక సబ్జెక్టు చదివుండాలి. లేదా బీటెక్ బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/బయో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసుకోవాలి.

ఇండస్ట్రియల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ప్రాసెస్ కంట్రోల్

ఈ కోర్సుల్లో మొత్తం సీట్లు 17 ఉన్నాయి. **అర్హత:** ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్ తదితర విభాగాల్లో బీటెక్ లేదా ఏఎంఐఈ పూర్తిచేసి ఉండాలి.

క్వాలిటీ కంట్రోల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్

ఈ కోర్సులో మొత్తం 22 సీట్లున్నాయి. కాలవ్యవధి ఏడాది. **అర్హత:** బీఎస్సీ ఎంపీసీ లేదా బీజెడ్‌సీ లేదా బీఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ లేదా బీఎస్సీ/బీటెక్ బయోటెక్నాలజీ ఉత్తీర్ణత ఉండాలి.

సర్టిఫికేట్ కోర్సులు

షుగర్ బాయిలింగ్: ఈ కోర్సులో మొత్తం 63 సీట్లున్నాయి. పదోతరగతి ఉత్తీర్ణతతో పాటు సంబంధిత విభాగంలో అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు కాలవ్యవధి 18 నెలలు.

షుగర్ ఇంజనీరింగ్: ఈ కోర్సులో మొత్తం 17 సీట్లున్నాయి. కోర్సు కాలవ్యవధి సంవత్సరం. **అర్హత:** మెకానికల్/ప్రొడక్షన్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో డిప్లొమా ఉండాలి.

క్వాలిటీ కంట్రోల్: ఈ కోర్సులో మొత్తం 30 సీట్లున్నాయి. ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసిన వారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు కాలవ్యవధి 4 నెలలు ఉంటుంది.

ఎంపిక ఇలా

అర్హత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవేశం పొందిన వారికి స్కాలర్‌షిప్పులు, స్టైపెండ్ లభిస్తాయి. కోర్సులను పూర్తిచేసుకున్నవారు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 2024, మే 24
- పోస్ట్ ద్వారా ప్రింట్ అవుట్ స్వీకరణ గడువు: 2024, మే 31
- రాత పరీక్ష తేదీ: 2024, జూన్ 23
- పరీక్ష కేంద్రాలు:పుణె, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, కాన్పూర్, పట్నా.
- వెబ్‌సైట్: https://nsi.gov.in

త్రివిధ దళాల్లో.. కొలువు+కోర్సు

» 404 పోస్టులతో ఎన్‌డీఏ, ఎన్ఏ(2) నోటిఫికేషన్
» ఇంటర్ అర్హతతో దరఖాస్తు అవకాశం
» ఎంపికైతే కొలువుతోపాటు బీఏ, బీఎస్సీ, బీటెక్ పట్టా
» శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్

త్రివిధ దళాలు ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో చేరితే.. సమాజంలో గౌరవంతోపాటు దేశ సేవ చేస్తున్నామనే సంతృప్తి!! అంతేకాకుండా ఆకర్షణీయ వేతనం, ఉజ్వల కెరీర్ అవకాశాలు అందుకోవచ్చు. అందుకే త్రివిధ దళాల్లో కొలువు కోరుకునే వారి సంఖ్య పెరుగుతోంది. ఇంటర్మీడియెట్ అర్హతతోనే త్రివిధ దళాల్లో ఉద్యోగంతోపాటు ఉన్నత విద్యకు మార్గం.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), నేవల్ అకాడమీ (ఎన్ఏ) ఎగ్జామినేషన్!! తాజాగా.. యూపీఎస్సీ ఎన్‌డీఏ, ఎన్ఏ(2)-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్ష వివరాలు, ఎంపిక ప్రక్రియ, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీలలో యువతకు అవకాశం కల్పించే ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్షను యూపీఎస్సీ ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో విజయం సాధించి మలిదశలో మిలటరీ అకాడమీ, నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీలు వేర్వేరుగా నిర్వహించే ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలోనూ నెగ్గి తుది విజేతలుగా నిలిస్తే.. అభ్యర్థులు ఎంచుకున్న విభాగంలో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు హోదాతో కొలువుదీరొచ్చు.

మొత్తం 404 పోస్టులు

యూపీఎస్సీ ఎన్‌డీఏ, ఎన్ఏ(2)–2024 ఎగ్జామ్ ద్వారా నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీలకు సంబంధించి మొత్తం 404 పోస్టులను భర్తీ చేయనున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీలోని పోస్టులలో భాగంగానే ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లకు వేర్వేరుగా ఖాళీలను ప్రకటించారు. ఆర్మీలో 208 పోస్టులు, నేవీలో 42 పోస్టులు, ఎయిర్‌ఫోర్స్ (ఫ్లయింగ్ విభాగం)–92 పోస్టులు, ఎయిర్‌ఫోర్స్ గ్రౌండ్ డ్యూటీస్(టెక్నికల్)–18 పోస్టులు, ఎయిర్‌ఫోర్స్‌గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్)–10 పోస్టులు, నేవల్ అకాడమీ (10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్)లో 34 పోస్టులు ఉన్నాయి.

- ఆర్మీలో 10, నేవీలో 6, ఎయిర్‌ఫోర్స్‌లోని మూడు విభాగాల్లో రెండు చొప్పున 6 పోస్టులు, 10+2 క్యాడెట్ ఎంట్రీలో 5 పోస్టులను మహిళలకు కేటాయించారు.

అర్హతలు

- **ఆర్మీ వింగ్:** ఏదైనా గ్రూప్‌లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్, నేవీ, నేవల్ అకాడమీ:** మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులుగా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులవ్వాలి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2025 జూన్ 24వ తేదీ నాటికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.
- **వయసు:** జనవరి 2, 2006–జనవరి 1, 2009 మధ్యలో జన్మించి ఉండాలి.

రెండు దశల ఎంపిక

ఎన్‌డీఏ, ఎన్ఏ ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుంది. అవి.. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ. తొలి దశలో యూపీఎస్సీ ఎన్‌డీఏ, ఎన్ఏ రాత పరీక్షను నిర్వహిస్తుంది. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకుని మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు సాధించిన వారికి తదుపరి దశలో సదరు విభాగాల్లో (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) ఎస్ఎస్‌బీల ఆధ్వర్యంలో ప్రత్యేక పరీక్షలు ఉంటాయి.

శిక్షణ, డిగ్రీ సర్టిఫికెట్

ఎంపిక ప్రక్రియ రెండు దశల్లోనూ విజయం సాధించి.. తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీల్లో శిక్షణనిస్తారు. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ విభాగాలకు సంబంధించి నేషనల్ డిఫెన్స్ అకాడమీ పుణెలో, నేవల్ అకాడమీ అభ్యర్థులకు ఎజిమలలోని నేవల్ అకాడమీలో శిక్షణ ఉంటుంది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి బీఏ, బీఎస్సీ, బీటెక్ పట్టాలు కూడా అందజేస్తారు. అంటే.. ఒకే సమయంలో కొలువు, ఉన్నత విద్య రెండింటినీ సొంతం చేసుకునేందుకు అవకాశం లభిస్తుంది.

10+2 క్యాడెట్ ఎంట్రీ.. ప్రత్యేక శిక్షణ

ఎన్ఏ, 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌కు ఎంపికైన వారికి నేవల్ అకాడమీ(ఎజిమల)లో నాలుగేళ్లపాటు ప్రత్యేకంగా శిక్షణనిస్తారు. ఆ తర్వాత వీరికి అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్ సర్టిఫికెట్ అందిస్తారు.

స్టయిఫండ్

ఎన్‌డీఏ, ఎన్ఏ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి ఆయా అకాడమీల్లో ప్రవేశం ఖరారు చేసుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహకం కూడా లభిస్తుంది. అకాడమీలలో శిక్షణ సమయంలోనే నెలకు రూ.56,100 స్టైపెండ్‌గా అందిస్తారు. ఆ తర్వాత ఫీల్డ్ ట్రెనింగ్ కూడా పూర్తి చేసుకుంటే.. రూ.56,100 -రూ.1,77,500 వేతన శ్రేణితో కెరీర్ ప్రారంభం అవుతుంది.ప్రారంభంలో ఆర్మీ విభాగంలో లెఫ్టినెంట్, నేవీ విభాగంలో సబ్ లెఫ్టినెంట్,ఎయిర్‌ఫోర్స్ విభాగంలో ఫ్లయింగ్ ఆఫీసర్ కేడర్‌తో కెరీర్ ప్రారంభమవుతుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జూన్ 4
- దరఖాస్తు సవరణ అవకాశం: జూన్ 5 నుంచి 11 వరకు
- ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్ష తేదీ: 2024, సెప్టెంబర్ 1
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.upsc.gov.in

రాత పరీక్ష ఇలా

ఎన్‌డీఏ, ఎన్ఏ ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను రెండు పేపర్లలో మొత్తం 900 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో జరుగుతుంది. ఇందులో పేపర్–1 మ్యాథమెటిక్స్ 300 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు. అదేవిధంగా పేపర్ 2లో జనరల్ ఎబిలిటీ టెస్ట్ 600 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు. పేపర్–2లో పార్ట్–ఎ ఇంగ్లిష్ 200 మార్కులకు, అదే విధంగా పార్ట్–బి జనరల్ నాలెడ్జ్ 400 మార్కులకు ఉంటాయి.

పార్ట్-బిలో ఆరు విభాగాలు

పేపర్–2లోని పార్ట్–బిలో ఆరు విభాగాలు.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, హిస్టరీ, భారత స్వాతంత్ర్యోద్యమం; జాగ్రఫీ; కరెంట్ ఈవెంట్స్ నుంచి ప్రశ్నలడుగుతారు. ప్రతి విభాగానికి సంబంధించి నిర్దిష్టంగా వెయిటేజీని పేర్కొన్నారు. ఫిజిక్స్‌కు 25 శాతం, కెమిస్ట్రీకి 15 శాతం, జనరల్ సైన్స్‌కు 10 శాతం, హిస్టరీ, భారత స్వాతంత్ర్యోద్యమానికి 20 శాతం, జాగ్రఫీకి 20 శాతం, కరెంట్ ఈవెంట్స్‌కు 10 శాతం వెయిటేజీ కల్పించారు. ఈ వెయిటేజీ ప్రకారమే ఆయా విభాగాల్లో ప్రశ్నల సంఖ్య, మార్కులు ఉంటాయి.

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

- రాత పరీక్షలో విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు మలి దశలో 900 మార్కులకు ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలో పేర్కొన్న ప్రాథమ్యతలు, రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎస్ఎస్‌బీ (సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్) ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తుంది. ఎయిర్ ఫోర్స్ విభాగాన్ని ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న అభ్యర్థులు ఎస్ఎస్‌బీ తర్వాత నిర్వహించే కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్‌లో కూడా విజయం సాధించాల్సి ఉంటుంది.
- ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల్లో మానసిక, శారీరక ధృఢత్వాన్ని పరిశీలిస్తారు. ఇంటెలిజెన్స్ టెస్ట్, వెర్బల్ టెస్ట్, నాన్ వెర్బల్ టెస్ట్, సామాజిక అంశాలపై ఉన్న అవగాహన, తార్కిక విశ్లేషణ సామర్థ్యాలను పరీక్షిస్తారు. అదేవిధంగా పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్షన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇలా మొత్తం అయిదు రోజుల పాటు ఈ ప్రక్రియ సాగుతుంది. ఇందులోనూ తుది జాబితాలో నిలిచిన వారికి ప్రాథమికంగా నేషనల్ డిఫెన్స్ అకాడమీ–పుణె, నేవల్ అకాడమీ (ఎజిమల)లో శిక్షణ ఇస్తారు.



రాత పరీక్షలో సక్సెస్‌కు మార్గం

- పేపర్–1లో మంచి మార్కులు సాధించాలంటే.. అల్జీబ్రా, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్, అనలిటికల్ జామెట్రీ, ఇంటిగ్రల్ కాలిక్యులస్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ అల్జీబ్రా, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, ట్రిగ్నోమెట్రీ అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి.
- పేపర్–2లో రాణించేందుకు బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్, వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, చరిత్ర–భారత స్వాతంత్ర్యోద్యమం, జాగ్రఫీ, కరంట్ అఫైర్స్‌లను క్షుణ్నంగా అవగాహన చేసుకోవాలి. పాత ప్రశ్న పత్రాలు, ఆయా విభాగాలకు ఇచ్చిన వెయిటేజీ ఆధారంగా ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి.
- ఫిజిక్స్‌లో.. ఎలక్ట్రోమాగ్నటిజం, మెకానిక్స్, డైనమిక్స్‌లోని అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- కెమిస్ట్రీలో.. కెమికల్ అనాలసిస్, ఇనార్గానిక్ కాంపౌండ్స్, పిరియాడిక్ టేబుల్స్, కాన్సెప్ట్ ఆఫ్ ఫిజికల్ కెమిస్ట్రీ, ఈక్విలిబ్రియమ్, థర్మోడైనమిక్స్, క్వాంటమ్ మెకానిక్స్‌పై ప్రధానంగా దృష్టి సారించాలి.
- జనరల్ సైన్స్‌లో.. వ్యాధులు–కారకాలు, ప్లాంట్ అనాటమీ, మార్ఫాలజీ, యానిమల్ కింగ్ డమ్‌లపై అవగాహన పెంచుకోవాలి.
- కరెంట్ అఫైర్స్ కోసం పరీక్ష తేదీకి ముందు ఆరు నెలల వ్యవధిలో జరిగిన సమకాలీన పరిణామాలపై దృష్టి సారించాలి.
- హిస్టరీకి సంబంధించి రాజులు–రాజ వంశాలు, చారిత్రక కట్టడాలు, స్వాతంత్ర్యోద్యమ సంఘటనలు తదితర అంశాలను అధ్యయనం చేయాలి.
- భౌగోళిక శాస్త్రానికి సంబంధించి ప్రకృతి వనరులు, విపత్తులు, నదులు, పర్వతాలు, పర్యావరణం వంటి అంశాల్లో పట్టు సాధించడం మేలు చేస్తుంది.



ఆలయ ముఖ మండపంలో సహస్ర కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు

యాదాద్రిలో ముగిసిన జయంత్యుత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంతో పాటు శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీనృసింహ జయంతి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. యాదాద్రి ప్రధానాలయంలో నిత్య హవనాలు నిర్వహించిన అర్చకులు ప్రథమ ప్రాకారంలోని యాగశాలలో పూర్ణాహుతి, ముఖ మండపంలో బంగారు, వెండి, రాగి వంటి సహస్ర కలశాలకు పూజలు చేసి, స్వయంభూ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. ఇక రాత్రి నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావ ప్రవచనం, నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి, మంగళ నీరాజనం నిర్వహించి, ఉత్సవాలు ముగించారు. పూర్వగిరి ఆలయంలో సైతం ఉదయం పూర్ణాహుతి, శతఘటాభిషేకం, సాయంత్రం నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం వంటి పూజలు జరిపించారు. ఆయా కార్యక్రమాల్లో దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు దంపతులు పాల్గొన్నారు. ఇక.. గురువారం నుంచి నిత్య, శాశ్వత కల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవాలు పునఃప్రారంభం కానున్నాయి.

ప్రతి అంగన్‌వాడీలో ఓ టాయ్‌లెట్



- ఒకే రూపురేఖలతో అన్ని కేంద్రాలు
- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. మౌలిక వసతులు కల్పించి ప్రీ ప్రైమరీ పాఠశాల స్థాయిలో వీటిని తీర్చిదిద్దాలని భావిస్తోంది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుత పరిస్థితులపై రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్రాల వారీగా నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలన్నీ ఒకే విధమైన రూపంలో ఉండే విధంగా రంగులు వేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ తయారు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వయోవృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, సంచాలకురాలు నిర్మల కాంతి వెస్లీ, వికలాంగుల సంక్షేమ శాఖ సంచాలకురాలు బి.శైలజ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కాళేశ్వరం బ్యారేజీలకు శాస్త్రవేత్తల బృందం

- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించిన సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తలు
- నేడు సుందిళ్ల బ్యారేజీ సందర్శన
- బ్యారేజీల్లో లోపాలపై అధ్యయనం



మేడిగడ్డలో పగుళ్లు తేలిన 20వ పియర్‌ను చూస్తున్న శాస్త్రవేత్తల బృందం

కాళేశ్వరం/ సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల్లోని లోపాలపై అధ్యయనంలో భాగంగా పుణేలోని సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) శాస్త్రవేత్తలు రాష్ట్రానికి చేరుకున్నారు. జీఎస్ ఎడ్లబడ్కార్ (జియో టెక్నికల్ పరీక్షల నిపుణుడు), ధనుంజయ నాయుడు (జియో ఫిజికల్ పరీక్షల నిపుణుడు), ప్రకాశ్ పాలీ (నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ నిపుణుడు)తో కూడిన బృందం బుధవారం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించింది. ఇరిగేషన్ సీఈ సుధాకర్‌రెడ్డి, ఇతర ఇంజనీర్లతో కలసి ఈ బృందం పరీక్షలు నిర్వహించింది. బృందం సభ్యులు ముందుగా మేడిగడ్డ బ్యారేజీ వంతెనపైన కాలినడకన వెళ్లి పరిశీలించారు. గత ఏడాది అక్టోబర్ 21న కుంగిన 7వ బ్లాక్‌లోని పియర్‌ను, అడుగు భాగం ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరీక్షించారు. కుంగుబాటుకు గల కారణాలను సీఈని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు చేసిన పరీక్షల వివరాలను అడిగారు. బ్యారేజీ ఎగువ, దిగువ ప్రవాహ ప్రాంతాల్లో తిరిగారు. కుంగిన పియర్‌లు, క్రస్టుగేట్లు, అక్కడి పరిసరాలను ఫొటోలు తీసుకున్నారు. బ్యారేజీ 7వ బ్లాక్‌లో 15 నుంచి 21వ పియర్ వరకు ఉన్న ఇసుక మేటలు, గేట్ల మరమ్మతు పనులను పరిశీలించారు. గంటపాటు మేడిగడ్డను పరిశీలించిన అనంతరం అన్నారం బ్యారేజీకి వెళ్లారు. అక్కడ సీఈ, ఈఈ యాదగిరిలు వారికి బ్యారేజీలో ఏర్పడ్డ సీపేజీ బుంగలు, చేపట్టిన మరమ్మతుల వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం బ్యారేజీ డౌన్ స్ట్రీమ్‌లో చేస్తున్న సీసీ బ్లాక్ పనులను చూశారు. ఎగువన ఇసుక మేటలను చూసి త్వరగా వాటిని తొలగించాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. ఈ బృందం గురువారం సుందిళ్ల బ్యారేజీని సందర్శించనుంది.

మూడు కేంద్ర సంస్థలతో పరీక్షలు..

కాగా, బృందం పర్యవేక్షణలో బ్యారేజీలకు జియోటెక్నికల్, జియోఫిజికల్ పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలకు సీడబ్ల్యూపీఆర్ఎస్‌తో పాటు ఢిల్లీలోని సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్), హైదరాబాద్‌లోని నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ)తో జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు నిర్వహించిన తర్వాతే శాశ్వత మరమ్మతులను నిర్వహించాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ ఇటీవల మధ్యంతర నివేదికలో సిఫారసు చేసింది. దీంతో ప్రతిష్టాత్మకమైన ఈ మూడు కేంద్ర ప్రభుత్వ సంస్థలతో పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తల బృందం తమ పరిశోధనలను ఇప్పటికే ప్రారంభించగా, త్వరలో ఎన్జీఆర్ఐ, సీఎస్ఎంఆర్ఎస్ సంస్థల నుంచి సైతం శాస్త్రవేత్తలు పని ప్రారంభిస్తారని నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. ప్రతి బ్యారేజీకి రెండు సంస్థలతో వేర్వేరుగా ఈ పరీక్షలు నిర్వహించిన అనంతరం అవి సమర్పించే నివేదికల ఆధారంగా మరమ్మతులు నిర్వహించాలని సోమవారం జరిగిన రాష్ట్రమంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.



ముత్యాల నగరంలో మత్స్యకన్యలు

దేశంలోనే మొదటిసారిగా సాగర కన్యల జల ప్రదర్శన • ఫిలిప్పీన్స్ నుంచి వచ్చిన జలకన్యలు
అమెజాన్ నది నుంచి అరుదైన చేపలు • అబ్బురపరుస్తున్న అండర్ వాటర్ మెర్మెయిడ్ షో

సాక్షి, హైదరాబాద్: మత్స్యకన్యలు, సాగర కన్యల గురించి కథలుగా చెప్పుకోవడం, సినిమాల్లో చూడటం తప్ప నిజంగా వారిని చూసిన వారెవరూ లేరు. అయితే ఈ జల కన్యలు ఉన్నది వాస్తవమో కాదో కానీ... హైదరాబాద్ నగరానికి చేరుకున్న మత్స్య కన్యలు మాత్రం అందరినీ ఆశ్చర్యచకితులను చేస్తున్నారు. దేశంలో మొట్టమొదటిసారిగా కూకట్‌పల్లిలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ టన్నెల్ డబల్ డెక్కర్ ఎగ్జిబిషన్ మెర్మెయిడ్ షోలో మనం చూస్తుంది నిజమేనేమో అనిపించేలా మత్స్యకన్యలు ఆకట్టుకుంటున్నారు.



జలకన్యలను చూస్తూ ఆనందిస్తున్న సందర్శకులు

ఫిలిప్పీన్ సాగర కన్యలు.. అమెజాన్ చేపలు..

అండర్ వాటర్ టన్నెల్ డబల్ డెక్కర్‌ను ఏర్పాటు చేసి, అందులో అరుదైన చేపల ప్రదర్శన, స్కూబా డైవింగ్ వంటి వినూత్న ప్రదర్శనలు ఏర్పాటు చేయడం నగరవాసులకు పరిచయమే. కానీ ఊహాజనిత కథలుగా చెప్పుకునే సాగరకన్యలు, హాలీవుడ్ సినిమాల్లో అందంగా కనిపించే మత్స్యకన్యల ప్రదర్శన మాత్రం దేశంలోనే ఇదే మొదటిసారి. దీని కోసం పసిఫిక్ మహాసముద్రంలో ప్రదర్శననిచ్చే ఫిలిప్పీన్‌కు చెందిన ఆరుగురు యువతులు నగరానికి చేరుకున్నారు. మర్మెయిడ్‌గా పిలుచుకునే వీరు జల కన్యల వస్త్రధారణతో 8 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అండర్ వాటర్ టన్నెల్‌లో ఆక్సిజన్ లేకుండా ప్రదర్శన చేయడం సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. ఈ మమెడ్ షోలు గతంలో దుబాయ్, థాయ్‌లాండ్, హాంకాంగ్ వంటి దేశాలకు మాత్రమే పరిమితం. ఈ అండర్ వాటర్‌లో సింగపూర్, మలేసియాతో పాటు అమెజాన్ నది నుంచి తీసుకువచ్చిన 600 అరుదైన చేపలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అంతేకాకుండా ఇక్కడి స్కూబా డైవింగ్ కూడా మంచి అనుభూతిని అందిస్తుంది. మరో 37 రోజుల వరకు ఈ ప్రదర్శన జరగనుందని నిర్వాహకులు తెలిపారు.

విజ్ఞానం, వినోదమే లక్ష్యంగా..

విదేశాల్లో మాత్రమే చూడగలిగే మెర్మెయిడ్ షోను కోట్ల రూపాయల వ్యయంతో, ఎంతో వ్యయప్రయాసలకోర్చి నగరంలో ఏర్పాటు చేశాం. ఎగ్జిబిషన్ రంగంలో మాకు 39 ఏళ్ల అనుభవం ఉంది. ప్రజలకు అద్భుత అనుభూతిని అందించేందుకు ఫిలిప్పీన్స్ నుంచి జలకన్యలను తీసుకువచ్చాం. ఆక్సిజన్ లేకుండా నిమిషానికిపైగా నీటిలోనే ఉంటూ ప్రదర్శన ఇవ్వడం అరుదైన కళ. వీటితో పాటు 27కు పైగా అమ్యూజ్‌మెంట్ గేమ్స్ ఉన్నాయి. ముఖ్యంగా విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందిస్తున్నాం. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుంది. షో మాత్రం మధ్యాహ్నం 3 గంటల నుంచి అందుబాటులో ఉంటుంది.

– రాజారెడ్డి, నిర్వాహకుడు



'వందేభారత్' నత్తనడక..

హైదరాబాద్‌కు చెందిన ప్రసాద్ విజయవాడకు అత్యవసరంగా వెళ్లాల్సి వచ్చి వందేభారత్‌లో టికెట్ బుక్ చేసుకున్నాడు. కానీ, ఆ రోజు రైలు దాదాపు మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. తక్కువ టికెట్ ధర ఉన్న రైళ్ల కంటే ఆలస్యంగా అది విజయవాడకు చేరింది. వందేభారత్ సర్వీసు మొదలైన 16 నెలల కాలంలో ఈ తరహా సమస్యలు తక్కువే, కానీ, ఇటీవల తరచూ చోటు చేసుకుంటున్నాయి. వెంటవెంటనే ఏర్పడుతుండటం ఇటు ప్రయాణికులకు చికాకు తెప్పిస్తుండగా, రైల్వే అధికారులను కలవరపెడుతున్నాయి.

గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్న సర్వీసులు

- వారంరోజుల్లో నాలుగు పర్యాయాలు విశాఖపట్నం రైలు జాప్యం
- వారం క్రితం ఏకంగా ఐదు గంటల ఆలస్యం
- రెండు రోజుల క్రితం రెండు గంటల జాప్యం



సాక్షి, హైదరాబాద్: భారతీయ రైల్వే ఆధునికతకు అద్దంపడుతూ దూసుకొచ్చిన 'వందేభారత్'కూ సాంకేతిక సమస్యలు తప్పడం లేదు. రైళ్లలో సాంకేతిక సమస్యలు సాధారణమే అయినా, క్రమంగా ఆ సమస్య పెరుగుతోంది. దూర ప్రాంతాల మధ్య తిరిగే సాధారణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు మూడు జతల రేకు(ఓ రైలు సెట్) ఉంటుంది. ప్రయాణ సమయం దాదాపు 26 గంటలు తీసుకునే హైదరాబాద్–ఢిల్లీ తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌ను తీసుకుంటే.. హైదరాబాద్‌లో ఉదయం ఒక రైలు బయలు దేరగా, దాని ఒక జత రైలు అదే రోజు ఢిల్లీలో బయలుదేరుతుంది. మరో జత రైలు దారిలో ఉంటుంది. తక్కువ దూరం తిరిగే వాటికి రెండు జతలుంటాయి.

- హైదరాబాద్–విశాఖపట్నంలాంటి సాధారణ దూరం తిరిగే (సగం రోజు ప్రయాణ సమయం) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను తీసుకుంటే.. ఒక రైలు హైదరాబాద్‌లో బయలుదేరుతుంటే, అదే సమయానికి దాని జత రైలు విశాఖపట్నంలో బయలుదేరుతుంది.
- హైదరాబాద్‌లో ఉదయం బయలుదేరే తిరుపతి వందేభారత్ రైలు, అదే రోజు మధ్యాహ్నం తిరుపతి చేరుకొని, కాసేపటికే అక్కడ బయలుదేరి రాత్రి హైదరాబాద్‌కు చేరుకుంటుంది.

దేశంలోని అన్ని వందేభారత్ రైళ్లది ఇదే తీరు. ఇక్కడే ఇప్పుడు సమస్య ఏర్పడుతోంది. ఒక చోట రైలు బయలుదేరేప్పుడు సాంకేతిక సమస్య ఏర్పడి ఆలస్యంగా బయలుదేరితే, గమ్యస్థానం చేరి, తిరిగి అక్కడ బయలుదేరేందుకు జాప్యం తప్పటం లేదు.

- ఈనెల 16న విశాఖపట్నంలో హైదరాబాద్ వచ్చే వందేభారత్ రైలు మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. విజయవాడలో మరో రెండు గంటలు ఆలస్యమైంది. వెరసి ఐదు గంటలు ఆలస్యంగా హైదరాబాద్ చేరుకుంది. సాధారణ రోజుల్లో హైదరాబాద్‌లో మధ్యాహ్నం 3 గంటలకు తిరుగుప్రయాణం ఉండాల్సి ఉండగా, ఐదు గంటలు ఆలస్యంగా రాత్రి 8 గంటలకు ఆ రైలు బయలుదేరాల్సి వచ్చింది.

ఒక కోచ్‌లో సాంకేతిక సమస్య తలెత్తితే రైలు ఆగిపోవాల్సిందే..

ఇక వందేభారత్ డిజైన్ కూడా ఈ జాప్యానికి మరో కారణమవుతోంది. ఇది సంప్రదాయ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు భిన్నంగా ఉంటుంది. డెమూ, మెమూ తరహాలో రెండు ఇంజిన్లు రైలులో అంతర్భాగంగా ఉంటాయి. మూడునాలుగు కోచ్‌లు కలిపి ఒక సెట్‌గా ఉంటుంది. దీనికి పవర్‌కార్ జత కలిసి ఉంటుంది. హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ రైళ్లు కూడా ఇదే డిజైన్‌తో ఉంటాయి. ఓ కోచ్‌లో సాంకేతిక సమస్య తలెత్తితే, ఆ కోచ్ ఉండే సెట్ మొత్తాన్ని తొలగించి దాని స్థానంలో మరో సెట్ చేర్చి రైలును పంపేస్తారు. తర్వాత.. సాంకేతిక సమస్య తలెత్తిన కోచ్‌ను డిపోనకు తీసుకెళ్లి మరమ్మతు చేస్తారు. ఇందుకోసం స్పేర్ కోచ్‌లను అందుబాటులో ఉంచుతారు. హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ సర్వీసుకు 12 కోచ్‌లతో కూడిన రెండు రేక్‌లు స్పేర్ విధుల్లో ఉన్నాయి. కానీ వందేభారత్‌కు స్పేర్ కోచ్ సెట్‌లు లేవు. ఓ కోచ్‌లో సమస్య తలెత్తితే దానికి మరమ్మతు చేసేవరకు మొత్తం రైలును నిలిపివేయాల్సిందే. వారంరోజుల క్రితం విశాఖపట్నం నుంచి ఐదు గంటలు ఆలస్యంగా రావటానికి ఇదే కారణమైంది.



నీతా అంబానీకి పంపిన 50 మోడల్స్‌లోని ఒక ఫిలిగ్రీ బాక్స్

అంబానీల అతిథులకు కరీంనగర్ కానుకలు

400 ఫిలిగ్రీ వస్తువులకు ఆర్డర్ ఇచ్చిన కుబేరుల కుటుంబం

విద్యానగర్ (కరీంనగర్): ప్రపంచ దేశాల ప్రజలను ఆకట్టుకున్న కరీంనగర్ ఫిలిగ్రీ కళానైపుణ్యం మరోసారి తన వైభవాన్ని చాటుకుంటోంది. ఆర్థిక కుబేరుడు ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్–రాధిక వివాహ వేడుకలు భారీ స్థాయిలో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ వేడుకలకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖులతోపాటు బాలీవుడ్‌లోని పెద్దస్టార్స్ కూడా హాజరుకానున్నారు. ఈ పెళ్లికి హాజరయ్యే వీవీఐపీలకు విలువైన బహుమతులను ఇచ్చేందుకు అంబానీ కుటుంబం నిర్ణయించింది. వాటిలో కరీంనగర్ వెండి ఫిలిగ్రీ కూడా ఉన్నాయి. ఈ విలువైన ఫిలిగ్రీ గిఫ్ట్ డెలివరీ కోసం దాదాపు 400 రకాల వస్తువుల ఆర్డర్స్ వచ్చినట్లు కరీంనగర్ హ్యాండీక్రాఫ్ట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అర్రోజు అశోక్ తెలిపారు. ఇందులో నగల పెట్టెలు, పర్సులు, ట్రేలు, పండ్ల గిన్నెలు, ఇతరత్రా వస్తువులు ఉన్నట్లు వెల్లడించారు. అంబానీ తీసుకున్న ఈ నిర్ణయం 400 సంవత్సరాల నాటి పురాతన కళకు ప్రోత్సాహకంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ పురాతన హస్తకళకు 2007లో జీఐ ట్యాగ్ లభించింది. స్వచ్ఛమైన వెండిని కరిగించి.. అవసరమైన ఆకారాల్లో వస్తువులు తయారు చేయడం, తీగలు అల్లడం ఈ కళ విశేషం.

మీ సెల్‌ఫోన్ బ్లాక్ అవుతుంది..

'ట్రాయ్' పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: అదనపు డీజీ మహేశ్ భగవత్

సాక్షి, హైదరాబాద్: ప్రజలను మోసగించడమే పనిగా పెట్టుకున్న సైబర్ నేరగాళ్లు కొత్తగా భారత టెలికం నియంత్రణ ప్రాధికారిక సంస్థ (ట్రాయ్) రికార్డెడ్ ఫోన్‌కాల్స్‌తో మోసాలకు తెరతీశారు. మరో రెండు గంటల్లో మీ సెల్‌ఫోన్ బ్లాక్ అవుతుందంటూ రికార్డెడ్ కాల్స్‌ను పంపిస్తూ ఫోన్‌నంబర్, ఆధార్ కార్డు, ఇతర వివరాలు సేకరించి మోసం చేస్తున్నారు. గత రెండు నెలలుగా ట్రాయ్ పేరుతో వస్తున్న ఇలాంటి కాల్స్ సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రధానంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ట్రాయ్ పేరుతో వచ్చే ఇలాంటి ఫోన్‌కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని అదనపు డీజీ, ఇన్‌చార్జి సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ మహేశ్ భగవత్ సూచించారు. ట్రాయ్ పేరుతో సేకరించిన వివరాలతో సైబర్ కేటుగాళ్లు పోలీస్ అధికారుల పేరుతో ఫోన్లు చేసి ఎఫ్ఐఆర్ నమోదైందని బెదిరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కేసు నుంచి తప్పించాలంటే డబ్బులు పంపాలని బెదిరిస్తున్నారని, ఇలాంటి ఫోన్‌కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీజీ సూచించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా గుర్తు తెలియని నెంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను లిఫ్ట్ చేయవద్దని సూచించారు. ఈ తరహా సైబర్ నేరాల బారిన పడితే తక్షణం టోల్ ఫ్రీ నెంబరు 1930కి ఫోన్ చేయాలని సూచించారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.